అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శనివారం 30-3-2024

సంపుటి : 10 | సంచిక : 89 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

మొన్న జర్మనీ...నిన్న అమెరికా...నేడు ఐరాస

కేజ్రీవాల్ అరెస్టుపై స్పందిస్తున్న అంతర్జాతీయ సమాజం



- ప్రజల హక్కుల రక్షణపై ఐరాస ఆశాభావం



న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఐక్యరాజ్యసమితి స్పందించింది. భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ అరెస్టుపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ బదులిస్తూ 'భారత్ సహా ఎన్నికలు జరిగే ఏ దేశంలో అయినా రాజకీయ, పౌర హక్కులు సహా ప్రజలందరి హక్కులకు రక్షణ లభిస్తుందని ...13లో



ఆ ఇద్దరిపై పగ తీర్చుకోవాలె..

రంజిత్, మహేందర్ పార్టీని మోసం చేశారు

- కాళ్లు పట్టుకుని బతిమిలాడినా మళ్లీ చేర్చుకునేది లేదు : చేవెళ్ల లోక్‌సభపై సమీక్షలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పార్టీకి ద్రోహం చేసి పోయిన గడ్డం రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ కార్యకర్తలు పగ తీర్చుకోవాల్సిన అవసరముంది...' అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో వారిద్దరికీ తగిన బుద్ధి చెప్పాలంటూ ఆయన పిలుపునిచ్చారు. కేకే, కడియం లాంటి సీనియర్లు సైతం కష్టకాలంలో పార్టీని వదిలిపెట్టి వెళుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోయే వాళ్లు పార్టీపై కొన్ని రాళ్లు వేసి పోతారనీ, వారు చేస్తున్న విమర్శలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చేవెళ్ల లోక్‌సభ స్థానంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్... పార్టీని వీడిన నేతలపైనా, వారి వ్యవహారశైలిపైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపై విరుచుకుపడ్డారు.

కొంతమంది నాయకులు పార్టీని వదిలేసినా, తాను మాత్రం కార్యకర్తల కోసం పని చేస్తానని తెలిపారు. 'ఇన్ని రోజులు పార్టీ కోసం, నాయకుల కోసం పని చేసిన క్యాడర్ కోసం నేను ఇప్పుడు స్వయంగా వస్తా.. రానున్న స్థానిక ...5లో


ఫోన్ ట్యాపింగ్ తప్పు కాదా..?

కేటీఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు

జైల్లో చిప్పకూడు తినాల్సి వస్తుంది

- వాల్మీకి, బోయలను ఆదుకుంటాం
- ఎన్నికల తర్వాత సంపత్‌కు మంచి పదవి

భారీ మెజార్టీతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గెలవబోతున్నాం : సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ చేసి, భార్యాభర్తలు ఏం మాట్లాడుకున్నారో కూడా విన్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ట్యాపింగ్ చేసి వింటే ఏమవుతుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారనీ, అలా చేసిన వారు జైల్లో చిప్పకూడు తినాల్సి వస్తుందని హెచ్చరించారు. కేటీఆర్ బరితెగించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి తగిన ఫలితం ఉంటుందని హెచ్చరించారు. ట్యాపింగ్‌పై విచారణ జరుగుతుందనీ, తప్పకుండా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతిపక్షంలో ఉండి కూడా ఆనాడే తాము అధికారులకు చెప్పినా వినలేదన్నారు. ఇవాళ జైలుకు వెళ్తే.. అటు వైపు బీఆర్ఎస్ నేతలెవరూ చూడటం లేదన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డితో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీఎం విలేకర్లతో మాట్లాడారు. తనకు ఓటు విలువ తెలుసునన్నారు. అందుకే ఢిల్లీ నుంచి వచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసినట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌రెడ్డి, నాగర్ కర్నూల్ నుంచి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 200 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ గెలవబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికల్లో పాలమూరులో కాంగ్రెస్‌ను దెబ్బతీసే కుట్ర జరుగుతున్నదనీ, తనను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ ఏకమయ్యాయని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు డీకే అరుణ ఏం చేశారని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు ఆమె జాతీయ హోదా తీసురావచ్చు కదా? అని ప్రశ్నించారు. కానీ, పార్టీలో మాత్రం జాతీయ పదవి తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత సంపత్‌కు కాంగ్రెస్‌లో మంచి పదవి వస్తుందని భరోసా ఇచ్చారు. వాల్మీకి, బోయలను ఆదుకునే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. గద్వాల్, అలంపూర్ ప్రాంతంలోని బోయల గురించి తనకు తెలుసని చెప్పారు. ఇప్పుడు వారందరూ ఒకవైపు రావాలని కోరారు. ఎవరు ఏ సమస్యతో వచ్చినా వాటి పరిష్కారం కోసం పని చేస్తానని భరోసా ఇచ్చారు.

దేశానికే తెలంగాణ మోడల్

- జాతీయ నాయకత్వం కితాబు మనకు గర్వకారణం 5లో..
- తుక్కుగూడ సభపై ఫోకస్
- ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి : కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశంలో రేవంత్

మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు

రిమాండ్




(ఫైల్)

ఫోన్ ట్యాపింగ్ కేసులో కస్టడీలోకి అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న

విచారిస్తున్న స్పెషల్ టీం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన విపక్ష ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్ కేసులో నగర మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకి 14రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ.. నాంపల్లి 14వ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాధాకిషన్ రావును పంజాగుట్ట స్పెషల్ టీం పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకుముందు గురువారం ఆయనను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన దర్యాప్తు అధికారులు ఫోన్ ట్యాపింగ్ అంశంపై సుదీర్ఘంగా విచారించారు. ముఖ్యంగా నగరం లో కొందరి ప్రముఖుల ఫోన్ ట్యాపింగ్‌తో పాటు మరికొందరు హవాలా వ్యాపారులను బెదిరించి వారి నుంచి డబ్బులు దండుకున్నారన్న అంశాలపై అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. అనంతరం డీఎస్పీ ప్రణీత్‌రావుతో కలిసి ప్రతిపక్షానికి చెందిన ఎంతోమంది నాయకుల ఫోన్ ట్యాపింగ్ లకు పాల్పడ్డారనే విషయంపై కూడా ఆరా తీసినట్టు తెలిసింది. అదే సమయంలో కోర్టు ఇచ్చిన అనుమతి మేరకు శుక్రవారం అదుపులోకి తీసుకున్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలతో కలిపి రాధాకిషన్‌రావుని అధికారులు విచారించినట్టు తెలిసింది. ప్రధానంగా ఎవరి ఆదేశాల మేరకు ఈ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారానికి పాల్పడ్డారని రాధాకిషన్‌రావుని పలుమార్లు దర్యాప్తు అధికారులు నిలదీసినట్టు సమాచారం. అయితే ఈ ముగ్గురు కూడా తాము తమ పైఅధికారి(ఎస్ఐబీ మాజీ ఛీఫ్ ప్రభాకర్‌రావు) ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు సమాధానం ఇచ్చారని తెలిసింది. మరోవైపు కొందరి అప్పటి పొలిటికల్ బాసులు ఇచ్చిన ఆదేశాలను కూడా అమలు చేశారా అనే ప్రశ్నకు వీరు సమాధానాలు దాటవేసినట్టు తెలిసింది. నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్నప్పుడు తన కింద ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసుకొని దాని ద్వారా కొందరి వ్యాపారస్తులు, బంగారు షాపుల యజమానుల ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి వారి నుంచి డబ్బులు దండుకున్నారా అనే కోణంలో కూడా స్పెషల్ టీం అధికారులు రాధాకిషన్ రావుని ప్రశ్నించినట్టు తెలిసింది. మధ్యాహ్నం 3గంటలకు విచారణను పూర్తిచేసి అరెస్టు చేసిన రాధాకిషన్ రావును సాయంత్రం కొంపల్లిలోని న్యాయమూర్తి నివాసంలో పంజాగుట్ట పోలీసులు హాజరుపరిచారు. ఈ మేరకు రాధాకిషన్‌రావును 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపుతూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో అరెస్టైన నిందితులపై కొత్తగా టెలిగ్రాఫ్ చట్టం కింద కేసులను నమోదు చేస్తున్నట్టు ఒక మెమోను కూడా దర్యాప్తు అధికారులు కోర్టుకు సమర్పించారు. కాగా మరోవైపు ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను మరింత లోతుగా విచారించి ఫోన్ ట్యాపింగ్‌లకు సంబంధించిన వివరాలను సేకరించడానికి దర్యాప్తు అధికారులు సిద్ధమయ్యారు. వీరిచ్చిన సమాచారం మేరకు మరికొందరు పోలీస్ అధికారులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించనున్నారు. ఇందులో ఒక డీసీపీ స్థాయి అధికారి కూడా ఉన్నట్టు తెలిసింది.



అన్సారీ మృతికి వారం ముందే...

నివేదిక కోరిన ప్రత్యేక కోర్టు

- జైలు అధికారులకూ ఆదేశాలు
- విషప్రయోగంపై తన పిటిషన్‌లో అన్సారీ తీవ్ర ఆరోపణలు
- వైద్య చికిత్స, సౌకర్యాలు, భద్రత కల్పించాలన్న న్యాయస్థానం
- పట్టించుకోని జైలు అధికారులు
- యోగి సర్కారు తీరుపై రాజకీయ నాయకుల ఆగ్రహం 13లో.



(ఫైల్)

పోటీకి సై



13లో.

ఆర్జేడీ 26.. కాంగ్రెస్ 9.. వామపక్షాలకు 5

బీహార్‌లో కుదిరిన ఇండియా సీట్ల పంపకం

లోక్‌సభ ఎన్నికల్లో 40 స్థానాల్లో పోటీకి సిద్ధమైన కూటమి


సీ-విజిల్ ద్వారా 79 వేల ఫిర్యాదులు : సీఈసీ



న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు తాము ప్రారంభించిన సీ-విజిల్ మొబైల్ అప్లికేషన్‌కు మంచి స్పందన లభిస్తోందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించినప్పటి నుండి 79,000కు పైగా ఫిర్యాదులు అందాయని చెప్పింది. 99 శాతం ఫిర్యాదులను పరిష్కరించామని, వీటిలో 89 శాతం ఫిర్యాదులను అవి అందిన వంద నిమిషాలలోనే ...13లో

92.68 శాతం రైతుబంధు చెల్లింపులు పూర్తి

ఎన్నికల తర్వాత రైతు భరోసా అమలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో రైతుబంధు చెల్లింపులు 92.68 శాతం పూర్తయ్యాయి. యాసంగి చెల్లింపుల్లో రూ.5,575 కోట్లకు పైగా సొమ్మును రైతుల ఖాతాల్లో జమచేశారు. ఈ ఏడాది మార్చి 28వ తేదీ నాటికి మొత్తం 64,75,320 మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు డబ్బులను ...13లో

భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరాలి



నాటి వారసత్వాన్ని, నేటి పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం



- సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ
- అవకాశవాద రాజకీయాలను ఓడించండి
- ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే వారికి పట్టం కట్టండి
- సీపీఐ(ఎం)ను గెలిపిస్తేనే సమస్యలు పరిష్కారం
- డబ్బుతో విర్రవీగే వారికి బుద్ధి చెప్పండి
- పార్టీల విధానాలు, అభ్యర్థుల చరిత్ర, త్యాగాలను చూసి ఓటేయండి
- నవతెలంగాణతో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ వివరాలు 3లో..

తెలంగాణలో పొలిటికల్ ట్రెండ్

పదవే పరమార్థం



చొక్కాలు మార్చినంత ఈజీగా పార్టీల మార్పు

- గెలుపు, అధికారం, దబ్బే ప్రధానం
- సిద్ధాంతాలు, విలువలకు తిలోదకాలు

"స్మశాన వాటిక ముందు ముగ్గుండదు... రాజకీయ నాయకులకు సిగ్గుండదు" అని ఓ సినిమా డైలాగ్. ప్రస్తుత బూర్జువా రాజకీయాలకు బాగా సరిపోతుంది...పదేండ్లు అంటకాగి, రాత్రికి రాత్రి పార్టీ మారగానే.... సొంత ఇంటికొచ్చినంత ఆనందంగా ఉందని ఒకరంటే, పుట్టింటికొచ్చిన అనుభూతి కలుగుతుందని మరొకరూ నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు. సిద్ధాంతాలు, విలువలకు తిలోదకాలిచ్చి, అధికారం, పదవీ, డబ్బే ప్రధానంగా తెలంగాణలో రాజకీయ క్రీడ సాగుతోంది.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్ల బీజేపీ పాలనలో ప్రతి పక్షాలు కకావికలమయ్యాయి. అధికార కాషాయ పార్టీ ప్రతీకార రాజకీయాలకు కొన్ని చోట్ల వైరి పక్షాల ఉనికే ప్రశ్నార్థకమైంది.. ఇది దేశంలో పరిస్థితి. అయితే అలాంటి నిర్బంధ వాతావరణం రాష్ట్రంలో లేకపోయినప్పటికి అధికారం, పదవి, డబ్బే ప్రధానంగా మారడంతో... గతంలో బీఆర్ఎస్ ఎంత ఉచ్ఛ స్థితిని అనుభవించిందో ఇప్పుడు అంతటి హీన స్థితిని ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో ఎవరెవరు ప్రత్యర్థులుగా తలపడ్డా చివరికి అధికాంరంవైపే అందరూ పయనమవుతున్నారు. గెలుపు, అధికారమే పరమావధి తప్ప ... ప్రజా సేవ చేయడానికే వచ్చామని ఎవరైనా అంటే ప్రజలు నవ్వుకునే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎంపీల నుంచి మొదలుకుని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యులు తమను తాము రక్షించుకునేందుకు పార్టీలు మారుతున్నారు. పెద్దపల్లి ఎంపీ సీటును కొప్పుల ఈశ్వర్‌కు ప్రకటిస్తారని తెలియగానే బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేత పార్టీ ఫిరాయించి కాంగ్రెస్ పంచన చేరారు. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి టికెట్ ఇచ్చినా...గులాబీ బాస్ చెప్పినా.. రాత్రికి రాత్రే హస్తం గూటికి చేరి అదే పార్టీ నుంచి టికెట్ సంపాదించుకున్నారు. జహీరాబాద్, నాగర్ కర్నూల్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు బీబీ.పాటిల్, రాములు బీజేపీ తీర్థం పుచ్చుకుని ఆ పార్టీ నుంచి మళ్లీ బరిలో నిలిచారు. అయితే రాములు ...3లో



ఉపా కింద బ్యాంక్ ఖాతాలను

స్తంభింపచేయలేరు

మద్రాసు హైకోర్టు రూలింగ్



చెన్నై : చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) 1967 కింద బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేయలేమని మద్రాసు హైకోర్టు రూలింగ్ ఇచ్చింది. నిషేధిత సంస్థ కోసం ఆ ఖాతాల్లోని నిధులు ఉపయోగిస్తున్నారు లేదా వాటి కోసం నిర్దేశించబడ్డాయని కేంద్రం విచారణ ద్వారా రుజువు చేసుకుంటే తప్ప ఆ ఖాతాలను ఉపా కింద స్తంభింప చేయలేరని కోర్టు పేర్కొంది. చెన్నైకి చెందిన తమిళనాడు డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ట్రస్టు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను స్తంభింప చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కోర్టు కొట్టివేసింది. జస్టిస్ ఎం.ఎస్.రమేష్, జస్టిస్ సుందర్ మోహన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు రూలింగ్ జారీ చేసింది. యుఏపిఎ కింద నిషేధించబడిన సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ)కి ఈ ఖాతాల ద్వారా సహాయమందిస్తున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇటువంటి నిషేధాజ్ఞప్తు ఆదేశాలు జారీ చేయడానికి ముందుగా అనుసరించాల్సిన విధి విధానాలను యుఏపిఎ లోని సెక్షన్ 7(1) ...3లో

కేసీఆర్ పాపాలే ఆయనకు

చుట్టుకున్నాయి

మంత్రి కోమటిరెడ్డి విమర్శ

- ఆయన అవినీతి బయటపెట్టాలంటే 20 ఏండ్లు పట్టేలా ఉందని వ్యాఖ్య




నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన పాపాలే ఆయనకు చుట్టుకున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. "యాదగిరిగుట్ట ...13లో

సమోసా..బిర్యానీ..టీ

రేట్లు ఫిక్స్ చేసిన పోల్ ప్యానెల్‌లు

- ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి రేట్లలో మార్పులు



న్యూఢిల్లీ : దేశంలో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. పార్టీలు ప్రచారాలలో మునిగిపోతున్నాయి. మరోపక్క, ఎన్నికల సంఘం మాత్రం పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చులపై దృష్టిని సారిస్తున్నాయి. ఇందుకోసం ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నాయి. ఎన్నికల ఖర్చు కోసం సమోసాల నుంచి టీ వరకు పోల్ ప్యానెల్‌లు రేట్లను నిర్ణయిస్తున్నాయి. అయితే, ఇవి ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి మారుతూ ఉన్నాయి. పంజాబ్‌లోని జలంధర్‌లోని అభ్యర్థులు లోక్‌సభ ఎన్నికలలో బహిరంగ సభలు, ప్రచారాలలో భాగంగా ప్రజలకు అందించే ఒక కప్పు టీకి రూ. 15గా ఖర్చు చేయొచ్చు. సమోసాకూ అదే రేటు ఉన్నది. అయితే, మధ్యప్రదేశ్‌లోని మండలాలోని వారు ఒక కప్పు టీ కోసం రూ. 7, దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రధానమైన చిరుతిండిగా భావించే సమోసా ...6లో

బిజినెస్

ఆదివారమూ పని చేయనున్న బ్యాంక్‌లు

- బీమా సంస్థలు తెరిచి ఉంటాయి
- నేడు పనిదినమే..
- రెగ్యులేటరీ సంస్థల ఉత్తర్వులు



ముంబయి : ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో బ్యాంకులు, బీమా సంస్థలు, పన్ను సంబంధిత కార్యాలయాల విభాగాలు పని చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. 2023-24 ముగింపు నేపథ్యంలో శనివారం, ఆదివారం కూడా దేశ వ్యాప్తంగా అన్ని బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలు, శాఖలు తెరుచుకుని ఉండేలా రెగ్యులేటరీ సంస్థలు ఉత్తర్వులు జారీ చేశాయి. ప్రభుత్వ లావాదేవీలకు, ఇతరత్రా చెల్లింపులకు, ట్యాక్స్ చెల్లింపులకు ఆటంకం లేకుండా ఆర్‌బిఐ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రయివేటు రంగంలోని 33 బ్యాంక్‌లు పని చేసేలా ఆర్‌బిఐ ఉత్తర్వులు జారీ చేసింది. నెఫ్ట్, ఆర్‌టిజిఎస్‌తో పాటు చెక్ క్లియరెన్సులు తదితర సేవలు యథాతథంగా కొనసాగుతాయి. వీటితో పాటు స్పెషల్ డిపాజిట్ స్కీమ్, పిపిఎఫ్, కిసాన్ వికాస్ పత్ర, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల్లో డిపాజిట్లను స్వీకరిస్తారు. అయితే బ్యాంక్‌ల్లో సాధారణ సేవలు అందుబాటులో ఉంటాయా..? లేదా అనేది స్పష్టం చేయలేదు.

2023-24లోనే ప్రభుత్వ లావాదేవీలు జరిగినట్లుగా వివరాలు లెక్కలోకి రావాలన్నదే దీని వెనక ప్రధాన ఉద్దేశ్యమని ఆర్‌బిఐ పేర్కొంది. ఆర్‌బిఐ తరహాలోనే ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ సంస్థ ఐఆర్‌డిఎఐ సైతం బీమా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. పాలసీదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్చి 30, 31న కార్యాలయాలు తెరిచి ఉంచాలని ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించింది. మరోవైపు పన్ను సంబంధిత కార్యకలాపాలను పూర్తి చేసేందుకు మార్చి 30, 31న తమ శాఖలన్నీ పని చేస్తాయని ఆదాయ పన్ను విభాగం ఇటీవలే స్పష్టం చేసింది. కాగా.. ఏప్రిల్ 1న మాత్రం రూ.2వేల నోట్ల మార్పిడిని నిలిపివేస్తున్నట్లు ఆర్‌బిఐ పేర్కొంది.

కార్వీ గ్రూప్ సంస్థ గుర్తింపు రద్దు



ముంబయి : కార్వీ గ్రూపునకు చెందిన మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలను నిర్వహించే కార్వీ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్ (కెఐఎస్ఎల్) గుర్తింపును సెబీ రద్దు చేసింది. గతేడాది మార్చిలో సెబీ ఈ సంస్థలో తనిఖీలు నిర్వహించింది. కాగా.. ఆ సంస్థలో ఎటువంటి కార్యకలాపాలు కొనసాగడం లేదని గుర్తించింది. వ్యాపార బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి అవసరమైన సాధనా సంపత్తి లేదని నిర్ధారించింది. అదే విధంగా సంస్థ డైరెక్టర్ ఒకరు సెక్యూరిటీస్ మార్కెట్ వివాదంలో చిక్కుకున్నారు. దీంతో పాటు మర్చంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించడానికి అవసరమైన ఇతర నియమ నిబంధనలు సైతం పాటించడం లేదని, పైగా రిజిస్ట్రేషన్‌ను రెన్యువల్ చేయడానికి ఫీజు చెల్లించలేదని సెబీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే సంస్థ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది.

బ్యాంక్‌ల జిఎన్‌పిఎలు 2.1 శాతానికి తగ్గొచ్చు

- కేర్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే ఆర్థిక సంవత్సరం 2024-25లో బ్యాంక్‌ల స్థూల నిరర్థక ఆస్తులు 2.1 శాతానికి పరిమితం కావొచ్చని కేర్ రేటింగ్ ఏజెన్సీ అంచనా వేసింది. 2023-24లో జిఎన్‌పిఎ 2.5-2.7 శాతంగా ఉండొచ్చని.. మొండి బాకీలు మెరుగుపడొచ్చని పేర్కొంది. అంతర్జాతీయ పరిణామాలకు తోడు నగదు లభ్యత మరింత కఠినతరం కావడం, రెగ్యులేటరీలో మార్పుల వల్ల ఎన్‌పిఎలు తగ్గొచ్చని తెలిపింది. 2013-14లో 3.8 శాతంగా ఉన్న మొండి బాకీలు .. 2017-18 నాటికి ఏకంగా 11.2 శాతానికి ఎగిశాయి. ఆ తర్వాత అనేక పద్దులను మోడీ సర్కార్ పూర్తిగా రద్దు చేయడంతో క్రమంగా ఎన్‌పిఎలు తగ్గుతూ వస్తున్నట్లు కనిపించాయి.

పెరిగిన విదేశీ మారకం నిల్వలు..

ముంబయి : వరుసగా ఐదో వారం భారత విదేశీ మారకం నిల్వలు పెరిగాయి. మార్చి 22తేదితో ముగిసిన వారంలో 140 మిలియన్ డాలర్లు పెరిగి 642.63 బిలియన్ డాలర్లకు చేరయని ఆర్‌బిఐ శుక్రవారం వెల్లడించింది. బంగారం రిజర్వ్ నిల్వలు 347 మిలియన్ డాలర్లు పెరిగి 51.49 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఐఎంఎఫ్‌లో ఫారెక్స్ నిల్వలు 27 మిలియన్ డాలర్లు తగ్గి 4.66 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. 2021 అక్టోబర్‌లో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 645 బిలియన్ డాలర్లతో ఆల్ టైం గరిష్ట స్థాయిని తాకాయి. ఆ తర్వాత తగ్గుతూ వచ్చాయి.

నేటి నుంచి తాజ్ డక్కన్‌లో వస్త్ర ఎగ్జిబిషన్

హైదరాబాద్ : నగరంలోని తాజ్ డక్కన్‌లో మూడు రోజుల పాటు బ్రాండెడ్ దుస్తులు, వివిధ ఉపకరణాల ఎగ్జిబిషన్, అమ్మకాలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్చి 30,31, ఏప్రిల్ ఒక్కటో తేది వరకు ఈ ప్రదర్శన ఉంటుందని శ్రీ ఖటు శ్యామ్ బాబా బ్రాండ్ స్టోర్ యాజమాని బిమల్ గొయాంక ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 80 శాతం వరకు తగ్గింపు ధరలతో ఉత్పత్తులు లభ్యమవుతాయన్నారు. ఫ్యాక్టరీ నుండి నేరుగా విక్రయించడంతో చౌక ధరలకు పొందవచ్చన్నారు. పిల్లలు, పెద్దలకు సంబంధించిన అన్ని రకాల దుస్తులు సహా బూట్లు, ఫ్యాషన్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు.

ఫ్యూజిఫిల్మ్ నుంచి అత్యాధునిక ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ మిషన్

- యశోదలో ఏర్పాటు

హైదరాబాద్ : డయాగ్నోస్టిక్ ఇమేజింగ్, సమాచార వ్యవస్థలలో అగ్రగామిగా ఉన్న ఫ్యూజిఫిల్మ్ ఇండియా అత్యాధునిక ఎరిటా 850 ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్ మిషన్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. దీనిని దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ప్రారంభించినట్లు పేర్కొంది. ఇది జీర్ణశయాంతర వ్యాధులకు రోగనిర్ధారణ కచ్చితత్వం, ఇమేజ్ స్పష్టతను పెంచనుందని వెల్లడించింది.

టిసిఎస్‌లో 3.5 లక్షల మందికి ఎఐలో శిక్షణ

ముంబయి : కృత్రిమ మేధా (ఎఐ)కి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ఐటి కంపెనీలు ఆ విభాగంపై ప్రధాన దృష్టిని పెడుతున్నాయి. తమ ఉద్యోగులను ఆ విధంగా తీర్చిదిద్దే పనిలో పడ్డాయి. ఈ క్రమంలోనే దిగ్గజ టెక్ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఇప్పటివరకు జనరేటివ్ ఎఐ స్కిల్స్‌లో 3.5 లక్షల మందికి శిక్షణ ఇచ్చింది. ఈ ఏడాది జనవరిలో 1.5 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని తొలుత పేర్కొంది. ఇప్పటివరకు 3.5 లక్షల మందికి జనరేటివ్ ఎఐ విభాగంలో నిపుణులుగా మార్చడానికి కృషి చేసినట్లు తెలిపింది.

రూ.10వేల కోట్ల ఆదాపై అమెజాన్ దృష్టి

న్యూయార్క్ : పొదుపు చర్యల్లో భాగంగా వచ్చే కొన్నేళ్లలో రూ.10వేల కోట్లు (1.3 బిలియన్ డాలర్లు)ఆదా చేయాలని ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ యోచిస్తోంది. ఇందుకోసం ఆఫీసు స్పేస్‌ను తగ్గించుకోవాలని భావిస్తోందని సమాచారం. కొన్ని కార్యాలయ అంతస్తుల వినియోగాన్ని నిలిపివేయడంతో పాటు పలు అద్దె భవనాల ఒప్పందాలను రద్దు చేసుకోవాలని భావిస్తోంది. ఉద్యోగులు కార్యాలయాలను ఎలా ఉపయోగిస్తున్నారనే దానిపై విశ్లేషించడం ద్వారా అమెజాన్ వ్యాపారాల విభిన్న అవసరాల ఆధారంగా తాము తమ రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోను నిరంతరం సమీక్షిస్తున్నామని అమెజాన్ ప్రతినిధి బ్రాడ్ గ్లాసర్ పేర్కొన్నారు.

రూ.1,823 కోట్లు చెల్లించండి

- కాంగ్రెస్‌కు ఐటీ శాఖ పన్ను నోటీసు
- ఇది ట్యాక్స్ టెర్రరిజమేనన్న జైరాం రమేష్
- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న మాకెన్



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలపై బీజేపీ ప్రభుత్వం దుందుడుకు చర్యలను ముమ్మరం చేసింది. సామ దాన భేద దండోపాయాలతో ప్రతిపక్షాలను తన దారికి తెచ్చుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. దాడులు, సోదాలు, అరెస్టులతో భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఇందుకోసం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. దారికి వస్తే సరేసరి...లేకుంటే కష్టాలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తోంది. తాజాగా కేంద్ర దర్యాప్తు సంస్థ ఆదాయ పన్ను శాఖ శుక్రవారం ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు పన్ను నోటీసు పంపింది. జరిమానా, దానిపై రావాల్సిన వడ్డీలతో కలిపి మొత్తం రూ.1,823 కోట్లు చెల్లించాలని తాఖీదు ఇచ్చింది. ఎన్నికల వేళ తనను ఆర్థికంగా దెబ్బ తీయడానికే కేంద్రం ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని కాంగ్రెస్ మండిపడింది.

2017-18 నుండి 2020-21 మదింపు (అసెస్‌మెంట్) సంవత్సరాలకు సంబంధించి జరిమానా, వడ్డీలతో కలిపి మొత్తం రూ.1,823 కోట్లు చెల్లించాలని కాంగ్రెస్‌కు పంపిన నోటీసులో ఆదాయపన్ను శాఖ తెలియజేసింది. 2017-2021 కాలానికి ఆదాయపన్ను శాఖ జరుపుతున్న పున:పరిశీలన ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఆ వెంటనే ఆదాయపన్ను శాఖ అధికారులు రంగంలోకి దిగి కాంగ్రెస్‌కు నోటీసులు జారీ చేశారు.

2014-15 నుండి 2016-17 వరకూ ఐటీ శాఖ చేపట్టిన పున:పరిశీలనను సవాలు చేస్తూ గతంలో కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. 2014-15 నుండి 2016-17 వరకూ పున:పరిశీలనకు సంబంధించి రూ.200 కోట్లు చెల్లించాలని తేల్చి చెప్పిన ఐటీ శాఖ, కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాల నుండి రూ.135 కోట్లు రికవరీ చేసింది. ఎన్నికలకు ముందు తాను తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కాంగ్రెస్ పార్టీ హైకోర్టు దృష్టికి తెచ్చింది. అయితే ఈ విషయంలోనూ ఆ పార్టీకి చుక్కెదురైంది.

ఒక పన్ను డిమాండ్ వివాదానికి సంబంధించి పస లేని కారణం చూపుతూ గత నెల 16న తన బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారని కాంగ్రెస్ లోగడ తెలిపింది. 2018-19 సంవత్సరానికి సంబంధించి రూ.210 కోట్ల ఐటీ డిమాండును ఆధారం చేసుకొని పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. అయితే ఆ తర్వాత బ్యాంక్ ఖాతాల నిర్వహణకు ఆదాయపన్ను శాఖ అప్పీలెట్ ట్రిబ్యునల్ అనుమతించింది. కానీ ఖాతాలో రూ.115 కోట్ల నిల్వ ఉండాలంటూ మెలిక పెట్టింది. కాగా తన బ్యాంక్ ఖాతాలన్నింటినీ స్తంభింపజేశారని కాంగ్రెస్ పార్టీ ఈ నెల 21న మరోసారి తెలియజేసింది.

ఇది పన్ను ఉగ్రవాదం : కాంగ్రెస్

ఎన్నికల వేళ తనను ఆర్థికంగా దెబ్బతీయడానికి బీజేపీ ప్రభుత్వం ఆదాయపన్ను శాఖను ఉసిగొల్పుతోందని కాంగ్రెస్ మండిపడింది. తనకు జారీ చేసిన నోటీసులను 'పన్ను ఉగ్రవాదం'గా అభివర్ణించింది. ఇలాంటి చర్యలను అడ్డుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ చెప్పారు. ఐటీ నోటీసులపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. పార్టీ ఖాతాలను స్తంభింపజేయడం ద్వారా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలు తమ పార్టీ పైనే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ పైన కూడా ప్రభావం చూపుతాయని చెప్పారు.

2017-18 నుండి 1,297 మంది నుండి అందిన రూ.42 కోట్ల నిధులకు సంబంధించి బీజేపీ ఎలాంటి వివరాలు అందజేయలేదని, ఇది ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని కాంగ్రెస్ కోశాధికారి అజయ్ మాకెన్ విమర్శించారు. దీనికి సంబంధించి ఆదాయపన్ను శాఖ ఆ పార్టీ నుండి రూ.4,600 కోట్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తంలో గత ఏడు సంవత్సరాలకు చెల్లించాల్సిన వడ్డీ కూడా ఉన్నదని చెప్పారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుపై వచ్చే వారం ప్రారంభంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆయన తెలిపారు.

నిద్దురపోరా..

- రాత్రిళ్లు చక్కగా పడుకునేలా పేరెంట్స్ చూడాలి
- అట్టడుగు వర్గాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి : వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తల సూచన



జీవిత పరుగుపందెంలో ఆరోగ్యంపై ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదు. యాంత్రిక జీవితంలా మారిన కుటుంబంలో.. భావితరాలను అనారోగ్యం పాలుకాకుండా కాపాడాలని వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. పిల్లలు మారాం చేస్తే.. సెల్‌ఫోన్ చేతిలో పెట్టేసే రోజులు మారాలని, రాత్రి పూట తమ బిడ్డల్ని చక్కగా పడుకునేలా తల్లిదండ్రులు దృష్టిపెట్టాలని అంటున్నారు.

న్యూఢిల్లీ : చిన్నారుల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు ఎంతో శ్రద్ధ వహిస్తుంటారు. అయినప్పటికీ,పిల్లలు అనారోగ్యానికి గురవుతూ ఉంటారు. అయితే, పిల్లల సమగ్రాభివృద్ధి కోసం రాత్రి సమయాల్లో చక్కటి నిద్ర అవసరమని అంటున్నారు వైద్య నిపుణులు. భారత్‌లోని పిల్లలలో నిద్ర రుగ్మతలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. సాంకేతిక పరికరాలు, సేవలు, విద్యాపరమైన ఒత్తిళ్లు వంటివి దీనికి కారణంగా చెప్పవచ్చు. ఆరోగ్యకరమైన నిద్ర అలవాట్ల కోసం శ్రద్ధ వహించాల్సి ఉంటుందనీ, ఈ విషయంలో తల్లిదండ్రుల జోక్యం మరింత అవసరమని అంటున్నారు. "ఈ వ్యక్తిగత రుగ్మతల తీరు వివిధ జనాభా సమూహాలలో మారుతూ ఉంటుంది. భారతీయ పిల్లలలో, వ్యక్తిగత నిద్ర రుగ్మతల ప్రాబల్యం 3.2 నుంచి 25.5 శాతం ఉంటుంది" అని 2016 నాటి ఒక అధ్యయనం అంచనా వేసింది.

అలాగే, అక్యూట్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్‌లు (ఏఆర్‌ఐ) భారత్‌లోని పిల్లలకు గణనీయమైన ముప్పును కలిగిస్తాయి. ఇవి వాయు కాలుష్యం, అధిక రద్దీ, ఆరోగ్య సంరక్షణకు పరిమితులు వంటి కారణాలతో శాశ్వతంగా ఉంటాయి. 2022లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం.. అధ్యయన కాలంలో భారతదేశంలో ఏఆర్‌ఐ లక్షణాలు కలిగి ఉన్న పిల్లల సగటు శాతం (5 సంవత్సరాలలోపు) 2.7గా ఉన్నది. అంటే, సర్వే చేయబడిన 238,945 మంది పిల్లలలో 6,529 మంది అన్నమాట. న్యుమోనియా, బ్రోన్కియోలిటిస్, ఇన్ఫ్లుయెంజా వంటి వ్యాధులు ముఖ్యంగా పిల్లలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఇది అధిక అనారోగ్యం, మరణాల రేటుకు దారితీస్తుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలు సరైన పోషకాహారం, పారిశుద్ధ్యం లేమి కారణంగా హానికర వాతావరణాన్ని కలిగి ఉంటున్నారు. చిన్నపిల్లలు తరచుగా స్పిరోమెట్రీ, పల్మనరీ ఫంక్షన్ పరీక్షలు వంటివి పొందలేరు. బదులుగా ఇంపల్స్ ఓసిల్లోమెట్రీ వంటి ఇతర పరీక్షలను నిర్వహిస్తారు. ఇవి ఖరీదైనవి, చాలా ప్రదేశాలలో అందుబాటులో ఉండవని వైద్య నిపుణులు అంటున్నారు. కాబట్టి ప్రభుత్వాల జోక్యం ఈ విషయంలో అవసరమని చెప్తున్నారు. పిల్లలకు సరైన నిద్ర యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ ఛటర్జీ నొక్కి చెప్తున్నారు. సరైన నిద్ర లేకపోవటంతో పిల్లలలో ప్రవర్తన, పనితీరు వంటి ఇతర సమస్యలకు దారి తీస్తుంది. నిద్ర రుగ్మతలు సరైన అభివృద్ధిని నిరోధిస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి విషయాల్లో ఒక్క తల్లిదండ్రులు మాత్రమే కాకుండా.. ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచిస్తున్నారు. మరీముఖ్యంగా, అట్టడుగు వర్గాల ప్రజలకు మరింత అవగాహన, సౌకర్యాలను ప్రభుత్వాలు కల్పించాలని నిపుణులు, సామాజికవేత్తలు చెప్తున్నారు.

సీన్ రివర్స్

- బతకడానికి పల్లెబాట
- పొమ్మంటున్న బస్తీలు
- మూడు సంవత్సరాల్లో 5.60 కోట్ల మంది వెనక్కి



న్యూఢిల్లీ: 'కూటి కోసం, కూలీ కోసం ..పట్టణంలో బతుకుదామని ... తల్లిమాటలు చెవిన పెట్టక... బయలుదేరిన బాటసారికి...' అంటూ మహాకవి శ్రీశ్రీ రాసిన కవిత గుర్తుంది కదూ! ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పాలకుల విధానాల పుణ్యమా అని బస్తీలు బతుకు నివ్వడం మానేశాయి. దీంతో పొట్ట చేతపట్టుకుని పల్లె బాట పడుతున్న వారి సంఖ్య ఏటికేడాది పెరుగుతోంది. మూడు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా 5.60 కోట్ల మంది పట్టణాల నుండి పల్లెలకు చేరారు. ఉపాధి కోసం వ్యవసాయాన్ని ఆశ్రయించారు. ఇది దేశ విభజన సమయంలో జరిగిన వలసకల కన్నా ఎక్కువ! ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) ఇటీవల విడుదల చేసిన 'ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్టు-2024' ఈ విషయాన్ని ధృవీకరించింది. ఐఎల్‌ఓతో పాటు, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్, ఢిల్లీకి చెందిన ఎన్‌జిఓ ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ కలిసి 2020-2022 కాలానికి ఈ నివేదికను రూపొందించాయి. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలు, జాతీయ నమూనా సర్వేలు తదితర ప్రభుత్వ గణాంకాలే ఈ నివేదికకు ఆధారంకావడం గమనార్హం.

కరోనాతో ప్రారంభం...

మోడీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా కరోనా సమయంలో వలసకార్మికుల సుదీర్ఘపాదయాత్రలను దేశం చూసింది. నిజానికి పెద్దనోట్ల రద్దు సమయంలోనే కార్పొరేట్ల ఈ వైఖరి కనిపించినప్పటికీ, కరోనా సమయంలో అది మరింత స్పష్టంగా కనిపించింది. నగరాలు, పట్టణాల్లో పట్టించుకునే దిక్కు లేకపోవడంతో కరోనా విజృంభించిన 2020వ సంవత్సరంలో మూడు కోట్ల మందికిపైగా పల్లెలకు చేరినట్లు ఐఎల్‌ఓ తెలిపింది. ఆ ఏడాది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కార్మికుల సంఖ్య 3.80 కోట్ల మంది పెరిగారు.

కొనసాగిన వలసలు...

ఆ తరువాత కూడా గ్రామాలకు వలసలు కొనసాగాయి. 2021వ సంవత్సరంలో వ్యయసాయ రంగంలో 1.21 కోట్ల మంది కార్మికులు పెరిగారు. 2022లో 1.29 కోట్ల మంది ఇలా పల్లెలకు చేరారు. అంతకుముందు వృద్ధులతో పాటు యువకులు కూడా వ్యవసాయం నుండి బయటకు వచ్చేవారు. 2000-2019 సంవత్సరాల మధ్య ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు మళ్లీ పల్లెలో వ్యవసాయ పనుల్లోకి యువత చేరుతున్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. 'వ్యవసాయ రంగం వెలుపల పని అవకాశాలు లేకపోవడం, మహమ్మారి కారణంగా ఆర్థిక మందగమనం కారణంగా ప్రజలు వెనక్కి వెడుతున్నారు' అని నివేదికలో పేర్కొన్నారు. వీరిలో పెద్ద సంఖ్యలో కూడా మహిళలు కూడా ఉన్నట్లు ఐఎల్‌ఓ తెలిపింది. '2000-2019 కాలంలో శ్రామిక శక్తిలో పురుషుల కంటే మహిళల వాటా తక్కువగా ఉంది. కానీ 2019-2022 మధ్య గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి తారుమారైంది' అని కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు. దీని ప్రకారం 'పురుషుల కంటే మహిళలు వ్యవసాయరంగంలోకి పెద్ద సంఖ్యలో చేరారు. 2022లో వ్యవసాయంలో పనిచేస్తున్న పురుషుల శాతం 38.1 కాగా, మహిళల సంఖ్య 62.8శాతం' అని నివేదిక పేర్కొంది. పురుషులు పట్టణాల్లో పనుల కోసం వెతుకుతుంటే మహిళలు గ్రామాలకు చేరి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే విధంగా ఉపాధి కార్మికులు, నిర్మాణరంగ కార్మికులు పెద్దసంఖ్యలో గ్రామాలకు వచ్చి ఉంటారని ఐఎల్‌ఓ నివేదికలో పేర్కొన్నారు.

అభివృద్ధా ... తిరోగమనమా!

పల్లెల నుండి జనం పట్టణాలకు వలసరావడం, పారిశ్రామిక ఉత్పత్తిలో భాగం కావడాన్ని అభివృద్ధిగా భావిస్తారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని చెబుతాయి. మన దేశం కూడా అదేమాదరి వ్యవసాయ శ్రామిక శక్తిని వ్యవసాయేతర రంగాలకు మార్చడానికి ఎంతగానో ప్రయత్నించింది. నగరాలు, పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించింది. ఫలితంగా మహానగరాలు, విశ్వనగరాలు ఆవిర్భవించాయి. బతకడానికి వచ్చిన పల్లెజనం కార్మికులుగా స్థిరపడ్డారు. వారితో పాటే పేదరికం స్థిరపడింది. అంతరాలు పెరిగాయి. ఉపాధి లేక, పల్లెలకు బస్తీ జనం పోలోమంటున్నారు. బతకడం కోసం పేదలు ఇలా పల్లెబాట పట్టడాన్ని అభివృద్ధి అంటారా తిరోగమనం అంటారా?

సీపీఐ(ఎం)ను గెలిపిస్తేనే సమస్యలు పరిష్కారం

భువనగిరి కోటపై ఎర్రజెండా ఎగరాలి



నాటి వారసత్వాన్ని, నేటి పోరాటాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ
అవకాశవాద రాజకీయాలను ఓడించండి
ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే వారికి పట్టం కట్టండి
డబ్బుతో గెలుస్తామని విర్రవీగే వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
పార్టీల విధానాలు, అభ్యర్థుల చరిత్ర, త్యాగాలను చూసి ఓటేయండి
నవతెలంగాణతో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్

'ఉద్యమమే ఊపిరిగా పనిచేస్తున్నా. సీపీఐ(ఎం)ను ప్రజలు గెలిపిస్తే నేను ప్రజలను గెలిపిస్తాను. బూర్జువా పార్టీల నాయకులను గెలిపిస్తే వారు ప్రజలను ఓడిస్తారు. ఈ తేడాను అందరూ గమనించాలి. భువనగిరి కోటపై ఎర్రజెండాను ఎగరేస్తాం. అందుకు అన్ని తరగతుల ప్రజలు, మేధావులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, వృత్తిదారులు సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలి. అవకాశవాద రాజకీయ నాయకులను ఈ ఎన్నికల్లో ఓడించాలి. నేను గెలిచినా, ఓడినా జనంలోనే ఉంటా. కానీ బూర్జువా పార్టీల నాయకులు గెలిచినా, ఓడినా ఎక్కడుంటారో అర్థం చేసుకోవాలి.'అని భువనగిరి సీపీఐ(ఎం) పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయన నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

'మాది యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం మునిపంపుల గ్రామం. మా తల్లిదండ్రులు బీజాన్‌బీ, మహబూబ్‌అలీ. మా గ్రామంలో పార్టీ నిర్మాతల్లో వారు ముఖ్య నాయకులు. హోటల్ వ్యాపారం చేసేవారు. 1970-71లో కరువు వచ్చింది. జనం ఆకలితో అలమటిస్తున్నారు. పార్టీ పిలుపు మేరకు జొన్నల లారీని అడ్డగించి పేదలకు పంచారు. అప్పుడు మా తండ్రిని పోలీసులు మూడు రోజులపాటు పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. కాచం కృష్ణమూర్తి, నర్రా రాఘవరెడ్డి ప్రభావం మా కుటుంబంపై ఉంది. నా తల్లిదండ్రుల ప్రభావం వల్లే రాజకీయాల్లోకి వచ్చాను. 'అని జహంగీర్ చెప్పారు.

'1992లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాను. 1995లో 25 ఏండ్ల వయస్సులోనే మునిపంపుల గ్రామ సర్పంచ్‌గా అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారు. అప్పుడు విరాళాల ద్వారా వచ్చిన డబ్బు రూ.2,002 నా ఎన్నికల ఖర్చు. 2016, అక్టోబర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్నాను. చదువు వెలుగు, సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నాను. లంచం ఇవ్వకు, లంచం అడక్కు అనే ఉద్యమం చేపట్టాం.'అని జహంగీర్ అన్నారు.

'అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు తేడా ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలు మార్పు కోరుకున్నారు. బీఆర్‌ఎస్ అహంకారపూరిత విధానాలను ప్రజలు ఈసడించుకున్నారు. స్థానికంగా ఉన్న పరిస్థితులు ప్రభావం చూపుతాయి. ఎమ్మెల్యేల పనితీరు కూడా ప్రభావితం చేస్తుంది. పార్లమెంటు ఎన్నికలపై ఆ ప్రభావం ఉండదు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో 17 లక్షల ఓట్లున్నాయి. ప్రజలు ఆచితూచి ఆలోచించి ఓట్లేస్తారు. పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినట్టుగానే కేంద్రంలో ఉన్న బీజేపీని కూడా ప్రజలు ఓడిస్తారు.'అని జహంగీర్ చెప్పారు.



'సాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నది. జనగామలో దేవాదుల ప్రాజెక్టు కాలువల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. దీంతో భూములకు నీరందడం లేదు. భువనగిరిలో బస్వాపురం ప్రాజెక్టు పూర్తి కాలేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రాజెక్టులను ఎన్నికల అస్త్రంగానే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాడుకుంటున్నాయి. ఉదయసముద్రం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రాజెక్టులను పూర్తి చేస్తామనే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉన్నదా?. నీరులేక పొలాలు బీడుబారుతున్నాయి. ఇక్కడి ప్రజలకు మూసీ జీవనాధారంగా ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పినా బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. కానీ ఆ ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.58 వేల కోట్లు కావాలి. ఈ ప్రాంతానికి గోదావరి జలాలను తేవాల్సిన అవసరముంది.'అని జహంగీర్ సూచించారు.

'ఉన్నత విద్య, ఇంజినీరింగ్, మెడిసిన్ కోసం ఇక్కడి విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్లాలి. జిల్లా ఆస్పత్రులను సూపర్‌స్పెషాలిటీ చేస్తామంటూ కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు కాలేదు. బీబీనగర్‌లో ఎయిమ్స్ ఉన్నా 42 విభాగాలకుగాను 26 విభాగాలే పనిచేస్తున్నాయి. 1500 నుంచి రెండు వేల మంది ఓపీకి రోజూ వస్తున్నారు. కంప్యూటర్లు లేక ఆరు కౌంటర్లే ఉన్నాయి. ఎయిమ్స్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులివ్వకుండా వివక్షతను చూపుతున్నది'అని జహంగీర్ చెప్పారు.

'ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల బాధలు తీరడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, టీడీపీ ఒక్కతాను ముక్కలే. జిల్లాల అభివృద్ధి కోసం ఆ పార్టీలు ఏం చేశాయో బహిరంగ చర్చకు రావాలి. ఎందుకు వెనుకబడి ఉన్నామో చెప్పాలి. పాలకుల వైఫల్యమే ఈ దుస్థితికి కారణం.'అని జహంగీర్ అన్నారు.

'పోరాటాల ఉనికి, ఆనవాళ్లు ఇంకా ఉన్నాయి కాబట్టే కమ్యూనిస్టుల పట్ల ప్రజల్లో గౌరవం ఉన్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న వారు ఇప్పుడు లేకపోవచ్చు. ఆ చరిత్ర సజీవంగా ఉన్నది. ఆ పోరాటానికి వారసులుగా కమ్యూనిస్టులున్నారు. కానీ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తున్నది. అందులో భాగంగానే రజాకార్ సినిమాను తీశారు. అందులో ఎర్రజెండా కనిపించదు, ఆ పోరాటాలుండవు. ఎర్రజెండా లేకుండా నిజాం వ్యతిరేక పోరాటం ఉన్నదా?. బీజేపీకి చరిత్ర లేదు కాబట్టే ఈనాటి తరం దాన్ని తెలుసుకోవద్దనే కుట్రతోనే వక్రీకరిస్తున్నారు. పాఠ్యాంశాలను తొలగిస్తున్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలు చారిత్రాత్మకమైనవి. సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాలు ప్రజలకు పంచితే నాలుగు లక్షల ఎకరాలు ఈ ప్రాంతంలోనే పంచారు. నాటి పోరాట వారసత్వాన్ని, నేటి పోరాటాలను రెండింటినీ జోడించి ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేయాలి'అని జహంగీర్ వివరించారు.





'రాజకీయాల్లో డబ్బు, మద్యం కీలకంగా మారాయి. కమ్యూనిస్టుల వెనుక సామాన్య ప్రజలున్నారు. సామాన్యుల ఆశలను పెంచి వారిని లోబరుచుకునేందుకు డబ్బును పాలకులే అలవాటు చేశారు. డబ్బు ఇస్తేనే ఓటేస్తామంటూ ప్రజలు ఎప్పుడూ అనలేదు. పెట్టుబడిదారులు, వ్యాపారులు రాజకీయాల్లోకి వస్తున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చెప్పినట్టు పార్ట్‌టైం రాజకీయ నాయకులు వస్తున్నారు. వారి అవసరాలు, ఆస్తులను కాపాడుకునేందుకు పదవులు ఉపయోగపడుతున్నాయి. అందుకే ఏదైనా చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. స్వలాభం కోసం ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కార్పొరేట్ రాజకీయాలను ప్రజలు తిరస్కరించేలా చైతన్యం పెంపొందిస్తాం.'అని జహంగీర్ చెప్పారు.

'ఎన్నికల్లో పార్టీల విధానాలను చూసి ఓటేయాలి. బీజేపీ విధానాలు విధ్వంసకరమైనవి. ఆ పార్టీ గెలిస్తే తీవ్ర సంక్షోభం వస్తుంది. కాంగ్రెస్ భూస్వామ్య, పెత్తందారీ పార్టీ. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అవకాశవాద రాజకీయాలు చేస్తాయి. ప్రత్యామ్నాయ శక్తిగా కమ్యూనిస్టు పార్టీ ఉన్నది. రాజకీయాల్లో విలువల కోసం పోరాడుతుంది. ప్రజలను దోపిడీ చేసే వారికి వ్యతిరేకంగా నిలబడుతుంది. కార్మికులు, కర్షకులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటుంది. అభ్యర్థులను చూసి ఓటేయాలి. కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజలతో సంబంధం లేదు. ప్రజాసమస్యలపై పోరాడలేదు. డబ్బు అర్హతతో ముందుకొచ్చారు. వ్యాపారాలను స్థిరపరుచుకునేందుకు బీజేపీ అభ్యర్థి పోటీ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి గతంలో గెలిచినా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. అందుకే 2019లో ఓడిపోయారు. మళ్లీ ఇప్పుడు బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అభ్యర్థుల త్యాగాలు, చరిత్ర, ప్రజలతో మమేకమయ్యే విధానాన్ని చూసి ఓటేయాలి. నేను 35 ఏండ్లుగా ప్రజల్లో ఉండి వారి కోసం నిస్వార్థంగా ఉద్యమాలు చేస్తున్నా. డబ్బు తప్ప మిగతా అన్ని అంశాల్లో నాకు మెరిట్ ఉంది. బూర్జువా పార్టీల అభ్యర్థులకు ఇతర అంశాల కన్నా డబ్బే ప్రామాణికంగా ఉన్నది. డబ్బుతో విర్రవీగే అభ్యర్థులకు ఎన్నికల్లో బుద్ధిచెప్పండి' 'అని జహంగీర్ పిలుపునిచ్చారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా

నేడు హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు

11 వామపక్ష పార్టీలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని 11 వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీలు విమర్శించాయి. బీజేపీ ప్రజల దృష్టిని పక్కదోవ పట్టిస్తున్నదనీ, మతోన్మాద విధానాలను ముందుకు తెస్తున్నదనీ, నియంతృత్వ విధానాలను అమలు చేస్తున్నదని తెలిపాయి. బీజేపీ ప్రజా వ్యతిరేక, మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం పది గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహించాలని నిర్ణయించాయి. సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాలమల్లేష్ వేదికపైకి నాయకులను ఆహ్వానిస్తారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు (సీపీఐ), సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జెవి చలపతిరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ వెంకటేశ్వరరావు, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి, ఆరెస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఫార్వర్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బి సురేందర్‌రెడ్డి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం రమేష్‌రాజా, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న వక్తలుగా పాల్గొంటారు.

కేటీఆర్.. మీ భాష మార్చుకోండి...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హితవు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వివిధ వేదికలపైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాడుతున్న భాష చాలా అభ్యంతరకరంగా ఉంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. ఆయన తన భాషను మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన పీఈసీ సమావేశంలో భట్టి మాట్లాడుతూ... ఉన్నత విద్యావంతుడైన కేటీఆర్ పద్ధతిగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌ను ఉద్దేశించి దుర్భాషలాడటం సరికాదన్నారు. దేశ భద్రతా అవసరాల కోసం వాడాల్సిన ట్యాపింగ్‌ను వ్యక్తిగత రాజకీయ అవసరాలకోసం వాడిన బీఆర్‌ఎస్ నేతలు తప్పు చేశారని విమర్శించారు. ఈ విషయం గురించి ప్రశ్నిస్తే... కేటీఆర్ తన ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు

పదవే పరమార్థం

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం తన కొడుకును లైన్లో పెట్టారు. ఇక హైదరాబాద్ శివారులో గట్టి పట్టున్న పట్నం మహేందర్ రెడ్డి చివరి క్షణంలో కాంగ్రెస్ గూటికి చేరి తన భార్య సునితారెడ్డికి మల్కాజిగిరి టికెట్ దక్కించుకున్నారు. ఇక దానం నాగేందర్ ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గులాబీ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ కండువా కప్పుకుని సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, ఆరూరి రమేష్, లాంటి నేతలు పార్టీలు మారారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అతని కూతురు వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ టికెట్ దక్కించుకున్న కడియం కావ్య, రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, అతని కూతురు హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి లాంటి ముఖ్యులూ పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ చైర్మెన్ల వరకొస్తే రాష్ట్ర వ్యాప్తంగా భారీగా పార్టీని వీడుతున్నారు. వ్యాపారాలు సజావుగా సాగడానికి, ఆస్తులు,అధికారం కోల్పోకుండా ఉండడానికి చొక్కా మార్చినంత ఈజీగా పార్టీలు మార్చుతున్నారు." నీవు నేర్పిన విద్యే నీరజాక్ష " అన్నట్టు 2014, 2018 విజయాల తర్వాత బీఆర్‌ఎస్ ఆడిన ఆటనే నేడు కాంగ్రెస్ ఆడుతోంది. అసెంబ్లీలో కనీసం ప్రతిపక్ష హెూదా దక్కకుండా చేసిన ఆ పార్టీపై నేడు బదులు తీర్చుకుంటోంది. దశాబ్ద కాలానికి పూర్వం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఈ క్రీడ కేసీఆర్ పదేండ్ల పాలనలో పరాకాష్టకు చేరింది. తాజాగా రేవంత్‌రెడ్డి హయానికొచ్చేసరికి మరింత పీక్ స్టేజికి చేరింది. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే సిద్ధాంతాలకూ విలువలకు ఆస్కారముంటుందా అన్న ప్రశ్న ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది..

బలమైన చట్టం రావాలి

1985లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారు. ఇందుకనుగుణంగా రాజ్యాంగ సవరణ చేసి పదో షెడ్యూల్లో చేర్చారు. ఈ చట్టం ప్రకారం పార్టీ ఫిరాయించిన చట్ట సభల సభ్యుని సభ్యత్వాన్ని రద్దు చేయ డంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిని చేసే అవకాశం ఉంది. అయితే అందులో ఉన్న లొసుగులు, మినహాయింపుల వల్ల అది పటిష్టంగా అమలు జరగడం లేదు. చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకుని చట్ట సభల సభ్యులు యధేచ్ఛగా పార్టీలను ఫిరాయిస్తున్నారు. ఏండ్ల కు ఏండ్లు సాగే విచారణలు, సాగ దీతలు పార్టీ ఫిరాయింపులకు మరింత ప్రోత్సాహాన్నే అందిస్తున్నా యనే విమర్శ ఉంది. దీనికి మరిన్ని సవరణలు చేసి ఫిరాయించిన వ్యక్తులు ఎంతటి వారైనా వేటు తప్పదనే బలమైన చట్టాన్ని తెచ్చినప్పుడే వీటికి అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి నిబద్ధత

- ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

న్యూఢిల్లీ : ప్రస్తుతం భారత్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం ఇక్కడకు వచ్చిన ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి దిమిత్రో కులేబాతో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ శుక్రవారం ఇక్కడ హైదరాబాద్ హౌస్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రధానంగా రష్యాతో జరుగుతున్న యుద్ధం దాని విస్తృత పర్యవసానాలపైనే దృష్టి కేంద్రీకరించారు. రెండేళ్ళకు పైగా సాగుతున్న ఈ యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో వీరి సమావేశం జరిగింది. శాంతి క్రమానికి భారత్ దారి చూపించాలని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాలు, చొరవలపై పరస్పరం అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నట్లు జై శంకర్ ఎక్స్ పోస్టులో తెలిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలతో పాటుగా ఇరు పక్షాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ద్వైపాక్షిక సహకారంతో పాటూ మొత్తంగా సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి నిబద్ధతను ఇరు వర్గాలు ప్రకటించాయని చెప్పారు. కులేబా కూడా తన అనుభవాలను ఎక్స్‌లో పోస్టు చేశారు. వివిధ స్థాయిలో ఇంతకుముందు కూడా ఇరు పక్షాల మధ్య సమావేశాలు జరిగాయని, వాటి ఫలితాలు కూడా కనిపిస్తున్నాయని చెప్పారు.



ఉపా కింద బ్యాంక్ ఖాతాలను

స్తంభింపచేయలేరు

(మొదటి పేజీ తరువాయి)

నిర్దేశిస్తోందని, అసలు ఇటువంటి నిధుల వినియోగాన్ని నిషేధించే అధికారాన్ని సెక్షన్ 7 కేంద్రానికి ఇస్తోందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. అయితే వీటికి ముందుగా సక్రమమైన విచారణ లేదా దర్యాప్తు జరగాల్సి వుంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులో కేంద్ర ప్రభుత్వం ఆ రీతిలో వ్యవహరించ లేద న్నారు.

కానీ డిజిటల్ పరికరాల నుండి స్వాధీనం చేసుకున్న కొన్ని పత్రాలపై ఆధారపడి ఈ చర్యలకు పాల్పడిందని వారు పేర్కొన్నారు. ఆ పత్రాల్లో పిఎఫ్‌ఐ పేరు ఒక్కటే వుంది కానీ పిటిషనర్ ట్రస్టు పేరు లేదన్నారు.

రేపు కేసీఆర్ జిల్లాల పర్యటన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నీటి ఎద్దడి వల్ల ఎండిపోతున్న పొలాలను పరిశీలించి, రైతుల్లో ధైర్యాన్ని నింపేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లోని పంట పొలాలను ఆయన పరిశీలించనున్నారు.

నామ్‌కే వాస్తే

- పనిలో ఒక్కరే కార్యనిర్వాహక అధ్యక్షులు
- కనిపించని ఆ 'నలుగురు'
- ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ క్యాడర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ గెలుపు కోసం ఇరుసులా పని చేయాల్సిన టీపీసీసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చేతులెత్తేశారు. మూడేండ్ల క్రితం సామాజిక తరగతుల వారీగా ఐదుగురికి కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతలను కాంగ్రెస్ అప్పగించింది. మాజీ మంత్రి జే.గీతారెడ్డి, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్, క్రికెటర్ అజహరుద్దీన్‌లను అధిష్టానం వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా నియమించింది. వారంతా ఎన్నికైన కొత్తలో తమకు అప్పగించిన బాధ్యతలపై కొంత ఫోకస్ చేశారు. కాలం గడుస్తున్న కొద్దీ రకరకాల కారణాలతో కాడెత్తేశారని నేతలు వాపోతున్నారు. గీతారెడ్డి, అంజన్ కుమార్‌యాదవ్, అజహరుద్దీన్‌కు పార్లమెంటు నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించారు. మహేష్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, జగ్గారెడ్డికి అనుబంధ సంఘాల సమన్వయం బాధ్యతలను అప్పగించారు. అయినా అసెంబ్లీ ఎన్నికల్లో వారి కృషి నామ్‌కే వాస్తేగా ఉన్నట్టు పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. అంజన్‌కుమార్ (ముషీరాబాద్), జగ్గారెడ్డి (సంగారెడ్డి) అజహరుద్దీన్ (జూబ్లీహిల్స్) ఎమ్మెల్యే అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. ఎన్నికలు ముగిసేదాకా పక్క నియోజకవర్గంలో ఏం జరుగుతుందో కూడా వారు చూడలేదు. ఎన్నికల్లోనే మునిగిపోయిన తమకు అప్పగించిన బాధ్యతలను వారు పెద్దగా పట్టించుకోలేదనే చెప్పాలి. గీతారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్ అనారోగ్య కారణాలతో ఇంటికే పరిమితమవుతున్నారు. అజహరుద్దీన్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడమే తప్ప పెద్దగా బాధ్యతలు భుజాన వేసుకున్నది లేదనే విమర్శలున్నాయి. పార్టీ సంస్థాగత వ్యవహారాలు చూస్తున్న మహేష్‌కుమార్ గౌడ్ మాత్రమే గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటూ వస్తున్నారు. అటు పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఓడిపోయిన తర్వాత పార్టీ కోసం కష్టపడి పని చేస్తానంటూ గాంధీభవన్‌లో కొంత హడావిడి చేశారు. తన భార్యకు కార్పొరేషన్ పదవి రాగానే ఆయన సైలెంట్‌టైపోయారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల సమయంలో కీలక బాధ్యతలకు దూరంగా ఉన్న నేతల గురించి మరోసారి చర్చోపచర్చలు సాగుతున్నాయి.

ఆయా జిల్లాల్లో పార్లమెంటరీ నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించడం, అనుబంధ సంఘాల సమావేశాలు నిర్వహించి ఎంపీ ఎన్నికల సమరానికి సన్నద్ధం చేయడం వంటి కార్యక్రమాల్లో తలమునకలు అవ్వాల్సిన నేతలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రూపులను సమన్వయం చేయడం, అసంతృప్తులను బుజ్జగించడం, స్థానికగా ఇతర పార్టీల నుంచి పార్టీలో చేరే కొత్త నాయకులను చేర్చుకోవడం వంటి పనులు పార్టీలో ఇప్పుడు అత్యంత కీలకమైనవి. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాలేదు. అయినా పార్లమెంటు ఎన్నికల్లో పాగా వేయాలని భావిస్తోంది. హైదరాబాద్ నుంచి ప్రాతినిధ్యం కలిగిన అంజన్‌కుమార్, అజహరుద్దీన్ పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటంతో నేతల్లో అసహనం నెలకొంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో కొత్తవారికి బాధ్యతలు అప్పగించలేక, ఉన్న నాయకులతో పని చేయించలేక తలలు పట్టుకుంటున్నారు.

బీజేపీకి 'కోటక్' నజరానా

రూ.60 కోట్ల విరాళమందజేత

- కోటక్ మహింద్రా బ్యాంకుకు అనుకూలంగా వ్యవహరించిన ఆర్‌బీఐ
- ఆ తర్వాత బీజేపీ ఖాతాకు చేరిన సొమ్ము



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారి జాబితాలో అరుదుగా కన్పించిన పేరు ఉదయ్ కోటక్. దేశంలో మూడవ అతి పెద్ద ప్రయివేటు రంగ బ్యాంకైన కోటక్ మహింద్రాలో ఆయనకు వాటాలు ఉన్నాయి. అయితే తాను నిర్దేశించిన పరిమితికి మించి ఉదయ్‌కి ఆ బ్యాంకులో వాటాలు ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారం చివరికి 2018 డిసెంబరులో న్యాయస్థానం వరకూ వెళ్లింది. ఆర్‌బీఐకి వ్యతిరేకంగా కోటక్ మహింద్రా బ్యాంక్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఏమైందో ఏమో కానీ 13 నెలలు గడిచిన తర్వాత 2020 జనవరిలో ఆర్‌బీఐ వెనక్కి తగ్గింది. కోర్టు వెలుపల పరిష్కారం చేసుకుందామంటూ కోటక్ మహింద్రా బ్యాంక్ చేసిన ప్రతిపాదనను అంగీకరించింది.

ఇదిలా ఉండగా ఈ వివాద పరిష్కారానికి కొన్ని నెలల ముందు ఈ గ్రూపు బీజేపీకి రూ.35 కోట్ల విరాళం అందజేసింది. పరిష్కార ప్రకటన వెలువడడానికి కొద్ది రోజుల ముందే ఇందులో రూ.10 కోట్లు బీజేపీ ఖాతాలో చేరాయి. ఆ తరువాత కోటక్ గ్రూపునకు చెందిన ఇన్ఫినా ఫైనాన్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ 2021 ఏప్రిల్‌లో అధికార బీజేపీకి రూ.25 కోట్లు సమర్పించుకుంది. కోటక్ మహింద్రా బ్యాంక్ ఎండీగా, సీఈఓగా ఉదయ్ కోటక్ మరో 32 నెలల పాటు పదవిలో కొనసాగేందుకు అనుమతిస్తూ ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేసి మూడు వారాలు కూడా గడవక ముందే ఈ విరాళం బీజేపీ జేబులో చేరింది. రేటింగ్ సంస్థ కేర్ రేటింగ్స్ ప్రకారం ఇన్ఫినా ఫైనాన్స్‌లో కోటక్ కుటుం బానికి 50.01శాతం వాటాలు, ముంబ యికి చెందిన కోటక్ మహింద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్‌కు 39.99శాతం వాటాలు ఉన్నాయి.

మహింద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్‌లో ఉదయ్ కోటక్ డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. ఇన్ఫినా ఫైనాన్స్ కొనుగోలు చేసిన మొత్తం రూ.60 కోట్ల బాండ్లు ఒకే పార్టీ...బీజేపీ ఖాతాకే చేరడం గమనార్హం.

వివాదం ఏమిటి?

ఏదైనా కంపెనీ వ్యాపారాన్ని ప్రారంభించిన తర్వాత 12 సంవత్సరాల వరకూ ప్రమోటర్లు అందులో 15శాతంకి మించి వాటాలు కొనుగోలు చేయరాదని ఆర్‌బీఐ 2013 ఫిబ్రవరి 22న మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రమోటర్ వాటాను 2017 జూన్ 30 లోగా 30శాతానికి, 2018 డిసెంబర్ 31 లోగా 20శాతానికి, 2020 మార్చి 31 లోగా 15శాతానికి తగ్గించాలని ఆర్‌బీఐ తనకు సూచించిందని కోటక్ బ్యాంక్ తెలిపింది. 2017 మే 22న కోటక్ బ్యాంకులో తన వాటాను ఉదయ్ కోటక్ 29.79శాతానికి తగ్గించారు. 2018 ఆగస్ట్ 2న ప్రమోటర్ వాటాను 30శాతానికి నుంచి 19.7శాతానికి తగ్గించేందుకు కొత్త పద్ధతిని అనుసరించాలని కోటక్ బ్యాంక్ నిర్ణయించింది. అయితే అందుకు ఆర్‌బీఐ అంగీకరించలేదు. దీనిపై కోటక్ బ్యాంక్ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆ తర్వాత ఇన్ఫినా ఫైనాన్స్ కంపెనీ రెండు దఫాలుగా బీజేపీ ఖాతాలో రూ. 35 కోట్ల డిపాజిట్ చేసింది. కోటక్, ఆర్‌బీఐ 2020 జనవరి 29న కోర్టు వెలుపల పరిష్కారం కుదుర్చుకున్నాయి.

సంపాదకీయం

జంప్ జిలానీలు..!



జిలానీ పుంలింగమే అవ్వాల్సిన పనిలేదు. లోక్‌సభకి నిలబెట్టిన తర్వాత అస్త్ర సన్యాసం చేసిన ఒక స్త్రీ మూర్తి, గత కొన్నేండ్లుగా జంటనగరాల మేయర్ పదవిపై సవారీ చేసిన మరొక మహిళా ఉన్నారు కాబట్టి 'జిలానీ' స్త్రీ లింగం కావాల్సిన పని కూడా లేదు. వస్తున్న పత్రికా కథనాల ప్రకారమైతే ఈ లిస్టు చాలానే ఉంటుందట. పదవుల చుట్టూ పోగేసిన జనం బెల్లం ముక్క జారిపడిపోయిన తర్వాత అక్కడికే ముసురుతారనే విషయం డిసెంబరు ఏడు నాడే అర్థమయిందనుకుంటా. రేవంత్ సర్కార్ వారంలో పడిపోతుందనో, నెల్లో పడిపోతుందనో మళ్ళీ కేసీఆర్ కుర్చీ ఎక్కబోతారని ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎంత వాగాడంబరం ప్రదర్శించినా జనాన్ని ఆపుకోలేక పోతున్నారు బీఆర్ఎస్ నేతలు. ఆ కుండకు చిన్న చిల్లు పడుంటే వేలో, కాలో పెట్టి ఆపచ్చు. కాని దాన్నిండా కంతలే! ఎన్నని మూయగలరు? ఎందర్నని ఆపగలరు?

దేశంలో పార్టీలను, ప్రభుత్వాలను లొంగదీసుకునేందుకు గవర్నర్లు, ఈడీలు, ఐటీలు, సీబీఐలు ఇష్టానుసారం వాడుకుంటూ ఇటీవలి సతీష్ ఆచార్య కార్టూన్ వేసినట్టు 'కమలం' గుర్తు వాషింగ్ మెషీన్‌లో వేస్తే అవినీతి నుండి శుద్ధి అయి కాషాయం రంగుతో పవిత్రంగా బయటికొస్తున్న స్థితి. దేశవ్యాపితంగా ఎందరో పెట్టుబడిదారులు కం వ్యాపారవేత్తలు కం రాజకీయ నేతలు ఈ బాపతు పార్టీల్లో కనపడుతున్నారు. అందుకే సర్వం డబ్బుమయంగా మారింది.

జారిపోయేవారందర్నీ 'దీర్ఘదర్శులు'గా జమకట్టలేము. మహా అయితే చెరువు మొత్తం ఎండిపోయేలోపు, బయటికి దూకే 'ప్రాప్తకాలాజ్ఞులే!' తెలంగాణ సాధనోద్యమం ప్రజలందర్నీ శాశ్వతంగా బంధించివుంచే సిమెంట్‌కాదు. తెలంగాణ సాకారమైన తర్వాత వివిధ తరగతుల ప్రజలు తమ జీవితాల్లో ఏం మార్పులొచ్చాయో చూసుకోరా? కార్మికులకు కనీస వేతనాలు పెరగలేదు. రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. నేతన్నల బతుకులు మారలేదు. ఉపాధి హామీ కూలీల జీవితాలను ఏనాడూ పట్టించుకోని బీఆర్ఎస్ సర్కార్ కౌలు రైతులు అసలు రైతులే కాదని ఢంకా బజాయించి చెప్పింది. ఉత్తర భారతదేశం స్థాయిలో కులోన్మాదం పడగవిప్పింది. కులదురహంకార హత్యలకు తెలంగాణ అడ్డాగా మారింది. వీటిపై నోరు మెదపదు బీఆర్ఎస్ నాయకత్వం. పైగా కనీసం విభజన చట్టం హామీల కొరకు ప్రజలందర్నీ సమీకరించి పోరాడిందీ లేదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీల విషయంలో మోడీ సర్కార్ ముందు మోకరిల్లింది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం. హనీమూన్ కాలం ముగిసిన తర్వాత మన రాష్ట్రానికి రావల్సిన బకాయిలపై ఎంత యుద్ధం చేస్తే ఉపయోగమే ముంటుంది.

ప్రస్తుతం పత్రికల వార్తలు చూస్తే జారిపోయే వారిని అధినేత బుజ్జగించే అంశాలు సైతం 'ఇంతకాలం ఇన్ని పదవులూ అనుభవించి (అంటే సంపాదించుకుని) ఇప్పుడు బయటకు పోవడం ఏం న్యాయమనే'! ఇక్కడ సిద్ధాంతాల్లేవు. డబ్బు చుట్టూనే ఆలోచన. 'ధనమూలం మిదం జగత్' అనేది!. వీరి కోసమే వచ్చిందేమో! అందుకే రాత్రికి రాత్రే కండువాలు మార్చుకుంటున్నారు. చొక్కాలు విప్పినంత తేలిగ్గా పార్టీలు మారుతున్నారు.

దేశంలో పార్టీలను, ప్రభుత్వాలను లొంగదీసుకునేందుకు గవర్నర్లు, ఈడీలు, ఐటీలు, సీబీఐలు ఇష్టానుసారం వాడుకుంటూ ఇటీవలి సతీష్ ఆచార్య కార్టూన్ వేసినట్టు 'కమలం' గుర్తు వాషింగ్ మెషీన్‌లో వేస్తే అవినీతి నుండి శుద్ధి అయి కాషాయం రంగుతో పవిత్రంగా బయటికొస్తున్న స్థితి. దేశవ్యాపితంగా ఎందరో పెట్టుబడిదారులు కం వ్యాపారవేత్తలు కం రాజకీయ నేతలు ఈ బాపతు పార్టీల్లో కనపడుతున్నారు. అందుకే సర్వం డబ్బుమయంగా మారింది. వాళ్ళకు పార్టీలు, సిద్ధాంతాలు కాదు, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కీలకం. బీజేపీ వంటి పార్టీలకు గొడ్డు మాంసం వ్యాపారం చేసే వాడైనా రూ. కోట్లు వెదజల్లగలిగేవాడైతే చాలు. అక్కున చేర్చుకుని టికెట్టిస్తాయి. దేశంలో పెరుగుతున్న పేదరికం ఈ పార్టీలకో వరం. నెలంతా చాకిరీ చేసినా నాలుగైదు వేల రూపాయలు సంపాదించడమే కష్టమైన పేదలకు ఒక రోజు ఓటుకు దానికి మించిన ధనం రావడం, దానికి అదనంగా వచ్చే ఇతరాంశాలు ఆ ఒక్క రోజుకైనా సంతృప్తినిస్తాయన్న గట్టి నమ్మకం.

ఈ స్థితి శాశ్వతంగా కొనసాగదు. వర్గపోరు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో తీవ్రంగావాలి. ఢిల్లీని గేరి వేసిన రైతు ఉద్యమం ఆనాడు హిందూ, ముస్లిం రైతాంగాన్ని ఐక్యంచేసింది. జాట్ చిక్కులను, దళిత కూలీలను చేయి, చేయి కలిపి రైతాంగ సమస్యలపై పోరుకు సిద్ధపడేలా చేసింది. వర్గ పోరే కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని, సామాజిక, ద్రావిడ చైతన్యం తమిళనాట స్టాలిన్ సర్కార్‌ని కాపాడు కుంటున్నాయి. ఏమైనా రాష్ట్ర పరిణామాలు కాంగ్రెస్ కంటే బీజేపీకి ఆనందం కల్గించేవి. రాష్ట్రంలో ఒకేలాంటి విధానాలున్న రెండు పార్టీలే మిగలడం ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు నష్టం.

హిందూత్వ,సామాజిక న్యాయం ఒకే ఒరలో ఇమడవు!



బీ.వీ.రాఘవులు

ప్రధాని నరేంద్ర మోడీ, 'సనాతన ధర్మానికి' తన మద్దతును బహిరంగంగా ప్రకటించినప్పుడే అసలు రహస్యం బయట పడింది. 'సనాతన ధర్మం', సామాజిక న్యాయాన్ని, సమానత్వ భావనను వ్యతిరేకిస్తుం దని తెలుపుతూ గతేడాది సెప్టెంబర్‌లో ఉదయనిధి స్టాలిన్ చాలా పదునైన, విమర్శనాత్మక వ్యాఖ్యలు చేసినప్పుడు, మోడీ దానిని గట్టిగా సమర్థించుకున్నాడు. 'సనాతన ధర్మ' వినాశనమే లక్ష్యంగా ఓ రహస్య ఎజెండాను కాపాడుతున్నారని ఆరోపిస్తూ, ఆ ధర్మాన్ని వ్యతిరేకించే వారినుద్దేశించి తీవ్రస్థాయిలో మాట్లాడాడు. 'సనాతన ధర్మ' విరోధులకు వ్యతిరేకంగా ఎదురుదాడి చేయడానికి హిందూత్వ ప్రచారదళంలో చేరాలని మంత్రుల్ని, తన పార్టీ సభ్యుల్ని రెచ్చగొట్టాడు కూడా. సామాజిక న్యాయం, దళితుల గౌరవం గురించి పదే పదే మోడీ చేస్తున్న వాదనల వెనకున్న కపటత్వంతో పాటు అంబేద్కర్‌పై ఆయన కురిపిస్తున్న ప్రశంసలు, సంత్ రవిదాస్ విగ్రహం పట్ల ఆయన చూపిస్తున్న గౌరవంలోని డొల్లతనాన్ని ఈ సంఘటన బట్టబయలు చేసింది.

"భారతదేశాన్ని వేల ఏండ్ల పాటు ఐక్యంగా ఉంచిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలను 'సనాతన ధర్మం' కలిగి ఉందని" మోడీ ప్రకటించాడు. అయితే 'పురాతన', 'శాశ్వత', 'సార్వత్రిక సత్యాలు లేదా చట్టాలు' లాంటి అస్పష్టమైన పదాలను తప్ప, 'సనాతన ధర్మానికి' సంబంధించిన ఆలోచనలు, విలువలు, సాంప్రదాయాలను కలిపే విషయం గురించి మోడీ గానీ, తన నేరమయ, హింసాత్మక దళం గానీ వివరించలేదు. ఈ వివరణ లేకపోవడమనేది 'సనాతన ధర్మం' ప్రాథమిక, విశిష్ట 'వర్ణ లేదా జాతి వ్యవస్థ' లక్షణాన్ని మరుగున పడేస్తుంది.

తనకు వనరుగా ఉండే దండు 'సనాతన ధర్మాన్ని' రక్షించడానికి ముందుకు వెళ్ళింది. వారు ఉత్కృష్టమైన వాక్చాతుర్యంతో దాని సారాన్ని దాచిపెట్టి, లోకజ్ఞానం, మానవ విలువలు, వ్యక్తిగత విధులు, బాధ్యతలు, ప్రవర్తనా ప్రమాణాలు, నైతిక విలువలు లాంటి మాటలతో దానిని నిర్వచిస్తున్నారు. 'సనాతన ధర్మం' నిజస్వభావాన్ని దాచిపెట్టడానికి దానిచుట్టూ వారల్లుతున్న అస్పష్టమైన అధ్యాత్మికవాదాన్ని సద్గురు వాసుదేవ్ లాంటి ప్రముఖులిచ్చిన వివరణల్లో మనం చూడవచ్చు. "మీరు సహజంగా వీటన్నింటికీ మూలాన్ని కనుగొనే విధంగా 'సనాతన ధర్మం' మొత్తం ప్రక్రియ నీలో ప్రశ్నల్ని లేవనెత్తుతుందని" ఆయన పేర్కొన్నాడు. ఇలాంటి మరొక వ్యక్తి, 'సనాతన ధర్మం' "అందర్నీ ప్రేమించి, అందర్నీ కలుపుకొని పోతుందని" వ్యాఖ్యానించాడు. ఒకవేళ మనం ఈ వాదనలను 'సనాతన ధర్మం' సారంగా అంగీకరించినా, ఇలాంటి శాశ్వతమైన సత్యాలే మనకు అన్ని మతాల్లో కనిపిస్తాయి. కానీ ఈ అభిప్రాయం అమానవీయ కుల, లింగ వివక్షతను ఎదుర్కొంటున్న దళితులు, ఇతర బలహీన కులాల వారి దినచర్యలో భాగంగా ఎదుర్కొంటున్న అనుభవాలకు వ్యతిరేకంగా ఉన్నాయి.

కాబట్టి వాస్తవానికి సనాతన ధర్మాన్ని వేరుగా ఉంచేదేమిటి? నిరాధారమైన వాటిని సమర్థించుకోలేని స్థితి నుండి హిందూత్వ తత్వవేత్తలు తప్పించుకోవడానికి సంక్లిష్టమైన వివరణలు, న్యాయ సమ్మతమైన ఆగ్రహంతో నిమిత్తం లేకుండా వారు సనాతన ధర్మంలో ఉన్న శాశ్వతమైన సత్యం అంటే కఠినమైన, అమానవీయ, శ్రేణీగత, వారసత్వ, పుట్టుక ఆధారిత కులవ్యవస్థను దాచి ఉంచలేరు. అత్యంత అణచివేత, హానికరమైన 'వర్ణాశ్రమ ధర్మం' లేక 'కుల ధర్మం' కొన్ని వేల సంవత్సరాలుగా భారతదేశాన్ని కలుపుతున్న ఏకైక ముఖ్యమైన ఆలోచన, విలువ, సాంప్రదాయం అనే వాస్తవాన్ని వారెలా విస్మరిస్తారు? కాబట్టి మోడీ, సంఘ్ పరివార్ ప్రత్యేకమైన బుద్ధి మాంద్యంతో బాధపడుతున్నట్లు కనిపిస్తున్నారు. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మ సూత్రాలు, గృహ్య సూత్రాలు, పురాణాలు, భగవద్గీతలు అన్నీ వర్ణ లేదా జాతి ధర్మ వ్యవస్థను సమర్థిస్తాయని వారు నిరాకరించగలరా? వర్ణ ధర్మం నుండి పక్కకు మళ్లుతున్నందుకు కఠినమైన శిక్షను విధించడమే కాక, వర్ణధర్మ పరిరక్షణ పాలకుల ప్రాథమికమైన బాధ్యత అని చెప్పే మనుస్మృతిని మనం పట్టించుకోకూడదని వారు కోరుకుంటున్నారా?

ఒకవేళ మోడీ వర్ణ లేదా జాతి ధర్మాన్ని, సనాతన ధర్మం నుండి వేరుచెయ్యాలనుకుంటే, విమర్శకుల్ని అప్రతిష్టపాలు చేయడానికి ముందే ఆయన ప్రజలకొక విషయాన్ని స్పష్టం చేయాల్సి ఉంటుంది. అది అతనికి ఖచ్చితంగా తెలియకుంటే శ్రేణీగత, వివక్షాపూరిత మైన 'వర్ణ లేదా జాతి ధర్మం' వారి పవిత్రమైన గ్రంథాల్లో భాగంగా ఉన్నాయా లేవా అనే విషయంపై అవగాహన కోసం వారు సాధువుల్ని, సంతుల్ని, శంకరాచార్యుల్ని వేడుకోవచ్చు. అయితే, మోడీ ఈ పని చెయ్యడమనేది, వాస్తవాల మీద కాక ఆశల మీద ఆధారపడిన నమ్మకం కావచ్చు ఎందుకంటే అది అతని కపటత్వాన్ని బయట పెడుతుంది.

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల ఫలితంగా ఏర్పడిన వివాదం హిందూత్వ దళం అసలు రంగును బయటపెడుతుంది. మోడీ, ఆయన అనుచరగణం ప్రజల ముందు 19 వ శతాబ్దానికి చెందిన సనాతనవాదులకు (మార్పును వ్యతిరేకించే) నిజమైన వారసులుగా చెప్పుకుంటున్నారు. ఈ కాలంలో బ్రాహ్మణ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్, తమను తాము సనాతన వాదులుగా పిలుచుకునే వారి నాయకులు ప్రతిపాదించిన సంస్కరణవాద ఆలోచనలను ఎదుర్కొనేందుకు అనేక సాంప్రదాయ సనాతన హిందూ సంస్థలు ఆవిర్భవించాయి. ఈ నాయకులే, ఆ 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు. 'హిందూ' అనే పదం పర్షియన్ మూలాలు కలిగి ఉన్నందువల్ల ఈ 'సనాతన వాద' సేవా తత్పరులు 'హిందూ' పదాన్ని ఇష్టపడక, దానికి బదులుగా 'సనాతన ధర్మం' అనే పదానికి ప్రాధాన్యత ఇవ్వడం ఆసక్తికరమైన విషయం.

ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల ఫలితంగా ఏర్పడిన వివాదం హిందూత్వ దళం అసలు రంగును బయటపెడుతుంది. మోడీ, ఆయన అనుచరగణం ప్రజల ముందు 19 వ శతాబ్దానికి చెందిన సనాతనవాదులకు (మార్పును వ్యతిరేకించే) నిజమైన వారసులుగా చెప్పుకుంటున్నారు. ఈ కాలంలో బ్రాహ్మణ సమాజం, ఆర్య సమాజ్, ప్రార్థనా సమాజ్, రామకృష్ణ మిషన్, తమను తాము సనాతన వాదులుగా పిలుచుకునే వారి నాయకులు ప్రతిపాదించిన సంస్కరణవాద ఆలోచనలను ఎదుర్కొనేందుకు అనేక సాంప్రదాయ సనాతన హిందూ సంస్థలు ఆవిర్భవించాయి. ఈ నాయకులే, ఆ 'సనాతన ధర్మానికి' ప్రాచుర్యం కల్పించారు.

***

దళితులు ఆరాధించే అంబేద్కర్ గౌరవం, సమానత్వ దార్శనికతను నెరవేర్చడానికి తాను కృషి చేస్తున్నట్టు చేసే నటనను గత దశాబ్ద కాలపు మోడీ పాలనా కాలం బహిర్గతం చేస్తుంది. దానికి బదులుగా మన దేశంలో పీడితులు, దోపిడీకి గురైన ప్రజలు పోరా టాల ద్వారా సాధించుకున్న కొన్ని అధికారికహక్కులు, కొద్దిపాటి గౌరవాన్ని అతని పాలన ఒక క్రమపద్ధతిలో ధ్వంసం చేసింది. పెరిగిపోతున్న నేరాల రేటు,



కుంచించుకుపోతున్న ఉద్యోగావకాశాలు, పెరిగిపోతున్న ఆర్థిక వివక్షత, దిగజారుతున్న దళితులు, గిరిజనుల జీవన స్థితిగతులుపై నిర్ధారణను ధ్రువీకరిస్తాయి.

మోడీ హిందూత్వ కార్పోరేట్ పాలనలో దళిత వ్యతిరేక, గిరిజన వ్యతిరేక నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇది, సమాజంలో మొత్తంగా మనువాద భావజాల ప్రాబల్యాన్ని సూచిస్తుంది. 2018 నుండి నాలుగేండ్లకాలంలో దళితులకు వ్యతిరేకంగా 1.9 లక్షలకు పైగా నేరారోపణ కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్ ఈ ఆగడాలకు, దాడులకు (మొత్తం49,613 కేసులతో) ప్రధాన కేంద్రంగా నిలిచింది. 2022 వ సంవత్సరాన్ని 2021 తో పోల్చితే షెడ్యూల్డ్ కులాల వారికి వ్యతిరేకంగా 13శాతం కేసులు పెరగ్గా, షెడ్యూల్డ్ తెగల వారికి వ్యతిరేకంగా 14.3శాతం కేసులు పెరిగాయి. ఎస్సీలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాల్లో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. అంటే మొత్తం కేసుల్లో 26శాతం, రాజస్థాన్ 15శాతం, మధ్యప్రదేశ్ 14శాతంగా ఉంది. ఎస్టీలకు వ్యతిరేకంగా నమోదైన కేసుల విషయంలో మొత్తం కేసుల్లో 30శాతంతో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 24శాతంతో రాజస్థాన్, 7.6శాతంతో ఒడిశాలున్నాయి.

నేరాల సంఖ్య పెరగడంతోపాటు, ఈ నేరాల్లోని క్రూరత్వం దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఏడుగురు దళిత యువకులను గుజరాత్ రాష్ట్రంలో ఉనాలో బహిరంగంగా కొట్టడం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్‌లో ఒక దళిత మహిళపై అత్యంత క్రూరంగా సామూహిక అత్యాచారానికి పాల్పడితే, అది ఆమె మరణానికి దారితీయడం, మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సోధీ ఘటనలో ఓ బీజేపీ నాయకుడు ఓ గిరిజన వ్యక్తిపై మూత్ర విసర్జన చేయడం లాంటి సంఘటనలు దేశం యొక్క అంతరాత్మను కదిలించాయి. సంఘ్ పరివార్, హిందూత్వ శక్తుల అండతో బీజేపీ ప్రభుత్వాలు సృష్టించిన మనువాద వాతావరణంలో దళితులు, గిరిజనులకు వ్యతిరేకంగా ఇలాంటి హేయమైన నేరాలు పాల్పడడానికి కులతత్వ శక్తులెలా ప్రోత్సాహం ఇస్తున్నాయో ఈ భయంకరమైన చర్యలు తెలియజేస్తున్నాయి. ఇవే శక్తులు, సమాజంలోని సామాజిక పీడిత వర్గాలకు సహాయ పడేందుకు ప్రభుత్వ నిశ్చయీకరణ చర్యల పట్ల ఒక శత్రుపూరిత వాతావరణాన్ని ఒక క్రమపద్ధతిలో పెంచి పోషిస్తున్నాయి. బీజేపీ పాలనలో బలహీన వర్గాలకు లభించే కొద్దిపాటి ప్రయోజనాలను కాలరాసేందుకు ప్రభుత్వమే ఈ శక్తులతో లాలూచీ పడుతుంది.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పనితీరు ఆమోదయోగ్యంగా లేదు. మార్చి 24,2022 న పార్లమెంట్ లో సమర్పించిన సమాచారం ప్రకారం తొమ్మిది మంత్రిత్వ శాఖలు, రైల్వేలు, ఆర్థిక, ఆటమిక్ ఎనర్జీ, రక్షణ, గృహ, హోం శాఖలతో సహా కేంద్ర ప్రభుత్వ శాఖలన్నింటిలో మొత్తం 82,022 ఖాళీలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన పోస్టులున్నాయి. కానీ వాటిలో కేవలం 43శాతం ఖాళీ పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. యూనివర్శిటీలు, ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో పరిస్థితి కూడా చాలా ఘోరంగా ఉంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 42శాతం ఖాళీ పోస్టులు, ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన 39శాతం, ఓబీసీ లకు రిజర్వ్ చేయబడిన 54శాతం ఖాళీపోస్టుల్ని భర్తీ చేయడంలో 45 సెంట్రల్ యూనివర్సిటీలు వైఫల్యం చెందాయి. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన 80శాతం ఖాళీ పోస్టులను ఇంత వరకు భర్తీ చేయకపోవడంతో అది అధ్వాన్నమైన యదార్థ స్థితిగా నిలిచింది. మోడీ నాయకత్వంలో ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ సేవలు, ఉన్నత విద్యలో ప్రయివేటీకరణ వేగవంతం కావడానికి తోడు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడంతో పాటు రిజర్వేషన్ల విషయంలో రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కేటాయింపుల గణనీయమైన తగ్గింపు, ఖర్చులలో కోతలు విధించడం ద్వారా వివక్షత కొనసాగింపులో మోడీ ప్రభుత్వమే స్వయంగా తోడుగా నిలిచింది. 2014-15, 2019-20 మధ్య ఆర్థిక సంవత్సరాల్లో జనాభా దామాషా ఆధారంగా జరిగిన మొత్తం కేటాయింపుల్లో కేవలం 20.8శాతం మాత్రమే వారి సంక్షేమానికి ఖర్చు చేసినట్లు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పత్రాలు తెలియజేస్తున్నాయి. ఇది, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయంగా చెల్లించాల్సిన 7.51 లక్షల కోట్ల రూపాయలను నిలిపివేయడంతో సమానం. దీనితో పాటు 2017-18లో ఎస్సీ సబ్‌ప్లాన్, ఎస్టీ సబ్‌ప్లాన్లను రద్దు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఉద్దేశించబడిన యంత్రాంగాన్ని ధ్వంసం చేసింది.

ఈ మార్పుల ఫలితంగా మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-20, 2023-24 మధ్య కాలంలో కేంద్ర, కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు. మిగిలినవి సాధారణ పథకాలకు కేటాయించారు. ఎస్టీల కుద్దేశించబడిన కేటాయింపుల్లో కూడా ఇదే వైఖరిని ప్రదర్శించింది. ఎస్టీలకు కేటాయించిన మొత్తం నిధుల్లో కేవలం 2.5శాతం మాత్రమే లక్ష్య పథకాలకు కేటాయించారు. కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు.

మోడీ రెండోసారి ప్రధాని పదవి చేపట్టిన 2019-20, 2023-24 మధ్య కాలంలో కేంద్ర, కేంద్ర రంగ ప్రాయోజిత పథకాల కేటాయింపుల మొత్తం నిధుల్లో ఎస్సీలకు కేవలం 10.6శాతం మాత్రమే కేటాయించారు. కేటాయింపుల్లో కూడా కేవలం 3.3శాతం మాత్రమే ఎస్సీల పథకాలకు మళ్ళించారు. మిగిలినవి సాధారణ పథకాలకు కేటాయించారు. ఎస్టీల కుద్దేశించబడిన కేటాయింపుల్లో కూడా ఇదే వైఖరిని ప్రదర్శించింది. ఎస్టీలకు కేటాయించిన మొత్తం నిధుల్లో కేవలం 2.5శాతం మాత్రమే లక్ష్య పథకాలకు కేటాయించారు. కేటాయించిన నిధుల్ని కూడా పూర్తి స్థాయిలో వినియోగించలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా దళితుల సాధారణ పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. 58శాతం దళితులకు భూమి లేదు. మోడీ పరిపాలనలోఆదివాసీలను, దళితులను పెద్ద సంఖ్యలో అభివృద్ధి పేరుతో వారి భూముల నుండి బలవంతంగా వెళ్లగొడుతున్నారు. స్వంత భూములున్న 50శాతం దళితులకు సాగునీటి సౌకర్యాలు లేవు. సాధారణ జనాభాలో 33.3శాతం జనాభాతో పోల్చినప్పుడు 65.8శాతం దళితులు, 81.4శాతం గిరిజనులు బహు మితీయ (మల్టీ డైమెన్షనల్) పేదరికంలో జీవిస్తున్నారు, ఇది చాలా తీవ్రమైన పరిస్థితి. ఎస్సీలలో అక్షరాస్యతా రేటు కేవలం 66శాతంగానే ఉండగా, ఎస్టీల్లో అది 59శాతం కన్నా తక్కువగా ఉంది, అంటే జాతీయ సగటు రేటు 73శాతం కంటే కూడా తక్కువగా ఉంది. అంతే కాకుండా 2022 నాటికి ఎస్సీలలో నిరుద్యోగ రేటు 8.4శాతంగా చాలా ఎక్కువగా ఉంది. ఎస్సీలలో అసంఘటితరంగ కార్మికులు చాలా ఎక్కువగా 84శాతంగా ఉన్నారు. ఈ గణాంకాలు మోడీ నాయకత్వంలోని మతతత్వ, కార్పోరేట్ ప్రభుత్వం దళిత వ్యతిరేక, పేద ప్రజల వ్యతిరేక స్వభావాన్ని తెలియజేస్తుంది. మోడీ హిందూత్వ లేక 'సనాతన ధర్మ' భావజాలంలో సామాజిక న్యాయాన్ని వెతకడం అంటే ఎండమావిలో నీటిని వెతకడం లాంటిదే.

("పీపుల్స్ డెమొక్రసీ" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

ఎవరికి.. ఎందుకు..ముద్దు?

పండి ఎండిన పచ్చనాకులు
చెట్టుకెందుకు ముద్దవుతాయి
వయసు మళ్ళిన వృద్ధ దేహాన్ని
ఏ గడప కడదాకా మోస్తుంది
బంధాలూ బంధుత్వాలూ
ఆస్తి సంధిలో పందిళ్ళే కదా !
రక్తాన్నెప్పుడో రూపాయి కొన్నాక
మనిషి ధర్మం మార్కెట్ బంధమేగా

అవును అప్పుడు.. ఇప్పుడు
ఇన్సూరెన్సే అజెండా తప్ప
పన్నుకట్టే మనిషికి వైద్యం
అసాధ్యంగా ఎందుకైందో
ప్రశ్నించడం మరిచిపోయాం

గింజకు పురుడుపోసే పొలంలో
పనెందుకు దూరమైన ప్రశ్నయిందో
తల్లిలా చనుబాలు పట్టే వాళ్లిపుడు
పట్నం ఎండిన రొమ్ముగా మార్చిన
విటుడెవరో.. చర్చెందుకు లేవలేదు?

పల్లెందుకు వల్లకాడౌతుందో
పట్టణంలో ప్రయివేటు చదువు
విదేశీ గాలానికెలా తగులుకుందో
తల్లి రొమ్ము కోసిన రాక్షసి
సొంత అక్షరాన్ని హత్యచేసి
ఆంగ్ల అక్షరాన్నెలా ముద్దాడిందో
ఎవరైనా కొంచం యోచిస్తున్నారా?
ఎప్పుడైనా ఓసారి ప్రశ్నిస్తున్నారా?

-ఉన్నం వెంకటేశ్వర్లు,
8790068814

నరుల శ్రమే..కుబేరుల సిరి



కె.శాంతారావు,
9959745723



మరో ఆరు సంవత్సరాల్లో (2030 నాటికి) మన భారత్ ఏడులక్షల కోట్ల డాలర్ల (ఏడు ట్రిలియన్లు) ఆర్థిక వ్యవస్థగా ఎదిగి ప్రపంచంలో అమెరికా, చైనా తర్వాత తృతీయ శక్తిగా పరిణమిస్తుందని పాలకులతో పాటు ఆర్థికవేత్తలు కొందరు అంచనా వేస్తున్నారు. మరి ఇప్పటివరకు జరుగుతున్న, పెరుగుతున్న ఆర్థిక వ్యత్యాసాలపై వారు పెదవి విప్పరు. పేదరికం తగ్గుతున్నదా? రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు ఆగుతాయా? జలవనరులు - కాలు ష్యం మాటేమిటి? విద్యా వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తాయా? పిల్లలు పౌష్టికాహార లేమి లేకుండా హాయిగా ఎదుగుతారా? అన్నిటికన్నా ముఖ్యం శాంతి-భద్రతలు సమకూరుతాయా? సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగ వుతాయా?- ఇలాంటి ప్రశ్నలకు వారు సరైన సమాధానం ఇవ్వలేకున్నారు. వారే కాదు పెట్టుబడిదారీ వ్యవస్థకు బంధీ అయిన ఏ పాలకుడు, ఆర్థికవేత్త ఇందుకు సమాధానం ఇవ్వలేడు. వారి దగ్గర ఉండదు. కారణం కారల్ మార్క్స్ ఏనాడో తెలిపినట్టు పెట్టుబడిదారీ వ్యవస్థను బతికించేది ఆర్థిక దోపిడీ చట్రం గనుక.

దోపిడీ తాండవించే చోట అవినీతి తారాస్థాయికి చేరుతుంది. ప్రతిచర్యగా పేదరికపు విషఫలాలు శ్రామి కులు భరిస్తుంటారు. ఎంత సర్దిచెప్పుకున్నా ఈ సత్యం మాత్రం దాగదు గాక దాగదు. కావాలంటే ఈ లెక్కలు చూ డండి. మొత్తం దేశ సంపదలో నలభైశాతం కేవలం ఒక్క శాతం అపరకుబేరుల (శతకోటీశ్వరులు- బిలియనీర్స్) చెంతనే ఉన్నది. దిగువనున్న 50 శాతం పేదల వద్ద 15 శాతం జాతీయాదాయం మాత్రమే ఉంటున్నది. తత్ ఫలితంగా దాదాపు 23 కోట్లమంది కటిక దరిద్రులు మన దేశంలో పేరుకుపోయారు. ప్రపంచంలో అత్యంత అసమానతలు గల దేశంగా మన భారత్ గణతి కెక్కింది. ఈ పరిణామం మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. రాజ్యాంగ ప్రవేశికలో మన దేశాన్ని సామ్యవాద దేశంగా ప్రకటించుకున్నాం. ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్ 39, సంపద కేంద్రీకరణ కాకుండా చూడాలని తెలిపింది.

సంపద కేంద్రీకరణపై తాజాగా 'ప్రపంచ అసమానతల ప్రయోగశాల', 'ఐక్యరాజ్య సమితి అభివృద్ధి సంస్థ' సంయుక్తంగా విడు దల చేసిన నివేదిక ఈ విషయాన్ని బట్టబయలు చేసింది. దిగువనున్న 50 శాతంలోని పేదల తలసరి ఆదాయం మొదటి పదిశాతంలో ఉన్న సంపన్నుల తలసరి ఆదాయం కంటే 20 రెట్లు తక్కువగా ఉన్నదని తెలిపింది. సంపదను సృష్టించే అధిక శాతం శ్రామికవర్గం వద్దకు సంపద చేరడం లేదని చెప్పకనే చెప్పింది.

బ్రిటీష్ పాలనా కాలంలో మొదటి పదిశాతం సంపన్నుల వద్ద 50 శాతం సంపద పోగుపడి ఉన్నది. స్వాతంత్ర్యానంతరం అప్పటి ప్రధాని నెహ్రూ ప్రభుత్వం సోషలిస్టు రష్యా స్ఫూర్తితో పంచవర్ష ప్రణాళికలు ప్రవేశ పెట్టింది. ఫలితంగా కొంతలో కొంత సంపద కేంద్రీకరణ 50 నుండి 35 శాతానికి తగ్గింది. కానీ 1990 నుంచి అమలైన నూతన ఆర్థిక విధానాలు (సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ- ఎల్.పి.జి) వలన అసమానతలు తగ్గడం కాదు కదా తీవ్రమవడం మొదలైనాయి. ఈ విధానాలతోనే బిలియనర్ల సంపద అమాంతంగా పెరిగింది. పేదల, మధ్య తరగతి ఆదాయా లకు గండిపడింది. చివరకు దిగువ 50 శాతం ప్రజానీకం వద్ద కేవలం ఆరుశాతం సంపద మాత్రమే మిగిలింది.పైనున్న మొదటి పది శాతం సంపన్నుల వద్ద 65 శాతం సంపద పోగుపడింది. మొదటి ఒక్కశాతం బిలియనీర్లవద్దనే 33 శాతం సంపద పోగు పడింది. లాకులు ఎత్తేసినట్టు సిరి అంతా కుబేరుల చెంతకు చేరింది.

అలాగే గతేడాది ఆక్స్‌ఫామ్ నివేదిక మొదటి 30శాతం సంపన్నుల వద్దనే 90 శాతం సంపద పోగుపడినట్టు తెలిపింది. 2020లో బిలియనీర్లు 102 మంది ఉంటే 2022 నాటికి ఆ సంఖ్య 166కు చేరుకుంది. మొదటి వంద మంది బిలియనీర్ల సంపద లెక్కవేస్తే 54.12 లక్షల కోట్లు అని తేలింది. మొదటి పదిమంది బిలియనీర్ల సంపద 27.52 లక్షల కోట్లు. 2021 వచ్చే సరికి ఒక ఏడాదిలో ఈ బిలియనీర్ల సంపద 32.8 శాతం పెరిగింది. ఇంతింతై, వటుడింతై అన్నట్టు ఈ సంపద ఇలా కొండలా పెరిగిపోవడం పట్ల ఆర్థిక వేత్తలు ఇప్పుడు గుండెలు బాదు కుంటున్నారు. విరుగుడుగా ఈ సంపన్నులపై అధిక పన్నులు వేసి ఆ వచ్చిన ఆదాయంతో ప్రభుత్వం విద్య- వైద్య- ఉపాధి రంగాలను మెరుగుపర్చాలని సూచిస్తున్నారు. చెవిటివాని ముందు శంఖం ఊదినట్టున్నది ఈ తంతు. పాలకులు తత్‌విరుద్ధంగా కార్పోరేట్లకే రాయితీలు ఇవ్వడం, ప్రభుత్వ సంస్థలను కారుచౌకగా కట్టబెట్టడం మనం గమనిస్తున్నాం. మరో పక్క ప్రజలపై మోయలేని పన్నుల భారాన్ని వేయడాన్ని కూడా చూస్తున్నాం.

మొదటి పదిశాతం సంపన్నులపై ఐదు శాతం అధిక పన్ను వేస్తే ఆ వచ్చే ఆదాయంతో ఐదేండ్లపాటు దేశంలోని ఆదివాసులందరికీ చక్కటి ఆరోగ్యాన్ని అందించవచ్చట. అంతెందుకు మొదటి పదిమంది బిలియనీర్లపై ఒక శాతం పన్ను వేసినా, ఆ ఆదాయంతో పద మూడేండ్ల పాటు ప్రాథమిక పాఠశాలలన్నింటా ఉపాధ్యాయ ఖాళీలు నింపి పిల్లలకు నాణ్యమైన విద్య నందించవచ్చు. ఉపాధిరంగ వృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. కానీ, ఈ ప్రభుత్వం అలా చేయదు. ఎందు కంటే ఇది పక్కా కార్పోరేట్ల ప్రభుత్వం గనుక.

ప్రజల నిత్య జీవితంలో భాగమైన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ సుంకం పెంచి 2014-15లో రూ. 99 వేల కోట్లు ప్రభుత్వం ఆర్జిస్తే, 2021కి ఆ సుంకం 3 లక్షల 73 వేల కోట్లకు చేరింది. ప్రధాని మోడీ ప్రభు త్వం చలవ- పెట్రోల్ 79 శాతం, డీజిల్ 101 శాతం, వంటగ్యాస్ 30 శాతం పెరగడం ప్రజల అనుభవంలోకి వచ్చి ంది. శ్రమజీవుల సంపాదనలో అధిక భాగం ఇలా ప్రభుత్వ సుంకాలకు పోతుంటే ఇంక చెప్పేదేముంది? విష యం ఏమిటంటే దిగువనున్న 50 శాతం కష్టజీవులు, పైనున్న పదిశాతం సంపన్నుల కంటే ఆరురెట్లు ఎక్కువ ఈ సుంకాలు చెల్లిస్తున్నారు. ఆహార, ఆహారేతర ఉత్పత్తులపై వసూలయ్యే పన్నుల మొత్తంలో 64.3 శాతం ఈ దిగువ నున్న 50 శాతం పేదలే చెల్లిస్తున్నారు. మొత్తం జీఎస్టీ (వస్తు సేవల పన్ను)లో మూడింట రెండింతలు ఈ పేదలు చెల్లిస్తుంటే పైనున్న పదిశాతం సంపన్నులు చెల్లించేది కేవలం 3-4 శాతం మాత్రమే. పన్నుల విధాన రూపకల్పనే మోడీ ప్రభుత్వం అలా చేసింది. అలాంటప్పుడు ఇది ప్రజాప్రభుత్వమంటే విషయం తెలిసినవారు ఎందుకు నమ్ముతారు? ఎందుకు నమ్మాలి?

కాగా, మన దేశంలో ప్రతి ఏటా పదిహేడు లక్షల మంది పేదలు సరైన తిండి దొరక్క, ఆకలితోనూ, పౌష్టి కాహారలేమితోనూ మరణిస్తున్నారు. బిలియనీర్లపై మూడు శాతం అధికంగా పన్నువేస్తే చాలు. ఆ వచ్చే ఆదాయంలో జాతీయ ఆరోగ్య పథకానికి మూడేండ్లకు సంపద నిధులు సమకూర్చుకోవచ్చుట. మొదటి పదిశాతం సంపన్నులపై ఐదు శాతం అధిక పన్ను వేస్తే ఆ వచ్చే ఆదాయంతో ఐదేండ్లపాటు దేశంలోని ఆదివాసులందరికీ చక్కటి ఆరోగ్యాన్ని అందించవచ్చుట. అంతెందుకు మొదటి పదిమంది బిలియనీర్లపై ఒక శాతం పన్ను వేసినా, ఆ ఆదాయంతో పద మూడేండ్ల పాటు ప్రాథమిక పాఠశాలలన్నింటా ఉపాధ్యాయ ఖాళీలు నింపి పిల్లలకు నాణ్యమైన విద్య నందించవచ్చు. ఉపాధిరంగ వృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. కానీ, ఈ ప్రభుత్వం అలా చేయదు. ఎందు కంటే ఇది పక్కా కార్పోరేట్ల ప్రభుత్వం గనుక. అందుకే కార్పోరేట్ పన్నులు 30 నుంచి 22 శాతానికి తగ్గించింది.14.5 లక్షల కోట్ల రుణాలను (కార్పోరేట్లవి) ఏకపక్షంగా రద్దు చేసింది.

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్న చందాన ఈ ప్రభుత్వం కార్పోరేటర్లతో అలా చెట్టాపట్టాలేసుకు తిరుగు తుంటే సామాన్య ప్రజలగోడు ఎలా వినగలదు? తొండ ముదిరి ఊసరివెల్లి అవుతున్నట్టు, ఇదంతా రాజకీయ అవినీతిగా చెలామణి అవుతున్నది. ఎన్నికల బాండ్ల రూపంలో ఎలా బయటపడిందో మచ్చుకు కొంత మాత్రమే చూడ గలి గాము. కానీ నల్లధనంగా ప్రజల శ్రమశక్తి ఎంతగా పోగుపడుతున్నదో అంతు చిక్కడం లేదు. మరో విషయం, కుడి ఎడమలుగా మన దేశానికి పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ఉన్నాయి.

బంగ్లాదేశ్ ప్రభుత్వం ఉన్నంతలో ప్రజా సంక్షేమానికి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధికి ప్రాధాన్యతనిస్తుంటే, పాకిస్తాన్ సైనిక చర్యలకు, ఆయుధ వినియోగాలకు అమితంగా పాల్పడుతన్నది. బంగ్లాదేశ్ తలసరి ఆదాయం 2,646 డాలర్లు ఉంటే, పాకిస్తాన్ తలసరి ఆదాయంగా 1,471 డాలర్లకు ఘోరంగా దిగజారింది. కాగా భారత్ తలసరి ఆదాయం బంగ్లాదేశ్ కన్నా తక్కువ అవడం (2,612 డాలర్లు) గమనార్హం. అంటే మనం పాకిస్తాన్ దిశగా నడుస్తున్నామా...? అనే భయం వెంటాడు తున్నది. ఇలాంటి నేపథ్యంలో భారత్ తృతీయ శక్తిగా ఎదిగితే ఎవరకు గొప్ప? ప్రజల శ్రమశక్తి సంపదంతా కుబేరుల పరమవుతున్నప్పుడు కష్టజీవులకు ఒరిగేదేముంది. నిష్ట దరిద్రం తప్ప.'ఎవరి కష్టఫలితం వారికి దక్కేలా చూడటమే సరైన ప్రభుత్వ లక్ష్యం' అన్న అబ్రహంలింకన్ మాటలకు మన ప్రభుత్వ చేతలకు పొంతనే లేకుండా ఉన్నది కదూ...



రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ

- లోక్‌సభ ఎన్నికల్లో 13 లేదా 14 స్థానాలు కాంగ్రెస్‌కే.. : భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజురోజుకూ ఖాళీ అవుతోందని, ఆ పార్టీ గురించి మాట్లాడితే సమయం వృథా అని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30న నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని ముఖ్యులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీజేపీతోనే పోటీ ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన వాగ్దానాలను బీజేపీ నెరవేర్చలేదని, ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీకి లేదని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై మాట్లాడే మోడీ.. కేంద్ర సంస్థల రుణాలు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. అన్ని విధాలుగా మోడీ హయాంలో ప్రజాస్వామ్యం అణచివేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి, మోడీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 13 లేదా 14 స్థానాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్ తదితరులు ఉన్నారు.



పార్టీకి ద్రోహం చేసినవాళ్లను..

తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదు

- సిద్దిపేటలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట

కాంగ్రెస్ పార్టీ కొంతమంది నాయకులను కొంటుందేమోగాని, బీఆర్ఎస్ కార్యకర్తలను కొనలేదని, పార్టీ ద్వారా పదవులు పొంది ద్రోహం చేసిన వాళ్లను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం కొండ మల్లయ్య గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేమన్నారు. సిద్దిపేట కార్యకర్తలకు ఇది పరీక్ష అని, తన ఎన్నిక కోసం మీరు ఎంత కష్టపడ్డారో వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కూడా అంతే కష్టపడాలని కోరారు. తనకొచ్చినంత మెజారిటీతో ఆయన్ను గెలిపించాలన్నారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు ఇక్కడికొచ్చి సిగ్గులేకుండా ఓట్లు అడుగుతున్నారని రఘునందన్ రావును ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రొజెక్టర్ ద్వారా చూపించి, హామీలు పొందినవారు కాంగ్రెస్‌కు ఓటేయాలని, హామీలు పొందని వారు బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు. రూ.2 లక్షలు రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండి, కానివాళ్లు బీఆర్ఎస్‌కు ఓటు వేయండని అన్నారు. మహిళలు, పింఛన్ లబ్దిదారులు, రైతులు తమ ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. సిద్దిపేటలో అభివృద్ధిని రేవంత్ అడ్డుకుంటున్నారని, తాను శాంక్షన్ చేసిన వెటర్నరీ కాలేజీని కొడంగల్‌కి తరలించారని, శిల్పారామం, అల్లీపూర్ డబుల్ రోడ్డు పనులను మధ్యలోనే ఆపివేశారని అన్నారు. సిద్దిపేటపై బీజేపీకి ఎందుకింత ద్వేషమని, రఘునందన్ దుబ్బాక నుంచి గెలిచినా ఎందుకు ఢిల్లీ నుంచి నిధులు తీసుకురాలేదని, ఇతను గెలిస్తే మనకు న్యాయం చేస్తాడా..? రఘునందన్ బాగా పనిచేస్తే మొన్నటి ఎన్నికల్లో 54 వేల ఓట్ల తేడాతో ఎందుకు ఓడిపోయారని గుర్తుచేశారు. కేజ్రీవాల్, కవిత, తమిళనాడు ముఖ్యమంత్రి బిడ్డ ఉదయనిధిపై ఎందుకు కేసులు పెట్టారని, దేశంలో ఏ ఒక్క బీజేపీ నాయకునిపై కేసు అయిందా అని ప్రశ్నించారు. నల్లధనం తీసుకువచ్చారా, రైతులను ఢిల్లీలో పొట్టన పెట్టుకున్నారని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. పేద పిల్లలను దత్తత తీసుకుని వెంకటరామిరెడ్డి చదివిస్తున్నారని, విద్యావంతుడు, కలెక్టర్‌గా పనిచేసిన ఆయనను గెలిపించుకుంటే ఢిల్లీలో మన గొంతు బలంగా వినిపిస్తాడని, నిధులు తీసుకొస్తాడని అన్నారు.

తన తనువు.. తన చావు ఈ గడ్డమీదనే.. : వెంకటరామిరెడ్డి

ఈ గడ్డ తనకు జన్మనిచ్చిందని, 11 ఏండ్ల పాలనలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజలకు దగ్గరయ్యానని, తన చావు కూడా ఈ గడ్డ మీదనేనని మెదక్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి అన్నారు. దేశంలో ఏ కలెక్టర్ కూడా ఐదేండ్లు ఒకే దగ్గర ఉండి పాలన చేయలేదని, తనకు ఆ అదృష్టం కేసీఆర్, హరీశ్‌రావు వల్ల దక్కిందని తెలిపారు. రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి, కార్యకర్తల, పేద పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తానని, ప్రతి ఖర్చును వెబ్‌సైట్‌లో పెడతానని అన్నారు. గెలిచిన 9 నెలల్లోనే ప్రతి నియోజకవర్గంలో రూ. రెండు కోట్లతో ఫంక్షన్ హాల్‌ను నిర్మించి, ఒక్క రూపాయికే కార్యకర్తల ఫంక్షన్ల కోసం ఇస్తానని చెప్పారు. జూన్ 4న తాను గెలుస్తున్నానని, అదే రోజు ట్రస్టు కోసం శంకుస్థాపన చేస్తానని అన్నారు. మీరందరూ తన కుటుంబ సభ్యులని, గెలుపు కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, జెడ్పి చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, ప్రజా పతినిధులు, నాయకులు రవీందర్ రెడ్డి, చిన్న, సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, వజీర్, మొయిజ్, తిరుమల్ రెడ్డి, నాయకం లక్ష్మణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఘ్నేశ్

టీయూలో ఐదు రెట్లు పెంచిన..

కాన్వకేషన్ ఫీజును తగ్గించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రూ.700గా ఉన్న కాన్వకేషన్ ఫీజును ఐదు రెట్లు పెంచడం దారుణమని, పెంచిన ఫీజును తగ్గించాలని ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రాచకొండ విఘ్నేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీన తెలంగాణ యూనివర్శిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ పాసైన విద్యార్థులు తీసుకునే కాన్సొలిడేటెడ్ మెమో, ఓడీ, కాన్వకేషన్ మెమోలకు సంబంధించిన ఫీజులను రూ.700 నుంచి రూ.3500కు.. అంటే ఒకేసారి ఐదు రేట్లు పెంచడం దారుణమన్నారు. కాన్వకేషన్ ఫీజుకు సంబంధించి ఇతర యూనివర్శిటీలైన ఓయూ, కాకతీయ, శాతవాహన కన్నా అధికంగా తెలంగాణ యూనివర్శిటీ యంత్రాంగం విద్యార్థుల నుంచి వసూలు చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. కాన్వకేషన్ ఫీజును వెంటనే తగ్గించాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్శిటీ సహాయ కార్యదర్శి పవన్, విశాల్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహి కడియం శ్రీహరి..

తన పదవికి రాజీనామా చేయాలి

- బ్లాక్ మెయిల్ చేసి పదవులు పొందుతారు
- దళిత నాయకులను ఎదగనీయని కుట్రదారు : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-హన్మకొండ/ధర్మసాగర్

కుట్రలు, కుతంత్రాలు చేసి అధిష్టానానికి తప్పుడు సమాచారం అందిస్తూ నీచమైన రాజకీయాలు చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని, కనీస నైతికత, వయస్సుపై గౌరవం ఉంటే ముందుగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తర్వాత ఏ పార్టీలోనైనా చేరాలని కడియం శ్రీహరికి బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కూతురు కడియం కావ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న విషయం తెలిసిందే. ఈ విషయమై జిల్లా బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ జిల్లా అధ్యక్షులు దాస్యం, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తదితర నాయకులతో హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. గతంలో టీడీపీలో పనిచేసినపుడు ఆ పార్టీ నేత చంద్రబాబును బ్లాక్ మెయిల్ చేసి అనేక పదవులు అనుభవించారని గుర్తుచేశారు. ఎదుగుతున్న దళిత నాయకులపై కుట్రలు చేసి, చాడీలు చెప్పిన నీచమైన చరిత్ర శ్రీహరిదంటూ విమర్శించారు. గత అహంకార పూరిత చర్యలు మరిచి తెలంగాణ కోసం తాను, కేటీఆర్, పెద్ది నిస్వార్థంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు. బీఆర్ఎస్‌లోకి రాగానే నీ స్వార్థానికి విజయరామారావు, రాగమళ్ళ పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య పసునూరి దయాకర్, ఆరూరి రమేష్.. తదితరులు బలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావ్య అభ్యర్థిత్వాన్ని అనేక మంది ఉద్యమకారులు, దళిత సంఘాలు వ్యతిరేకించినా వారిని ఒప్పించే ప్రయత్నం చేస్తున్నామని కానీ, రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీతో ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసుకుని నువ్వూ నీ బిడ్డ ఓ లేఖను విడుదల చేయడం సిగ్గుచేటన్నారు.



పదవులన్నీ అనుభవించిన కడియం : పెద్ది

పార్టీలోకి వచ్చిన కొద్ది కాలానికే ఎన్ని పదవులు ఉంటే అన్నింటిని అనుభవించిన చరిత్ర కడియం శ్రీహరిదంటూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా శ్రీహరి రాజకీయ విలువలు, నిజాయితీ అంటూ నీతులు చెప్పడం మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీగా ఉంటూ స్టేషన్ ఘన్‌పూర్‌లో రాజకీయం చేస్తే అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని శ్రీహరికి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. తాజాగా నీ బిడ్డకు ఎంపీ టికెట్ సైతం ఇచ్చారని చెప్పారు. కడియం లాంటి వ్యక్తుల నుంచి కాంగ్రెస్ పార్టీ వాళ్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కాగా, మీడియా సమావేశానికి హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. కడియం శ్రీహరి ఘటనపై ముందుగా ఆయనే మాట్లాడుతారని అందరూ భావించారు. కానీ ఆయన మీడియా సమావేశంలో ముభావంగా, నిశ్శబ్దంగా ఉండి ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయారు. దాంతో కడియం శ్రీహరి తర్వాత కాంగ్రెస్‌లోకి వెళ్ళే వంతు ఎర్రబెల్లిదే అని అక్కడ గుసగుసలు వినిపించాయి. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, నన్నపునేని నరేందర్, హనుమకొండ జడ్పీ చైర్‌పర్సన్ సుధీర్ కుమార్, నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సుదందర్ రాజు యాదవ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు తగిన బుద్ధి చెబుతారు : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి, మాజీ సీఎం కేసీఆర్‌కు ద్రోహం చేసిన కడియం శ్రీహరికి, ఆయన కుమార్తె కడియం కావ్యకు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన పదవి తర్వాత ఉప ముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా అత్యున్నతమైన స్థానాలు ఇచ్చి కడియం శ్రీహరిని ఆదుకున్నారని గుర్తు చేశారు. కానీ నేడు తన కుటుంబ స్వలాభం కోసం కాంగ్రెస్‌లో చేరడం దారుణమన్నారు. తన స్వార్థం కోసం మాదిగ సామాజిక తరగతికి చెందిన స్థానిక నాయకులైన తాటికొండ రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను తన కుట్రపూరితమైన ఆలోచనలతో పార్టీకి దూరం చేసిన ద్రోహి కడియం శ్రీహరి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కో-ఆప్షన్ సభ్యులు జుబేదా లాల్ మహమ్మద్, వేలేరు జెడ్పీటీసీ చాడ సరితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మునిగేల రాజు, ఎంపీటీసీ బొడ్డు శోభ, కర్ర సోమిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

ఏప్రిల్ ఆరున రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభపై ఫోకస్ చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించేలా ఆ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కోరారు. ఈ సభా వేదికపై ఐదు గ్యారంటీలను అగ్రనేతలు ప్రకటించబోతున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (పీఈసీ)సమావేశంలో సీఎం మాట్లాడారు.

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కొందరికి నామినేటెడ్ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని మ్యానిఫెస్టో కమిటీకి సలహాలు ఇవ్వాలని నేతలకు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను నియమించి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏఐసీసీ మేనిఫెస్టోలోని ఐదు న్యాయ్ గ్యారంటీల ప్రచారాన్ని విస్తృతంగా చేయాలన్నారు.



సీఎంను కలిసిన కేకే

కేంద్రంలో తెలంగాణకు సంబంధించిన పెండింగ్ పనులను మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు.

దేశంలో తెలంగాణ మోడల్ పాలన బాగుందని జాతీయ నాయకత్వం కితాబు ఇవ్వడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని మెజార్టీ సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి ప్రజల్లో మంచి స్పందన ఉందని నేతలకు వివరించారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, సలహాదారులు, నామినేటెడ్ పోస్టుల్లో పదవులు పొందిన వారిని అభినందిస్తూ తీర్మానం చేశారు.

వంద రోజుల పాలనపై ప్రజల్లో మంచి స్పందన : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వంద రోజుల పాలన పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. వందరోజుల పాలన పట్ల ప్రజల్లో ఉన్న స్పందనను ప్రచారంలో వాడుకోవాలని సూచించారు. రైతు బంధు ఇవ్వలేదంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తమ ప్రభుత్వంపై ప్రజల్లో ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్ ఉందన్నారు. రైతు బంధు ఇవ్వలేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు

ఆ ఇద్దరిపై పగ తీర్చుకోవాలె..

(మొదటిపేజీ తరువాయి)

సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకుంటా...' అని నేతలకు భరోసానిచ్చారు. 2014లో కొండా విశ్వేశ్వరరెడ్డి, 2019లో గడ్డం రంజిత్‌రెడ్డిని ప్రజలకు పరిచయం చేసింది బీఆర్ఎస్సేనని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టయిన రోజు రంజిత్‌రెడ్డి నవ్వుకుంటూ కాంగ్రెస్‌లోకి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్నం మహేందర్‌రెడ్డి కూడా పార్టీకి తీరని ద్రోహం చేసి, కాంగ్రెస్ పంచన చేరారని వాపోయారు. అందువల్ల వారిద్దరినీ ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని హెచ్చరించారు. మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేయాలంటూ తాను విసిరిన సవాల్‌కు సీఎం రేవంత్ ఇప్పటికీ స్పందించ లేదని ఎద్దేవా చేశారు. ఈ రకంగా తన సిట్టింగ్ సీట్లోనే వెనుకంజలో ఉన్న ఆయన... అత్యధిక సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపిస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన రైతులకు రుణమాఫీ, రూ.4 వేల పింఛను, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, అందరికీ ఉచిత కరెంటు తదితర హామీలేమయ్యాయంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని అన్నారు. కొద్ది రోజుల తర్వాత ఖమ్మం, నల్లగొండ కాంగ్రెస్ నేతలే రేవంత్‌కు మానవబాంబులవుతారని హెచ్చరించారు. పార్టీకి కష్టకాలం వచ్చినప్పుడు, దాన్ని ఆదుకునేందుకు



కాసాని జ్ఞానేశ్వర్ ముందుకు వచ్చారని ప్రశంసించారు. ఆయన కేవలం రంగారెడ్డి జిల్లాకే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అందరిరకీ తెలిసిన నాయకుడని కితాబిచ్చారు. అందువల్ల చేవెళ్లలో ఆయన గెలుపుకోసం ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఏప్రిల్ 13న చేవెళ్లలో నిర్వహించబోయే కేసీఆర్ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... చేవెళ్లలో తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని సబ్బండ వర్గాలు తనకు మద్దతుగా నిలుస్తాయంటూ ఆశాభావం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థిత్వం వదులుకుని..

కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య

- కూతురు వెంటే.. 'కడియం' • డైలమాలో.. బీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయాలు అనూహ్యంగా మారుతున్నాయి. తాజాగా వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు డాక్టర్ కడియం కావ్య పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్‌కు గురువారం లేఖ రాశారు. దాంతో తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరనున్నట్టు బలంగా ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇంటికి రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, కాంగ్రెస్ నేతలు మల్లు రవి, సంపత్ కుమార్ తదితరులు వెళ్లి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి త్వరలోనే తన అనుచరులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. కాగా, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును ఖరారు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి ఖరారు విషయంలో ముందు నుంచి వేచి చూసే ధోరణి అవలంభించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 'కడియం' ఇచ్చిన షాక్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణులు ఏం జరుగుతుందో అర్థం కాని డైలమాలో పడ్డారు.



(ఫైల్)



బీఆర్ఎస్‌కు అభ్యర్థి కరువు

పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య ప్రకటించడంతో ఆ పార్టీకి అభ్యర్థి కరువయ్యారు. తాజాగా వరుస పరిణామాలతో అభ్యర్థి కోసం మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో ఫోన్‌లోనే చర్చలు జరిపినట్టు సమాచారం. సినీ నటుడు బాబు మోహన్‌ను రంగంలోకి దించాలని చర్చించినట్టు తెలుస్తోంది. తొలుత బీఆర్ఎస్‌లో చేరి ఒక పర్యాయం ఎమ్మెల్యే అయిన బాబుమోహన్‌ను అనంతరం పట్టించుకోకపోవడంతో బీజేపీలో చేరారు. తాజాగా బాబుమోహన్‌కు బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతో ఆ పార్టీని వీడి కేఏ.పాల్ ప్రజాశాంతి పార్టీలో చేరిన విషయం విధితమే. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరుగుతున్న తాజా పరిణామాలతో బీఆర్ఎస్‌కు వరంగల్ పార్లమెంటుకు అభ్యర్థి కరువయ్యారనే ప్రచారం నేపథ్యంలో వెంటనే అభ్యర్థిని ప్రకటించడానికి మాజీ సీఎం కేసీఆర్ తీవ్రంగా అన్వేషిస్తున్నారు. ఈ రాత్రికే అభ్యర్థిని ప్రకటించే అవకాశమూ లేకపోలేదు.

కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య..?

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును ఖరారు చేసే అవకాశమున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్రపోటీ నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి పక్కా స్కెచ్‌తోనే 'కడియం'ను రంగంలోకి దింపడానికి పావులు కదిపారు. ఈ క్రమంలో ఉద్దేశపూర్వకంగానే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికను పెండింగ్‌లో పెట్టారు. గురువారం రాత్రి జరిగిన నాటకీయ పరిణామాలతో బీఆర్ఎస్ నేతలు ఖంగుతిన్నారు. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కేవలం ఒకే ఒక్క నియోజకవర్గం స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రమే విజయం సాధించింది. ఇప్పుడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరితే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 7 నియోజకవర్గాల్లో ఒక్క నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు లేని పరిస్థితి ఏర్పడుతుంది.

మాస్కోపై జరిగిన తీవ్రవాద దాడి వెనుక

ఒక దేశం ఉందనేది 'సుస్పష్టం'

- ఎర్డోగాన్ అధికార ప్రతినిధి

అంకారా : క్రోకస్ సిటీ హాల్ మారణకాండ వంటి తీవ్రవాద చర్యలకు దేశాలు స్పాన్సర్‌లుగా ఉంటాయని టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్ జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (ఏకెపి) ప్రతినిధి ఒమర్ సెలిక్ గురువారం తెలిపారు. మాస్కో కచేరీ వేదికపై గత శుక్రవారం టెర్రరిస్టుల బృందం దాడి చేసి నిప్పంటించింది. ఆ దాడిలో 143 మందిని చనిపోయారు. 300 మందికి పైగా గాయపడ్డారు. ఆ మారణకాండలో పాల్గొన్న నలుగురు టెర్రరిస్టులతో సహా పదకొండు మంది నిందితులు రష్యన్ భద్రతా దళాలకు పట్టుబడ్డారు.

"ఒక దేశం ఇంటెలిజెన్స్ మద్దతు లేకుండా అటువంటి టెర్రరిస్టు చర్యను నిర్వహించడం అసాధ్యం" అని ఏకెపి డిప్యూటీ చైర్మన్ కూడా అయిన సెలిక్ టర్కిష్ టివి స్టేషన్ ఎన్‌టివికి చెప్పాడు. "ఇటువంటి సంఘటనలకు ఎల్లప్పుడూ స్పాన్సర్లు ఉంటారు" అంటూ అతను ఉక్రెయిన్ సంఘర్షణకు సంబంధించి "యుద్ధం కొనసాగించాలని కోరుకునే లాబీలను" సూచించాడు. టర్కీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు తీవ్రవాదంతో పోరాడడంలో రష్యాకు సహాయం చేస్తున్నాయని, క్రోకస్ సిటీ హాల్ వద్ద జరిగిన విషాదంపై టర్కీ రష్యాకు "నిజాయితీగల సంతాపాన్ని" పంపిందని సెలిక్ చెప్పాడు.

శుక్రవారం నాటి మారణకాండకు తామే బాధ్యులమని ఉగ్రవాద సంస్థ "ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్" (ఐఎస్ఐఎస్-కె) ప్రకటించింది. ఇందులో తమకు ఎలాంటి పాత్ర లేదని ఉక్రెయిన్ ఖండించింది.



రష్యా నిర్బంధంలో ఉన్న అనుమానితులందరూ తాజిక్ జాతీయులు. వీరిని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ "రాడికల్ ఇస్లామిస్టులు"గా అభివర్ణించాడు. సరిహద్దు దాటి ఉక్రెయిన్‌లోకి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో టెర్రరిస్టులు పట్టుబడ్డారు.

ఈ దాడితో ఉక్రెయిన్‌కు ఎటువంటి సంబంధం లేదని అమెరికా, యూరోపియన్ యూనియన్ నొక్కిచెప్పాయి. అయితే ఐసిస్-కె మాత్రమే దోషి అని వారు చేస్తున్న వాదనకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. మారణకాండలో పాల్గొన్న టెర్రరిస్టులు ఉక్రెయిన్ నుండి గణనీయమైన మొత్తంలో క్రిప్టోకరెన్సీని అందుకున్నారని నిర్ధారించే ఆధారాలను రష్యా ఇంటెలిజెన్స్ అధికారులు కనుగొన్నారు. ఆ దాడికి ఆర్థిక సహాయం చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే దర్యాప్తు కమిటీ అతని లేదా ఆమె గుర్తింపును ఇంకా బహిరంగపరచలేదు.

గాజాలో 'శాంతి పరిరక్షక దళం' ఏర్పాటుకు నిధులు

- సమకూర్చటానికి సిద్ధం అంటున్న అమెరికా - పొలిటికో

జెరూసలెం : ఇజ్రాయెల్‌తో ఘర్షణ ముగిసిన తర్వాత గాజాలో శాంతి భద్రతలను కాపాడేందుకోసం ఒక శాంతి పరిరక్షక దళాన్ని ఏర్పాటు చేయడానికి మధ్యప్రాచ్యంలోని తన భాగస్వాములకు నిధులు అందించేందుకు అమెరికా సిద్ధపడిందని పొలిటికో వార్తాసంస్థ గురువారం ప్రచురించింది. ఐదు నెలలపాటు ఇజ్రాయెల్ సైన్యం చేసిన కర్కశ బాంబు దాడులలో గాజా పూర్తిగా నాశనమై పోయింది. కనీస సహాయం అందక లక్షలాది పాలస్తీనా వాసులు ఆకలికి అలమటిస్తున్నారు. పాలస్తీనా సాయుధ సంస్థ హమాస్‌ను నిర్మూలించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది. పాలస్తీనా ఆరోగ్య అధికారుల అంచనా ప్రకారం ఇప్పటివరకు గాజాలో 32,600 మందికి పైగా మరణించారు.

గాజాలో పోరాటం ఎప్పుడు ముగుస్తుందనేది అస్పష్టంగానే ఉన్నప్పటికీ, యుద్ధం జరిగిన "మరుసటి రోజు" పరిస్థితి ఎలా ఉంటుందనే విషయం గురించి అమెరికా తన ప్రాంతీయ భాగస్వాములతో చర్చిస్తోంది. అమెరికా తన సైనికులతో కాకుండా పాలస్తీనియన్ల నాయకత్వంలోనే ఒక "శాంతి పరిరక్షక దళం" ను ఏర్పాటు చేయాలని, అందుకోసం అయ్యే వ్యయాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉందని పెంటగాన్ నుండి ఇద్దరితో సహా నలుగురు అధికారులు పొలిటికోకు తెలిపారు. తీర్మానంలో పాలస్తీనా రాజ్యం ఏర్పాటు గురించి స్పష్టంగా పేర్కొనాలని అరబ్ దేశాలు కోరుకుంటున్నాయని పొలిటికో పేర్కొంది. ఇజ్రాయెల్ హమాస్‌ను ఓడించే వరకు "ఈ చర్చ జరగటానికి ఇష్టపడదు" అని, అప్పటిదాకా పాలస్తీనా రాజ్య ఏర్పాటును అనుమతించబోమని



ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రతిజ్ఞ చేశాడని, అయితే ఈ లక్ష్యాన్ని సాధించటం ఇజ్రాయెల్‌కు సాధ్యపడదని కూడా పొలిటికో ప్రచురించింది.

అమెరికా, ఇజ్రాయిల్ మధ్య విభేదాలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ వారం ప్రారంభంలో, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో గాజాలో తక్షణం కాల్పుల విరమణ జరగాలని డిమాండ్ చేస్తూ ప్రతిపాదించబడిన ఒక తీర్మానాన్ని అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండి ఆమోదించబడేలా చేసింది. గతంలో అనేకసార్లు అటువంటి తీర్మానాలను ఆమోదించకుండా అమెరికా తన వీటో అధికారాన్ని వినియోగించింది. మార్చిలో అమెరికా సెనేట్ నాయకుడు చక్ షుమెర్ ఛాంబర్‌లో మాట్లాడుతూ, "నెతన్యాహు ఇజ్రాయెల్ ఉత్తమ ప్రయోజనాలకు కాకుండా తన రాజకీయ మనుగడకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా తన మార్గం కోల్పోయాడు" అని అన్నాడు. ఈ వ్యాఖ్యను ఇజ్రాయెల్, కాంగ్రెస్‌లోని రిపబ్లికన్ పార్టీ నాయకత్వం తప్పుబట్టినప్పటికీ అధ్యక్షుడు జో బైడెన్ తన మిత్రుడు "మంచి ప్రసంగం" చేసాడని చెప్పారు.

పంచాయతీ గుమాస్తా ప్రసాద్‌కు ప్రభుత్వమే వైద్యం అందించాలి

- కార్యదర్శిని సస్పెండ్ చేయాలి
- పెండింగ్ బకాయి వేతనాలను విడుదల చేయాలి
- నేడు అన్ని పంచాయతీల ఎదుట నిరసనలు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో పాటు అధికారుల వేధింపులతో ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామపంచాయతీ గుమాస్తా భూక్యాప్రసాద్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడనీ, చావుబతుకుల మధ్య కొట్లాడుతున్న ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ శనివారం నాడు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట సిబ్బంది నిరసనలు తెలపాలని పిలుపునిచ్చింది. శుక్రవారం ఈ మేరకు తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్(సీఐటీయూఅనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యారపాండు, చాగంటి వెంకటయ్య, గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, అంజనాపురం గ్రామ పంచాయతీలో భూక్య ప్రసాద్ అనే పంచాయతీ గుమస్తా 20 ఏండ్లుగా పనిచేస్తున్నాడు. అతనికి మూడు నెలలుగా వేతనం ఇవ్వడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. పెండింగ్ వేతనాలు పదే పదే అడుగుతున్నావని పంచాయతీ కార్యదర్శి అతన్ని పనుల్లోకి రావొద్దని ఆదేశించాడు. స్పెషల్ అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పనిచేసుకోవాలని ప్రసాద్‌కు సూచించారు. కార్యదర్శి మాత్రం ప్రసాద్‌ను పనిలోకి రావద్దనీ, వస్తే పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేసి కేసు పెడతామని బెదిరించి పనిలో నుంచి పంపేశాడు. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ప్రస్తుతం ఆయన ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషంగా ఉంది. ఈ ఘటనకు కారణమైన పంచాయతీ కార్యదర్శిపై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు ప్రధాన కారణమైన 6-7 నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. ప్రసాద్‌కు మెరుగైన వైద్యం అందించాలి' అని పేర్కొన్నారు.

సమోసా.. బిర్యానీ. .టీ

(మొదటిపేజీ తరువాయి)

కోసం రూ. 7.50 ఖర్చు చేయవచ్చు. 18వ లోక్‌సభకు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ ప్రక్రియలో భాగంగా జిల్లా పోల్ ప్యానెల్‌లు ఖర్చుల రేట్లను నిర్ణయిస్తున్నాయి. అభ్యర్థులు తమ ఖర్చులను నిర్ణీత పరిమితిలోపు నిర్వహించాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్‌తో సహా చాలా రాష్ట్రాల్లో లోక్‌సభ అభ్యర్థి ఖర్చు పరిమితిని రూ.95 లక్షలుగా నిర్ణయించారు. అయితే, అరుణాచల్ ప్రదేశ్, గోవా, సిక్కింలలో పరిమితి కాస్త తక్కువగా ఉన్నది. ఇక్కడ ఒక్కో అభ్యర్థికి రూ.75 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉన్నది. అదేవిధంగా, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీ) కు, ఒక్కో అభ్యర్థికి ఒక్కో ప్రాంతాన్ని బట్టి రూ.75 లక్షల నుంచి రూ.95 లక్షల వరకు ఖర్చు పరిమితి ఉంటుంది. జలంధర్‌లో చోలే భటూర్ రూ.40కి పరిమితం చేయగా, కిలో మటన్ రూ.500, చికెన్ రూ. 250గా ఉన్నాయి. గ్లాస్ లస్సీ రూ.20, గ్లాస్ షరబత్ రూ.15గా ఉన్నాయి. అలాగే, ధోధా కిలో రూ. 450), నెయ్యి పిన్ని కిలో రూ. 300గా నిర్ణయించబడ్డాయి.ఇక మధ్యప్రదేశ్‌లో ఈ రేట్లు చూస్తే.. రాష్ట్రంలోని బాలాఘాట్‌లో టీ ధర రూ. 5 మాత్రమే. అయితే, సమోసా ధర రూ. 10గా ఉన్నది. ఇడ్లీ, సాంబార్ వడ, పోహా-జలేబీ ధర రూ. 20 ఉన్నది. దోసె, ఉప్మా రూ.30గా నిర్ణయించారు.


మణిపూర్‌లోని తౌబాల్ జిల్లాలో టీ, సమోసా, కచోరీ, ఖర్జూర, గజా (డెజర్ట్) ఒక్కోటి ధర రూ.10గా ఉన్నది. ఈశాన్య రాష్ట్రంలోని తెంగ్నౌపాల్ జిల్లాలోని అభ్యర్థులు బ్లాక్ టీకి రూ.5, మిల్క్ టీకి రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. కిలో బాతు మాంసం రూ.300, పంది మాంసం రూ.400గా ఉన్నాయి. చికెన్ (బ్రాయిలర్), రోహు, మృగాల్, సారెంగ్ వంటి చేపలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.చెన్నైలో టీ రూ.10 నుంచి రూ.15కి, కాఫీ రూ.15 నుంచి రూ.20కి పెంచగా.. చికెన్ బిర్యానీ ప్యాకెట్ ధర 2019తో పోలిస్తే రూ.180 నుంచి రూ.150కి తగ్గించారు. గౌతమ్ బుద్ధ నగర్ (గ్రేటర్ నోయిడా)లో శాకాహారం థాలీ రూ. 100, సమోసా, కప్పు టీ ఒక్కోటి రూ. 10, కచోరీ రూ. 15, శాండ్‌విచ్ రూ. 25, కిలో జిలేబీ రూ. కిలో రూ.90గా ధరలను నిర్ణయించారు. నార్త్ గోవా అభ్యర్థులు రూ. 15తో మెనూలో బటాటా వడను కలిగి ఉన్నారు. టీ రూ. 15కు, కాఫీ ధర రూ. 20కి పరిమితం చేశారు. హర్యానాలోని జింద్‌కు సంబంధించి అభ్యర్థులు దాల్ మఖ్నీ, మిక్స్ వెజ్ వంటి రుచికరమైన వంటకాలను రూ. 130కు పొందాల్సి ఉంటుంది. మటర్ పనీర్ ధర రూ. 160గా ఉన్నది.

పార్టీలు, అభ్యర్థులు తరచుగా కార్మికులు, ఓటర్లకు మద్యం అందిస్తున్నప్పటికీ.. రేట్ కార్డులలో ఏదీ మద్యం గురించి ప్రస్తావించకపోవటం గమనార్హం. హెలిప్యాడ్‌లు, లగ్జరీ వాహనాలు, ఫామ్‌హౌస్‌లు వంటి ఖరీదైన మౌలిక సదుపాయాల నుంచి పూలు, కూలర్, టవర్ ఏసీలు, సోఫా వంటి ఇతర వస్తువుల వరకు రేట్ కార్డ్‌లలో ప్రస్తావించబడి ఉన్నాయి. రేట్ కార్డ్‌లు టాటా సఫారీ, స్కార్పియో నుంచి హెూండా సిటీ, సియాజ్ వరకు, ప్రజలను సమావేశాలకు తీసుకెళ్లటానికి అద్దెకు తీసుకునే వాహనాలకు కూడా రేట్ల పరిమితిని ఎన్నికల అధికారులు నిర్దేశించారు. కొన్ని పోల్ ప్యానెల్‌లు గులాబీ దండలు, బంతి పువ్వుల దండలు, పుష్పగుచ్చాలకూ రేట్లు నిర్ణయించాయి. మరికొన్ని పార్టీలకు సంబంధించిన టోపీలు, జెండాలు వంటి వాటికి సైతం రేట్ కార్డులలో చేర్చాయి.

ప్రస్తుతం, ఎన్నికల పోరులో వ్యక్తిగత అభ్యర్థులకు ప్రచార నిధులపై పరిమితి ఉన్నది. అయితే రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేసే డబ్బుపై పరిమితి లేదు. ఈసీఐ జారీ చేసిన సవరించిన మార్గదర్శకాల ప్రకారం.. లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారం కోసం గరిష్టంగా అనుమతించదగిన వ్యయం వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో మారుతూ ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 77 (1) ప్రకారం అభ్యర్థులు "అతను నామినేట్ చేయబడిన తేదీ" నుంచి "ఫలితాన్ని ప్రకటించే తేదీ" వరకు ఎన్నికలలో చేసిన ఖర్చుల ఖాతాను ఉంచాలి. భారత్‌లో మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19న మొదటి దశలో 102తో ప్రారంభమయ్యే పోలింగ్ ఏడు దశల్లో జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్నది. కాగా, ఈ ఎన్నికల్లో విజయం కోసం పార్టీలు అనేక వ్యూహాలను పన్నుతున్నాయి. ప్రచారాల్లో లోతుగా నిమగ్నమవుతున్నాయి.

నిరుద్యోగాన్ని ప్రభుత్వం పరిష్కరించలేదు

- చేతులెత్తేసిన ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్



న్యూఢిల్లీ : నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం పరిష్కరించలేదని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ చెప్పారు. నిరుద్యోగం సహా సామాజిక, ఆర్థిక సమస్యలన్నింటినీ ప్రభుత్వమే పరిష్కరిస్తుందని అనుకోవడం సరికాదని ఆయన అన్నారు. భారతీయ ఉద్యోగ నివేదిక విడుదల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరన్ ప్రసంగిస్తూ ప్రపంచంలో ఉద్యోగ నియామకాలు చేయాల్సింది వాణిజ్య రంగమేనని అన్నారు. అలాంటప్పుడు ప్రభుత్వం ఏం చేయగలదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా స్కిల్ ఇండియా మిషన్ వంటి కార్యక్రమాలు చేపడుతోందని చెప్పుకొచ్చారు.'నిరుద్యోగ సమస్యను నిర్మూలించాల్సిన అవసరం ఉన్నదని ప్రతి వేదిక వద్ద చెబుతుంటాము. అంతకుమించి నేను చేసేదేమీ లేదు. ఎందుకంటే అది నేను పరిష్కరించే సమస్య కాదు' అని నాగేశ్వరన్ అన్నారు. కాగా దేశంలో వేతనాలు స్థిరంగా ఉండడమో లేదా తగ్గిపోవడమో జరుగుతోందని నాగేశ్వరన్ విడుదల చేసిన నివేదిక తెలిపింది. ఉద్యోగాల కల్పన విషయంలో చేతులెత్తేసిన నాగేశ్వరన్ ఓ విషయాన్ని మరిచిపోయినట్లు కన్పిస్తోంది. ఉద్యోగాలు లభించకపోవడంపై ప్రధాని మోడీని యువత నిలదీయడానికి ఓ కారణం ఉంది. 2014లో కేంద్రంలో అధికారంలోకి రావడానికి ముందు బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోడీ ఓ హామీ ఇచ్చారు. అధికారంలోకి వస్తే కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన పదేపదే చెప్పుకొచ్చారు. దానినే ఇప్పుడు యువత గుర్తు చేస్తూ ప్రధానిని నిలదీస్తోంది.

డీఎంహెచ్‌వో తీరుతోనే 'దగా'ఖానాలు..!

- కాసుల కక్కుర్తితో ప్రయివేటు ఆస్పత్రులపై పర్యవేక్షణా లోపం
- అమలుకాని క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010
- అవుట్‌వార్డుతో సంబంధం లేకుండానే అనుమతులు
- నాలుగైదేండ్లుగా పెండింగ్‌లో లేకుండా హాస్పిటల్స్‌కు పర్మిషన్
- సౌకర్యాలు చూడకుండానే క్రమబద్ధీకరణ, రెన్యూవల్
- ఇతర శాఖలకు ఫిర్యాదులందేి.. స్పందిస్తేనే డీఎంహెచ్‌వో తనిఖీలు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం

ఖమ్మం జిల్లాలో ప్రయివేటు ఆస్పత్రుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. ముఖ్యంగా జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) ఏకపక్షంగా వ్యవహరిస్తుండటంతో శాఖలోని ఏ ఒక్క అధికారి ఆమెకు ఎదురు చెప్పే పరిస్థితి లేదు. ది క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010 నియమ నిబంధనలకు అనుగుణంగా ప్రయివేటు ఆస్పత్రులకు అనుమతులివ్వాల్సి ఉండగా.. కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా జిల్లాలో ఆస్పత్రులకు అనుమతులిస్తుండటంతోనే ప్రయివేటు వైద్యం గాడితప్పుతోందనే ఆరోపణలు ఉన్నాయి. డాక్టర్లు కూడా లేకుండా నడిచే ఆస్పత్రులు బయటపడుతున్నాయి. పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడో.. లేక ఇతరశాఖల అధికారులకు ఫిర్యాదులు అందినప్పుడో డీఎంహెచ్‌వో స్పందిస్తున్నారు తప్ప రెగ్యులర్ తనిఖీలు ఉండటం లేదు. ఒకవేళ రైడింగ్ చేసినా కుమ్మక్కైన కొన్ని ఆస్పత్రుల జోలికి వెళ్లట్లేదు.

అడ్డగోలు అనుమతులు..

తాజాగా గురువారం రాత్రి రైడింగ్ చేసి సీజ్ చేసిన సుగుణ హాస్పిటల్ అనుమతుల విషయంలోనూ డీఎంహెచ్‌వో మాలతి చేతివాటం చూపారనే ఆరోపణలున్నాయి. అందుకే ఆమె ఇంటికి వెళ్లే దారిలోనే ఉన్నా ఈ హాస్పిటల్ వైపు ఏనాడూ కన్నెత్తి చూడలేదని అంటున్నారు. గురువారం రాత్రి హాస్పిటల్‌లో 18 వారాలు,



రెండు వారాలు నిండిన ఇద్దరు గర్భిణులకు అబార్షన్ చేసేందుకు సిద్ధమవుతుండగా పక్కా సమాచారంతో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ మౌనికతో కలిసి అనివార్యంగా డీఎంహెచ్‌వో రైడ్ చేశారు. రెడ్‌హ్యాండెడ్‌గా హాస్పిటల్ నిర్వాహకులను పట్టుకున్నారు. హాస్పిటల్ నిర్వాహకుల వద్ద నెలలు నిండని 50 మంది మహిళల కేసు షీట్లు లభించటం వైద్యారోగ్యశాఖ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. అబార్షన్ చేయించుకునే మహిళల వివరాలు ఐపీ, ఓపీలో నమోదు చేయలేదు. ప్రతి కేస్ షీట్‌కు కోడ్‌లు వేసి ఉన్నాయి. కోదాడ, హైదరాబాద్, కరీంనగర్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి మహిళలు వచ్చి ఖమ్మంలో అబార్షన్ చేయించుకుంటున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

పత్రికల్లో వార్తలో.. ఫిర్యాదులు వస్తేనో..

ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాలతి గత నాలుగేండ్లుగా పాల్పడుతున్న అవినీతి వ్యవహారాలపై పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ టీఎస్ (పీహెచ్ఎంఈయూ) ఖమ్మం జిల్లా కమిటీ అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేసింది. 'నవతెలంగాణ' దినపత్రికలో వైద్యారోగ్యశాఖలో చోటుచేసుకుంటున్న అవకతవకలపై కొన్ని రోజులుగా కథనాలు వస్తున్నాయి. డీఎంహెచ్‌వో మాలతి సెలవుల నుంచి వచ్చిన రెండో రోజు ఈనెల 20వ తేదీన ప్రయివేటు హాస్పిటల్ అనుమతులు (ఇన్‌వార్డు- అవుట్‌వార్డు) వివరాలు ఇవ్వాల్సిందిగా 'నవతెలంగాణ' దరఖాస్తు చేసింది. ఆ తర్వాత కూడా డీఎంహెచ్‌వో తీరుపై వరుస కథనాలు వస్తుండటంతో సమాచారానికి ముందు కొంత హడావుడి మొదలు పెట్టారు. ఇతర ప్రభుత్వశాఖల అధికారులకు నేరుగా ఫిర్యాదులందడంతో వారు స్పందించడంతో అనివార్యంగా వైద్యఆరోగ్యశాఖ అధికారి కదలాల్సి వచ్చింది. రెండు రోజులు రైడ్ చేసి నాలుగు హాస్పిటల్స్‌ను సీజ్ చేశారు. శుభ్రత లేదు, సరిపడా సిబ్బంది లేరనే కారణంతో తులసి డెంటల్ హాస్పిటల్‌ను సీజ్ చేశారు. అనమతి లేకుండా అనేక ఏండ్లుగా నిర్వహిస్తున్న పాజిటివ్ హెూమియోపతిని మూసివేశారు. గడువు తీరిన మెడిసిన్స్, హెవీ డ్రగ్స్ వినియోగిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఆదర్శ హాస్పిటల్‌ను సీజ్ చేశారు. అబార్షన్స్ విషయంలో సుగుణ హాస్పిటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. ఇలా ఫిర్యాదులు వస్తేనో.. పత్రికల్లో కథనాలు వస్తే తప్ప వైద్యారోగ్యశాఖ అధికారి స్పందించే పరిస్థితి లేకపోవడం గమనార్హం.

డీఎంహెచ్‌వో ఏకపక్ష తీరు..!

జిల్లా వైద్యారోగ్యశాఖ గాడి తప్పడానికి డీఎంహెచ్‌వో ఏకపక్ష తీరే కారణమనే విమర్శలున్నాయి. తన శాఖలోని వివిధ విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాల్సిన ఆమె శాఖ ఉద్యోగులు కొందర్ని ఏజెంట్లుగా నియమించుకొని ప్రయివేటు హాస్పిటల్స్, ఇతర వ్యవహారాలకు సంబంధించి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2019 డిసెంబర్‌లో మాలతి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు తీసుకున్నారు. నాటి నుంచి వందల ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చారు. ఆమె బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇన్‌వార్డు, ఔట్‌వార్డు రిజిస్టర్ నిర్వహణ సైతం అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఐదేండ్లకోసారి ప్రయివేటు హాస్పిటల్స్‌కు అనుమతులను పునరుద్ధరించాల్సి ఉంటుంది. హాస్పిటల్ పర్యవేక్షణ చేశాకే రెన్యువల్ చేయాలి. కానీ ఇక్కడ అలాంటివేవీ పాటించట్లేదనే ప్రచారం ఉంది. ఖమ్మం జిల్లాలో 85 డయాగ్నస్టిక్ సెంటర్స్, 300 హాస్పిటల్స్, వీటిలో 60 గైనిక్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో అనేక సమస్యలున్నా.. సౌకర్యాల లేమి వెంటాడుతున్నా ఏ ఒక్క హాస్పిటల్ అనుమతిని పెండింగ్‌లో పెట్టకుండా రూ.2 లక్షలు ముడుపులు తీసుకుని ఇస్తుంటారనే ప్రచారం డీఎంహెచ్‌వోపై ఉంది. వసూళ్లకు ఒప్పుకోని అధికారుల స్థాయిని విస్మరించి బదిలీ చేసిన ఉదంతాలు సైతం ఉన్నాయి. ఇంత జరుగుతున్నా.. ఇన్ని ఆరోపణలున్నా మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టరేట్ నుంచి ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సీఎంవోకు సైతం ఫిర్యాదు వెళ్లినట్టు సమాచారం.



గుడిసె వాసులకు పట్టాలివ్వండి


- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలివ్వాలి : మంత్రి ఉత్తమ్‌కు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వినతి

నవతెలంగాణ-నేరేడుచర్ల

హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల పట్టణంలో పేదలు వేసుకున్న గుడిసెలకు శాశ్వత పట్టాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలివ్వాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. శుక్రవారం సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు గోకినపెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఏడేండ్ల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 243, 244లో 250మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు పట్టాలివ్వాలని అనేకమార్లు కలెక్టర్‌కి, సంబంధిత అధికారులకు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. అయినా గుడిసెలను తొలగించి పేదలపైనా, నాయకులపైనా అక్రమకేసులు బనాయించి జైలులో పెట్టించి, అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ హుజూర్‌నగర్ డివిజన్ కన్వీనర్ వాస పళ్ళయ్య, ఎస్‌డీ.హుస్సేన్, వాస కర్ణాకర్ తదితరులు ఉన్నారు.

గ్రేటర్‌లో భానుడి భగభగ

- మే నెల డిమాండ్ మార్చిలోనే...



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సూర్యప్రతాపం పెరిగింది. దీనితో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది. ఇండ్లలో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం తప్పనిసరి అయ్యింది. ఈనెల 28న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 79.48 మిలియన్ యూనిట్ల రికార్డు స్థాయి విద్యుత్ వినియోగం నమోదైంది. సహజంగా ఇంత డిమాండ్ మే నెలలో ఉంటుంది. మార్చి నెలలోనే రికార్డుస్థాయి వినియోగం నమోదవడంతో దక్షిణ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) అవసరమైన ఏర్పాట్లు చేపట్టింది. గత ఏడాది (2023) మే 19వ తేదీ గ్రేటర్ పరిధిలో 79.33 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. గత ఏడాది మార్చి నెలలో గ్రేటర్ పరిధిలో అత్యధిక విద్యుత్ వినియోగం 67.97 మిలియన్ యూనిట్లు మాత్రమే. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 22.7 శాతం పెరుగుదల నమోదైంది.

90 మి.యూ., చేరొచ్చు
టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ



ప్రస్తుత వేసవిలో గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం 90 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేశాం. పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా అదనపు లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నాం. డిస్కం పరిధిలో ఎక్కడా కరెంటు కోతలు లేవు. రాష్ట్రంలో గత ఏడాది గత ఏడాది మార్చి 14 న రాష్ట్రంలో 297.89 మి.యూ., అత్యధిక విద్యుత్ వినియోగం నమోదు కాగా, ఈ ఏడాది మార్చి 14వ తేదీ 308.54 మి.యూ., నమోదైంది. విద్యుత్ సరఫరాపై 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది. రోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, అక్కడికక్కడే తగిన ఆదేశాలు ఇస్తున్నాం. అధికారులు ఆఫీసుల్లో కూర్చోవడం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని కోరాం. దీనివల్ల విద్యుత్ సరఫరాలో మరింత మెరుగుదల సాధ్యమౌతుంది.

యువతి దారుణ హత్య

నవతెలంగాణ-రాజేంద్రనగర్



యువతి తలపై బండరాయితో మోది దారుణంగా హత్య చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పక్కన ఓ యువతి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యువతిని బండరాయితో మోదీ హత్య చేసినట్టు గుర్తించారు. వెంటనే క్లోస్ టీం, డాగ్స్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి కీలక ఆధారాలు సేకరించారు. అయితే ఆ యువతి వద్ద లభించిన ఆధారాలతో హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన సమీరాఖాన్‌గా (21) గుర్తించారు. వెంటనే ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అదే ప్రాంతానికి చెందిన మోహిన్ హైమద్‌తో సమీరాఖాన్‌కు ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ యువతిపై అతడు లైంగికదాడి చేసి.. అనంతరం హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ మధు పరిశీలించారు.

శంషాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

- కేబీఎస్ స్క్రాప్ షాపులో చెలరేగిన మంటలు
- దట్టమైన పొగలు మంటలతో ఉక్కిరిబిక్కిరి
- పక్కనే ఉన్న ప్రియాంక గ్యాస్ ఏజెన్సీలో కాలిన ఫైళ్లు, పత్రాలు
- ట్యాంకర్లు, ఫైర్ ఇంజన్లతో మంటల ఆర్పివేత
- బాయ్స్ హాస్టల్‌కు అంటుకున్న మంటలు

నవతెలంగాణ-శంషాబాద్

రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశంలో శుక్రవారం పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం జరిగింది. ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ పక్కనే ఈ అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బాధితులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ రాళ్లగూడ రోడ్డులో ఏబీఎస్ స్క్రాప్ షాప్‌ను సాదిక్ హుస్సేన్, గౌస్ అనే వ్యక్తులు నిర్వహిస్తున్నారు. ఈ స్క్రాప్ షాపులో ప్లాస్టిక్ రీ సైక్లింగ్ చేస్తున్నారు. వివిధ ప్రదేశాల నుంచి సేకరించిన ప్లాస్టిక్ వస్తువులను మిషన్‌లలో వేసి మిక్చర్ చేసి వాటిని మార్కెట్ చేయడం వీరి పని. కాగా, ఈ షాప్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు అకస్మాత్తుగా పెద్ద



ఎత్తున మంటలు చెలరేగాయి. ఆదర్శనగర్, ఆర్బీనగర్ హుడా కాలనీ వైపు పెద్ద ఎత్తున దట్టమైన పొగలు వ్యాపించాయి. మంటలు ఇంతకింతకీ అధికం కావడంతో షాప్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్లు వచ్చిన తర్వాత చాలా సేపటి వరకు ప్రయత్నం చేసి మంటలను ఆర్పేసారు. మూడు గంటలకు పైగా దట్టమైన పొగ మంటలు ఎగిసి పడ్డాయి. అంతకు ముందు స్థానిక ట్యాంకర్లను తీసుకువచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నాలు జరిగాయి. దాదాపు వందశాతం షాపు దగ్ధమైంది. ఈ షాపు చుట్టుపక్కనే ఉన్న బాయ్స్ హాస్టల్‌కు మంటలు వ్యాపించి ముందు భాగం తగలబడింది. అక్కడి నుంచి హాస్టల్లో ఉన్న అందరిని బయటకు తరలించారు. ఈ ప్రదేశంలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు, జన నివాసాలు, షాపులు అధికంగా ఉన్నాయి. ప్రజలు ఎగబడి మొబైల్ ఫోన్లలో చిత్రీకరిస్తుంటే పోలీసులు వాళ్ళని చెదరగొట్టారు. వాహనాలను దారి మళ్ళించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి : షాపు యజమాని సాదిక్

ఇక్కడ ప్లాస్టిక్ రీసైకిల్ చేసి మార్కెట్ చేయడం జరుగుతుంది. అయితే రంజాన్ మాసం కారణంగా రీసైకిల్ చేసిన మాల్ పెద్ద ఎత్తున మిగిలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరగలేదు. పక్కనే ఉన్న ప్రియాంక గ్యాస్ ఏజెన్సీలో వేస్ట్‌గా పడేసిన పేపర్లు, వైర్లు కాల్చి వేయడంతో ఆ మంటలు స్క్రాప్ దుకాణంలోకి వ్యాప్తి చెందాయని ఆరోపించారు. ఇలా రెండు మూడుసార్లు పాత వస్తువులు కాలుస్తుంటే వద్దని వారించామని చెప్పారు. సుమారు రూ.9 నుంచి రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ షెడ్‌లోకీ మంటలు

ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ షెడ్ కింద నిల్వ ఉంచిన ఫైల్స్, పేపర్లు, పుస్తకాలకు మంటలు అంటు కొని దగ్ధమయ్యాయి. ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ విజయకుమార్ మాట్లాడుతూ.. ఆ మంటలకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. స్క్రాప్ షాపులో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు అంటుకొని ఉండొచ్చని అన్నారు. అక్కడి మంటల వలనే తమ ఏజెన్సీలో పేపర్లు కాలి పోయాయని అన్నారు అధికారులు ఈ విషయంపై నిజనిర్ధారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

కరీంనగర్ గెలుపు కోసం 'హస్తం' ఆపరేషన్ ఆకర్ష్..

- విపక్ష కీలక నేతలతో హైకమాండ్ మంతనాలు
- ఏ క్షణాన్నైనా గోడదూకే చాన్స్!
- బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ ఉద్దండులే.!
- ఆ ఇద్దరినీ ఢీకొట్టేందుకు మాస్టర్‌ప్లాన్ : వలసొచ్చే వారి కోసం కదుపుతున్న పావులు
- మానకొండూర్‌లో ఫస్ట్ వికెట్
- 'కమలం' పార్టీకి గుడ్‌బై చెప్పి 'హస్తం' గూటికి మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచేందుకు 'హస్తం' పార్టీ పక్కా వ్యూహంతో వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా విపక్ష పార్టీల నుంచి వలసలకు గేట్లు తెరిచిన కాంగ్రెస్ హైకమాండ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కీలక నేతలను కలుపుకునేందుకు ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టింది. బరిలో నిలిచిన విపక్ష పార్టీల అభ్యర్థులిద్దరూ ఉద్దండులే కావడంతో వారిని ఢీకొట్టే మాస్టర్ ప్లాన్‌లో భాగంగానే కరీంనగర్ గులాబీ కీలక నేతలతో మంతనాలు మొదలయ్యాయనే టాక్ పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. రెన్నెళ్లుగా పార్టీ నేతల అరెస్టులు, వారిపై పెరుగుతున్న కేసుల నడుమ అధికార పార్టీలో చేరితే తప్ప మనుగడ ప్రశ్నార్థకంగా ఉంటుందనే ఒత్తిళ్లు బీఆర్ఎస్ కీలక నేతలపై పెరిగినట్టు వినిపిస్తోంది. ఈ క్రమంలోనే మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కమలం పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు.రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. కరీంనగర్ సీటు మాత్రం పెండింగ్‌లో పెట్టింది. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా పని చేసి, తరువాత ఎన్నికల్లో పోటీ చేసిన సీనియర్ నాయకుడు పొన్నం ప్రభాకర్ ప్రస్తుతం హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేస్తున్నారు. ఆ స్థానాన్ని భర్తీ చేయగల పొన్నం స్థాయి నాయకుడు కరువయ్యాడు. పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల్దిరూ ఉద్దండులే కావడంతో వారిని ఢీకొట్టేందుకు సరితూగే అభ్యర్థితోపాటు పార్టీ బలాన్ని పెంచే పనిలో కాంగ్రెస్ హైకమాండ్ పడింది. అందులో భాగంగానే కరీంనగర్ పార్లమెంట్‌పై దృష్టిసారించినట్టు కనిపిస్తోంది.

విపక్ష నేతలతో మంతనాలు..

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రస్తుతం మానకొండూర్, చొప్పదండి, వేములవాడ, హుస్నాబాద్ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా.. సిరిసిల్ల, కరీంనగర్, హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ శాసనసభ్యులు ఉన్నారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మినహా మిగిలిన ఇద్దరినీ కాంగ్రెస్‌లో చేర్చుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ నేతపైనే ఫోకస్ పెట్టిన 'హస్తం' హైకమాండ్ రహస్యంగానే మంతనాలు జరుపుతూ ఆయన్ను అష్టదిగ్బంధనం చేస్తోందనే టాక్ పొలిటికల్ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. భూకబ్జా కేసుల్లో రిమాండ్ అవుతున్న స్థానిక సంస్థల నేతల్లో ఆయన అనుచరులూ ఉండటంతో అధికార పార్టీలో చేరాలనే ఒత్తిళ్లు ఎమ్మెల్యేపై ఉన్నట్టుగా కనిపిస్తోంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ కీలక నేతలుగా పేరుగాంచిన వారే కాంగ్రెస్‌లో చేరుతుండగా.. కరీంనగర్ ఎమ్మెల్యే పార్టీ మారడం పెద్ద విషయం కాదనే చర్చ కూడా సాగుతోంది. అయితే ప్రస్తుతం హుస్నాబాద్ నుంచి గెలిచి మంత్రిగా ఉన్న పొన్నం కరీంనగర్‌లో తిరిగి తన పట్టు నిలుపుకునే పనిలో పడ్డారు. తనకు పోటీగా గంగుల కమలాకర్ రాకను ఆయన తిరస్కరించే అవకాశాలూ లేకపోలేదు. మరోవైపు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బంధువైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పార్టీ మారే వ్యక్తుల్లో ముందువరుసలో ఉంటారనే చర్చ మొదట్లోనే వచ్చింది. అయితే తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, ప్రాణం ఉన్నంత వరకూ కేసీఆర్ వెంటే ఉంటానని కౌశిక్‌రెడ్డి ప్రకటించారు. అయినప్పటికీ మారుతున్న పరిస్థితుల్లో పార్టీ మారే అవకాశాలు లేకపోలేదనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వీరిరువురే గాకుండా బీఆర్ఎస్‌లోని స్థానిక సంస్థల కీలక నేతలపైనా కాంగ్రెస్ దృష్టిసారించింది.

విపక్షసభ్యులిద్దరూ ఉద్దండులే!

కరీంనగర్ లోక్‌సభ పోరులో బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపి బండి సంజయ్ ఇద్దరూ ఉద్దండులేనని చెప్పొచ్చు. సుదీర్ఘ రాజకీయానుభవం, ఈ స్థానం నుంచే ఎంపీగా పని చేసిన అనుభవం సహా తమతమ పార్టీల్లో కీలక నేతలుగా ఎదిగారనే చెప్పొచ్చు. ప్రస్తుతం బరిలో ఫైనల్ అయిన వారిద్దరినీ ఢీకొట్టేందుకు కాంగ్రెస్ ఆచితూచి అడుగులు వేస్తోంది.

అందుకు బలమైన రాజకీయపునాదులున్న అభ్యర్థి కరువడంతో విపక్ష పార్టీలను బలహీనపరిచే పనిలో కాంగ్రెస్ పడింది. బీఆర్ఎస్, బీజేపీ కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకునే పనిని వేగిరం చేసింది. ఇప్పటికే ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని స్థానిక సంస్థల నేతల్లో పదుల సంఖ్యలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మానకొండూర్ బీజేపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే ఆ పార్టీకి శుక్రవారం రాజీనామా చేసి.. తిరిగి తన మాతృపార్టీ కాంగ్రెస్‌లో చేరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com



చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేరా బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్ తదితరులు.

నవతెలంగాణ - చైతన్యపురి

సికిందర్ డీఎల్ఎక్స్ డీఐ-60 టార్క్ ప్లస్ మల్టీ స్పీడ్ విడుదల

నవతెలంగాణ - సిటీబ్యూరో

సోనాలికా ట్రాక్టర్స్ తన లేటెస్ట్ సికిందర్ డీఎల్ఎక్స్ డీఐ-60 టార్క్ ప్లస్ మల్టీ-స్పీడ్‌ను ప్రవేశపెట్టింది. కంపెనీ ప్రత్యేక ధర రూ.8,49,999గా డిజైన్ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ మేనేజింగ్ జాయింట్ డైరెక్టర్ రామన్ మిట్టల్ మాట్లాడుతూ 'మారుతున్న పరిశ్రమ 1వ ఆవిష్కరణ - సోనాలికా సికిందర్ డీఎల్ఎక్స్ డీఐ 60 టార్క్ ప్లస్ మల్టీ-స్పీడ్ - ఇది రైతులు ఎంచుకునే సౌలభ్యం, చురుకుదనాన్ని అందిస్తుంది ఇది భారతీయ ట్రాక్టర్ పరిశ్రమలో పనితీరు ప్రమాణాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుంది' అని తెలిపారు.

రూ.80,03,590 నగదు సీజ్

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



నవతెలంగాణ - సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు హైదరాబాద్ జిల్లాలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 11 కేసులలో 11మంది వ్యక్తుల నుంచి రూ.80,03,590 నగదు సీజ్ చేయగా... అందులో ఇప్పటివరకు జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సరియైన ఆధారాలు సమర్పించిన 9 మందికి 20,74,590 రూపాయల నగదు విడుదల చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. సీజ్ చేసిన నగదులో 10లక్షలు మించి పట్టుబడిన రెండు కేసులను ఆదాయ పన్ను శాఖకు రెఫెర్ చేసినట్టు చెప్పారు.

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 10 కేసులలో రూ.77,03,590 సీజ్ చేయగా, 8 కేసులకు సంబంధించి రూ.17,74,590 నగదు రిలీజ్ చేశామని, రూ.59,29,000 నగదుకు సంబంధించి రెండు కేసులను ఆదాయ పన్ను శాఖ వారికి పంపినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఒక కేసులో రూ.3లక్షలు సీజ్ చేయగా, సరైన ఆధారాలు సమర్పించడంతో విడుదల చేశామని తెలిపారు. అత్యవసరమైన కేసులకు (పర్యాటకులు) సంబంధించి వెంటనే పరిశీలించి నగదును విడుదల చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మెన్ 9618888110, కమిటీ కన్వీనర్ మొబైల్ నంబర్ 9177872240ను సంప్రదించవచ్చు అని అన్నారు.

వాకర్స్‌తో బీఆర్ఎస్ మల్కాజిగిరి అభ్యర్థి సమావేశం



నవతెలంగాణ - హయత్‌నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హరిణ వనస్థలి నందు పలువురు వాకర్స్ సభ్యులతో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మా మద్దతు ఉంటుందని, భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న యోగా షెడ్‌ను వెడల్పు చేయాలని, ఓపెన్ జిమ్స్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అదనపు షెడ్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ఓపెన్ జిమ్స్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మన నియోజకవర్గ పరిధిలోని ఉన్న పార్కులు ఎక్కడా లేవని అన్నారు. దాదాపు అన్ని పార్కుల్లో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. ఇంకా కొన్ని సమస్యలు ఉన్నాయని వాటిని కూడా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని కొన్ని చెరువులను పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్.టీ.పీ.ప్లాంట్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అది చివరి దశకు చేరుకుందన్నారు. అలాగే ఆనంద్ నగర్ చౌరస్తా వద్ద ఒక నూతన ఫ్లై ఓవర్‌ను నిర్మిస్తే ట్రాఫిక్ నుంచి పూర్తి స్థాయిలో విముక్తి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు మెట్రో నిర్మాణం పూర్తి చేసేవిధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి చేస్తామన్నారు. తనను ఆశీర్వదించినట్టే మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కూడా మరోసారి ఆశీర్వదించి..భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి గద్దె ఎక్కి ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, తనను గెలిపించి అభివృద్ధికి మీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ ఇంద్రప్రస్తా కాలనీ నందు మాతృభూమి ఉత్సవ సమితి, సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో దాదాపు 23 కాలనీ వాసులకు సంబంధించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

పలువురు పలు సమస్యలను సుధీర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఆనంద్ నగర్ నుంచి పతుళ్ళగూడ వైపు వెళ్లే దారి చిన్నగా ఉండడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. రోడ్డు వెడల్పు, అలాగే స్ట్రీట్ లైట్స్, నూతన తాగునీటి పైప్ లైన్స్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, ప్రస్తుతం ఉన్న డ్రైన్స్ స్థానంలో నూతన డ్రైన్స్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన వారు మాట్లాడుతూ త్వరలోనే సమస్యలపై చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, చిరంజీవి, మహిళా అధ్యక్షురాలు ప్రమీల, మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, సతీశ్ యాదవ్, భాస్కర్ యాదవ్, జగదీష్ వాకర్స్ సభ్యులు విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించండి.. క్షమించండి



డా.హిప్నో పద్మాకమలాకర్, జి.కృష్ణవేణి

నవతెలంగాణ - సిటీబ్యూరో

నవభారత్ లైన్స్ క్లబ్, డాక్టర్ హిప్నో కమలాకర్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని విద్యార్థినులకు పోషకాహారం, స్నాక్స్, గుడ్లు, పుస్తకాలు, పెన్నులు డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి, సైకాలజిస్ట్ జ్యోతి రాజా, అస్తిత్వం మంజుల, రాజా నరసింహలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్, డా.పద్మాకమలాకర్ మాట్లాడారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను పిల్లలకు వివరించారు. ఏసుక్రీస్తు మానవ రూపంలో జన్మించిన మహనీయుడు అన్నారు. ఆయన చూపిన ప్రేమ, దయా, క్షమాపణ గుణం అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, జ్యోతిరాజా, రాజా నరసింహ హాస్టల్ వార్డెన్ భానుప్రియా తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు మాని
పాలనపై దృష్టి సారించాలి

డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీరాములు



నవతెలంగాణ - చైతన్యపురి

బీఆర్ఎస్‌పై ఆరోపణలు మాని కాంగ్రెస్ పార్టీ పాలనపై దృష్టి సారించాలని ఆర్కేపురం డివిజన్ కార్మిక విభాగం అధ్యక్షుడు శ్రీరాములు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఫోన్ టాపింగ్ మీద మాట్లాడుతున్నారని, నిజంగానే చిత్తశుద్ధి ఉంటే విచారణ చేయించుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి నిజ నిజాలు ఏంటో ప్రజలకు తెలిపాలని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేసీఆర్ సమాధానం చెప్పాలని అంటున్నాడని, కేసీఆర్ ఇప్పుడు అధికారంలో లేడన్నారు. మీరు కేంద్రంలో అధికారంలో ఉన్నారు కాబట్టి మీకు దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ బయటపెట్టాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మైండ్‌ను డైవర్ట్ చేసేందుకే ఆ రెండు పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు.

వీఫిన్ సొల్యూషన్స్ లిమిటెడ్‌తో
ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భాగస్వామ్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రముఖ సప్లై చైన్ ఫైనాన్స్ సొల్యూషన్స్ ప్రొవైడర్ వీఫిన్ సొల్యూషన్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పర్చుకుంది. ఈ భాగస్వామ్యం ఎంఎస్ఎంఈ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు అనుగుణంగా సమగ్రమైన సప్లై చైన్ ఫైనాన్స్ సొల్యూషన్‌లను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా బ్యాంక్ ఎండీ అండ్ సీఈఓ ఇట్టిరా డేవిస్ మాట్లాడుతూ 'ఈ భాగస్వామ్యం ఎంఎస్ఎంఈ కెడిట్ యాక్సెసిబిలిటీ అవసరాలను మరింత మెరుగుపరచడానికి మాకు వీలు కల్పిస్తుంది. తద్వారా మా డిజిటల్ ఎంఎస్ఎంఈ ఆఫర్‌లను బలోపేతం చేస్తుంది' అని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే వైశ్యుల కల సాకారం



- చైర్మెన్ కల్వ సుజాత గుప్త

నవతెలంగాణ - చైతన్యపురి

వంద రోజుల కాంగ్రెస్ పాలనలోనే ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న వైశ్యుల కార్పొరేషన్ కల సహకారం అయిందని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్తా అన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలో శ్రీ వాసవి అన్నపూర్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మంచుకొండ సురేందర్ గుప్తా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కల్వ సుజాత గుప్తాను శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని వైశ్య సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేశారని, వారి పోరాటాలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ తొలి చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలియజేశారు. పేద ఆర్యవైశ్యులకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై తాను ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు ఇమ్మడి రమేష్, మొరిశెట్టి శ్రీనివాస్, నల్లపాటి బసంత్, జగిని రమేష్ గుప్తా, పద్మారావు, డాక్టర్ ఎ ఆర్ గుప్త , కొత్తపేట, గ్రీన్‌హిల్స్ కాలనీ, వాసవి కాలనీ ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో యువత రాణించాలి



- అందెల శ్రీరాములు యాదవ్

నవతెలంగాణ - బడంగ్‌పేట్

చదువుకున్న యువతీ యువకులు వ్యాపార రంగంలో రాణించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ నాదర్‌గుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన ఫర్నీచర్ షాపును కార్పొరేటర్ సునీత శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఎదురుచూడకుండా స్వయం ఉపాధి రంగాలల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ బీజేపీ, బీజేవైఎం నాయకులు, షాపు యజమానులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టింబర్ డిపోలో మంటలు



నవతెలంగాణ - హయత్ నగర్

ఓ టింబర్ డిపోలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో తొర్రూర్‌లో ఉన్న న్యూ గీతా టింబర్ డిపోలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగడంతో దుకాణంలో ఉన్న వుడ్ సామగ్రి కాలిపోవడంతో చుట్టూ పక్కలకు మంటలు వ్యాపించకుండా హయత్ నగర్ ఫైర్ అధికారి యాదగిరి తన సిబ్బందితో మంటలు ఆర్పారు. హయత్ నగర్‌లో పోలీస్ స్టేషన్‌లో దుకాణం యజమాని సంజయ్ పటేల్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పథకాలే గెలిపిస్తాయి

- ఎంపీ రంజిత్ రెడ్డి





నవతెలంగాణ - బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తాయని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డా.జీ.రంజిత్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుక్కుగూడలో ఉన్న కె.ఎల్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైనికులుగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ మంత్రి పుష్పలీల, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనిత రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి, నాయకులు, యూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

'పరామర్శల పేరుతో శాంతి భద్రతలకు భంగం'



సీహెచ్ భద్రారెడ్డి

నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించుకోవాలి

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.గోపిరెడ్డి, రాచకొండ పోలీసు అధికారుల సంఘ అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చెంగిచెర్లలో జరిగిన సంఘటన నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకులు పరామర్శల పేరుతో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు వై.గోపిరెడ్డి, రాచ కొండ పోలీసు అధికారుల సంఘ అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. అలా కాకుండా గుంపులుగా వచ్చి విధి నిర్వహణలో ఉన్న పోలీసులను ఆటంక పర్చడం, దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ఉద్దేశపూర్వకంగా పోలీస్ వారిని ఇబ్బందికి గురిచేయడమే కాకుండా పోలీసులకు, మహిళా పోలీస్ వారికి గాయాలయ్యేలా ప్రవర్తించారని.. అనవసరంగా పోలీసులపై దాడి చేయడం తగదని చెప్పారు. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం అనుమతి తీసుకొని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్ని రాజకీయ పార్టీలకు పోలీస్ అధికారుల సంఘంగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

డీసీపీ పద్మజాను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం మల్కాజిగిరి డీసీపీ పద్మజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ దుకాణాలను త్వరగా మూసి వేసేలా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దీంతో రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రంజాన్‌కు పండుగ వరకు దుకాణాదారులకు వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ సమస్యపై సానుకూలంగా స్పందించిన డీసీపీ పద్మజ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట ఉప్పల్ నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులు భద్రుద్దీన్, మొహమ్మద్ అలీ, నవాజ్, గౌరవ్ చావ్లా, జావీద్ ఉన్నారు.

మైనంపల్లిని కలిసిన పావనీ మణిపాల్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీ మణిపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత మొదటిసారిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును ఆయన నివాసంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు పావనీరెడ్డిని అభినందించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వానికి మంచి పేరును తీసుకరావాలని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, చెప్యాల నాగేశ్వర్‌రెడ్డి, కుందనపల్లి నరసింహ, సురేందర్‌రావు, తదితరులున్నారు.

ఇండ్లల్లోని చెత్తను స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలి



నవతెలంగాణ-కాప్రా

ప్రతి ఒక్కరూ ఇండ్లల్లోని చెత్తను అటూ.. ఇటూ..వేయకుండా స్వచ్ఛ ఆటోకు ఇవ్వాలని కాప్రా సర్కిల్ ఏంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల ప్రకారం ఈఏస్ సుధాకర్ పర్యవేక్షణలో చర్లపల్లి డివిజన్‌లో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం జవాన్లు రాజన్, శ్రీశైలంలో ఆధ్వర్యంలో కుషాయిగూడ, వీ.ఎన్.రెడ్డి నగర్, శివసాయి నగర్, కాలనీల్లోని ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. చెత్తను వేర్వేరుగా ఇవ్వని ఇండ్ల యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ లక్ష్మి పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీగా ఈటలను గెలిపించండి



నవతెలంగాణ-కాప్రా

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీగా ఈటల రాజేందర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి ఈటల జమున కోరారు. శుక్రవారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ ఫోర్త్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శశికళ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు గెలుపునకు అనుసరించే వ్యూహాలను సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి, నాయకురాలు మునిగంటి అనూష రామ్, ప్రదీప్, తదితరులున్నారు.

మహిళలకు చీరలను పంపిణీ చేసిన శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ మహిళా నాయకురాలు నిర్మల పుట్టినరోజు సందర్భంగా ఆమెకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీర, పసుపు బొట్టు అందజేశారు. ఆమెతో పాటు చర్లపల్లిలోని మహిళ నాయకురాళ్లందరికీ చీరలు, పసుపు బొట్టు అందజేశారు.

వధూవరులను ఆశీర్వదించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గంలో వివిధ శుభాకార్యాలకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పలు వివాహ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి, బాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మణెమ్మ, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, నరసింహ, వెంకట్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టును సందర్శించిన

ఫ్రెంచ్ రాయబారి బృందం




- స్వాగతం పలికిన ఎల్అండ్‌టీ మెట్రో అధికారులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఫ్రెంచ్ రాయబారి బృందం ప్రత్యేకంగా పరిశీలించింది. భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి డాక్టర్ థియెరీ మాథ్యూ ఆయన బృందానికి ఎల్ అండ్ టీ మెట్రో రైల్ లిమిటెడ్ అధికారులు శుక్రవారం స్వాగతం పలికారు. ఉప్పల్‌లోని మెట్రో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. మెట్రో రైల్ నెట్‌వర్క్‌కి సంబంధించిన రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల భద్రత, రియల్ టైమ్ సిస్టమ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలన్నీ నిర్వహణకు ఇది సెంట్రల్ హబ్‌గా వ్యవహరిస్తుందని మెట్రో అధికారులు ప్రతినిధులకు వివరించారు. పట్టణ ప్రాంత రవాణా విభాగంలో వినూత్నత, సాంకేతిక పురోగతికి నిదర్శనమైన హైదరాబాద్ మెట్రో రైల్వే వ్యవస్థ ఎంతగానో ఆకట్టుకుందని ఫ్రెంచ్ రాయబారి థియెరీ మాథ్యూ తెలిపారు. భవిష్యత్తులోనూ కలిసి చేసేందుకు, సుస్థిరమైన అర్బన్ మొబిలిటీ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేసేందుకు పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు మాథ్యూ బృందం దోహదం చేస్తుందని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

పనికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-జవహర్‌నగర్

పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెబోయిన పుష్ప తన భర్త శివ ప్రసాద్‌తో కలిసి కేపీఎల్ కాలనీ, వెంకటేశ్వర దేవాలయం దగ్గర, బాలాజీనగర్‌లో నివాసముంటున్నారు. శివప్రసాద్ వృత్తిరీత్యా పంజాగుట్టలో సూపర్‌వైజర్ పని చేస్తున్నాడు. బుధవారం శివప్రసాద్ బైక్ కండిషన్‌లో లేనందున కాలినడకన రోజువారీ పని కోసం వెళ్లి ఇప్పటివరకు ఇంటికి తిరిగి రాలేదు. అతడి కోసం తెలిసిన అన్ని ప్రదేశాలలో, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పల్లెబోయిన పుష్ప శుక్రవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చర్లపల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం, టీచర్స్ కాలనీ, సీతారాం కాలనీ, మారుతీ కాలనీ, గాంధీనగర్, సోనియాగాంధీ నగర్ ఫేజ్-2 కాలనీల్లో కాలనీ ప్రెసిడెంట్లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీలు ఏర్పాటు, మంచినీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రతీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు దప్పు గిరిబాబు, చక్రిపురం కాలనీ ప్రెసిడెంట్ రాఘవ రెడ్డి, బుచ్చిరెడ్డి, టీచర్స్ కాలనీ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి, సీతారాం కాలనీ ప్రెసిడెంట్ అశోక్ ముదిరాజ్, గాంధీ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీశైలం, మారుతీనగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి




- మాజీ మేయర్ కావ్య
- లిటిల్ రోజ్ గ్రామర్ హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రత్యేక వంటకాలు

నవతెలంగాణ-జవహర్‌నగర్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య అన్నారు. శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 15వ డివిజన్ బృందావన్ కాలనీలోని లిటిల్ రోజ్ గ్రామర్ హై స్కూల్‌లో పలు రకాల వంటకాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మేకల కావ్య పాల్గొన్నారు. విద్యార్థులకు పరీక్షల సందర్భంగా విషెస్‌ను తెలిపారు. అనంతరం మాట్లాడుతూ జంక్ ఫుడ్ కు అలవాటు పడి పోషకాలున్న సంప్రదాయ వంటకాలను మర్చిపోతున్న తరుణంలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలా వారిలోని సృజనాత్మకత వెలికి తీయటంలో తమ పాఠశాల అన్ని విధాలుగా ముందుంటుందన్నారు. వారిలో ఉత్సాహాన్ని నింపేందుకే ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు, బీఆర్ఎస్ నాయకురాలు స్వప్న, డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం, స్కూల్ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



- జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రజలు తమ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జవహర్‌నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ పరిధిలోని శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జవహర్ నగర్ ప్రధాన రహదారి వెంబడి, వివిధ కాలనీల్లో నిర్వహించే పనులను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ఎప్పటికప్పుడు చెత్తను క్లీన్ చేస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, రోడ్ల మీద చెత్తా చెదారం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని శానిటేషన్ జవాన్లకు సూచనలు చేశారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మీ ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలోగానీ, చెత్తకుండీలలో వేసి సహకరించాలని కోరారు.

మ్యానుఫ్యాక్చరింగ్ ఇన్ రోబోటిక్స్‌పై సెమినార్



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని అనురాగ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లబ్-ఐఈఈఈ - ఆర్ఏఎస్, ఎన్‌టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రోబోటిక్స్ రంగంలో అడిటీవ్ మ్యానుఫ్యాక్చరింగ్ విశిష్టతపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎల్.శివరామకృష్ణ ప్రసంగించారు. రోబోటిక్స్‌లో మెకానికల్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలపై వివరించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రొఫెసర్ శివరామకృష్ణను మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస చలపతి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్.జష్ కుమార్, టి.ఎన్.రవికాంత్, ఏ.ఎం.తనుజ విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో మళ్లీ కాంగ్రెస్‌దే విజయం




- బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మరో మారు కాంగ్రెస్ జెండా ఎగుర వేస్తామని ఆ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు డిఫెన్స్ కాలనీలోని రామాలయం కమ్యూనిటీ హాల్లో బూత్ స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మల్కాజిగిరి లోక్‌సభ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో సునీతామహేందర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవడానికి అందరూ సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ఆర్ ప్రసాద్, లక్ష్మీకాంత్, ఇందిరా చంద్రశేఖర్, చెన్నారెడ్డి, చిత్ర, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మ్యాక్స్ గోడౌన్ వద్ద వినియోగదారుల పడిగాపులు



- తక్కువ ధరకు బ్రాండెడ్ బట్టలు, గృహోపకరణాల విక్రయం..!

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో ఉన్న మ్యాక్స్ వేర్ హౌజ్ వద్ద వినియోదారులు శుక్రవారం పడిగాపులుగా ఎదురు చూశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రముఖ బట్టలు, గృహోపకరణాలకు చెందిన సంస్థ మ్యాక్స్ ఎల్లంపేట వేర్ హౌజ్ వద్ద బ్రాండెడ్ బట్టలు, గృహోపకరణాల వస్తువులను రూ.200 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎల్లంపేట గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున గోడౌన్ వద్దకు తరలివచ్చారు. గురువారం నుంచి విక్రయాలు మొదలు పెట్టిన సంస్థ ప్రతినిధులు శుక్రవారం పోటెత్తిన జనాన్ని అదుపు చేయలేక విక్రయాలు నిలిపివేశారు. ఇదే విషయమై సంస్థ మేనేజర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా తాము వినియోదారులకు వస్తువులను విక్రయించడం లేదని, కేవలం తమ సంస్థలో పనిచేసే సిబ్బందికి మాత్రమే అమ్ముతున్నట్లుగా పేర్కొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంటు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ప్రముఖ రాజకీయ పార్టీకి చెంది న వ్యక్తి ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున అతి తక్కువ ధరకు వస్తువులను కొనుగోలు చేసి తరలించినట్లుగా సమాచా రం. ఈ విషయం సీ-విజిల్‌కు ఫిర్యాదు అందడంతో అధికారులు వచ్చి వివరాలు సేకరించారు. కాగా హైదరా బాద్‌లో మ్యాక్స్ సంస్థను మూసి వేస్తున్నా రని, ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడం, ఇన్సూరెన్స్‌ను క్లైమ్ చేసుకున్నారనే ఆరోపణలతో అతి తక్కువ ధరకు వస్తువులను విక్రయిస్తున్నారని చర్చించుకుంటున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


ఉప్పల్‌లో..


కీసరలో..

నవతెలంగాణ-ఉప్పల్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చిల్కానగర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షులు పబ్బతి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న, శరత్ గూడపాటి హాజరై టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోత్స్న మాట్లాడుతూ.. తెలుగు దేశంతోనే బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షులు సాయి నాగార్జున, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు బజారు హేమంత్ గౌడ్, అనీల్, శివ, కేపి, సాయి మనోజ్, నాయకులు ఇమామ్, బంక రమేష్, డాక్టర్ రామ్ బాబు, హాజరయ్యారు.

కీసరలో..

టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నాగారం లో శుక్రవారం నిర్వహించారు. నాగారం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కొండ జంగారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కాప్రాలో..

తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు టీజీకే మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ చౌరస్తాలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేఆర్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ 1982 మార్చి 29 టీడీపీని పేదల కోసం పార్టీ ఏర్పాటు చేశారని చెప్పారు. బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని తెలిపారు. పేదల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఏకైక పార్టీ తెలుగు దేశం అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడానికి తెలంగాణలోని కార్యకర్తలు, అభిమానులు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో టీ టీడీపీ రాష్ట్ర కార్య దర్శి నీరుకొండ సతీష్ బాబు, రాష్ట్ర ఎస్సీసెల్ సెక్రటరీ శ్రీరాములు, మల్కాజిగిరి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రాములుయాదవ్, పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శి రాంచందర్ గౌడ్, నాయకులు భిక్షపతి, ఉపేందర్, వరద రాజు, నాగేశ్వరావు, వెంకటేష్, రమేష్, హరి, శ్రీనివాస్, నందంగౌడ్, కృష్ణ, సత్యం, నవీన్, కృష్టారావు, తిరుపతిరావు, వెంకటేశ్వరరావు, నాగయ్య పాల్గొన్నారు.


కాప్రాలో..

మేడ్చల్‌లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

- సెయింట్ జోసెఫ్ చర్చి ఆధ్వర్యంలో యేసు ప్రభు శిలువ ఊరేగింపు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని సెయింట్ జోసెఫ్ చర్చి, అత్వెల్లి సీఎస్ఐ చర్చిలల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సెయింట్ జోసఫ్ చర్చి ఆధ్వర్యంలో శివాజీ విగ్రహం నుంచి ఉమా నగర్ చర్చి వరకు యేసుప్రభు శిలువను ఊరేగించారు. ప్రత్యేక ప్రార్థనలతో భక్తులు, గురువుల ఆశీర్వాదాలు పొందారు. శుభ శుక్రవారం యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజున శిలువకు తనకు తానే లోక పాపములను పోగొట్టుటకు శిలువ ఎక్కాడని పలువురు పేర్కొన్నారు. ఆ దినమున పలికిన 7ప్రవచనాలను భక్తులు ధ్యానం చేయడం ఈ రోజు ప్రత్యేకత. అత్వెల్లి చర్చి రెవరెండ్ ఏం.వి ప్రభాకర్ దైవ సందేశం చేశారు. యేసు శిలువ వేయబడిన తర్వాత తన చివరి ఏడు మాటలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా యేసయ్య భక్తి గీతాలు ఆలపించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | మార్చి 30, 2024 | www.navatelangana.com



సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు కంచర్ల కేశవ రావును, ఆయన కుమార్తె జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని,అలాగే ఖైరతాబాద్ నియోజకవర్గం శాసనసభ్యులు దానం నాగేందర్‌లను, ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్, దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిశారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, షౌకత్ అలీ మున్నా తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి



చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న రంజిత్ రెడ్డిని, జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ వర్కింగ్ చైర్మెన్ తూము వినయ్ కుమార్ కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా తూము వినయ్ కుమార్ మాట్లాడుతూ.. చేవెళ్ల నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న రంజిత్ రెడ్డిని ఎంపీగా ప్రజలు ఏ విధంగానైతే గతంలో గెలిపించారో, అదేవిధంగా ఈసారి కూడా అధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని చేవెళ్ల ప్రజలందరినీ కోరుతున్నానని తెలిపారు. తనతో పాటుగా మేడ్చల్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు తెల్ల హరికృష్ణ, పుప్పాల వివేక్, చేతన్, సందీప్, నిఖిల్, విజయ్, అవినాష్, తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు నిత్య అందుబాటులో ఉంటూ... వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజలు కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేను కలిసి శుభకార్యాలకు ఆహ్వానించగా, మరికొందరూ అభివృద్ధి పనులపై వినతి పత్రాలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసుకొని, నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు.

బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం



- బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్
- జగద్గిరిగుట్ట బస్ స్టాప్‌లో చలివేంద్రం ప్రారంభం...

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మండువేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడం కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని కుత్బు ల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో భాగ్యలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బస్ స్టాప్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న భాగ్యలక్ష్మి పౌండేషన్ చైర్మెన్ మాణిక్యచారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో నిత్యం అత్యధికంగా దినసరి కూలీలు, ప్రయాణికులు అధికంగా జనసంచారం ఉన్న ఈ ప్రాంతంలో చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తారి మారయ్య, నిజాంపేట్ కార్పొరేటర్ శ్రీనివాస్ ప్రముఖ వ్యాపారవేత్త పల్లె దత్తాత్రేయ, బీఆర్ఎస్ సత్య రాజు, డివిజన్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్, జర్నలిస్ట్ నాయకులు పి.శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పని చేయాలి



- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి ఎస్‌కేఎస్ఆర్ గార్డెన్స్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనతో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మల్కాజిగిరి ప్రాంతాన్ని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని భారీ మేజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి కొడంగల్ ఎలాగో, మల్కాజిగిరి ప్రాంతం కూడా అలాంటిదే అన్నారు. సునీత మహేందర్ రెడ్డి దంపతులకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందన్నారు. సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి తెలంగాణ ప్రాంతం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే మన పార్లమెంటు నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం శ్రీరంగం, బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి , సేరి సతీష్ రెడ్డి, కొప్పిశెట్టి దినేష్ కుమార్, కాంగ్రెస్ స్టేట్ మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నాయి బ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నికలలో గెలుపొందినటువంటి ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారు, కుత్బుల్లాపూర్ గ్రామం, సీపీఆర్ కాలనీలో గల కె.యం.ప్రతాప్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు,యువ నేస్తం ఫౌండేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కేపీ విశాల్ గౌడ్‌ను కలిశారు. ఆయన నూతనంగా ఎన్నికైన ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారిని అభినందించి, వారిని శాలువాతో సత్కరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నాయి బ్రాహ్మణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నాడు, వారి అభివృద్ధికి సహకరిస్తానన్నాడు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నాయి బ్రాహ్మణ నూతన కమిటీ అధ్యక్షులు గడల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్.వెంకటేష్ నాయి, చైర్మెన్ జే రవీందర్ వర్కింగ్ ప్రెసిడెంట్ యు.వేణుగోపాల్, కోశాధికారి హరికృష్ణ, ఉపాధ్యక్షులు నారాయణ, కోశాధికారి శివా పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

బౌరంపేట సబ్‌స్టేషన్ 33/11 కె.వివిద్యుత్ ఫీడర్, కొత్త సర్వీస్ కనెక్షన్, మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 7: 30 నుంచి 8:00 గంటల వరకు సింహపురి కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, డాలర్ డ్రీమ్ విల్లాలు, కోకా-కోలా గో-డౌన్, గోకుల్ బృందావన్, గోకుల్ నందన్, నెస్ట్ విల్లాస్, బావర్చి హెూటల్, డిఆర్‌కే కళాశాల, కేఎల్‌హెచ్ విశ్వవిద్యాలయం మొదలైన ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట ఏఈ బి. సాయికిరణ్ తెలిపారు.

డ్రయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రయినేజీ పనులు త్వరగా పూర్తిచేయాలని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి కాంట్రాక్టర్‌ను అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధి బాలయ్యనగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రయినేజీ పనులను బస్తీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ల్లోని ఆయా ప్రాంతాలలో పెండింగ్‌లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నవాబ్ పాషా, బాలయ్యనగర్ అధ్యక్షులు ఈ.నగేష్, స్థానిక నాయకులు చిన్న, బస్తీవాసులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యం నింపిన పార్టీ తెలుగుదేశం



- టీడీపీ డివిజన్ అధ్యక్షులు మర్కంటి నర్సింగ్ రావు ముదిరాజ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్య నింపిన పార్టీ తెలుగుదేశం అని రంగారెడ్డినగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షులు మర్కంటి నర్సింగ్ రావు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆయన ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఖుత్బుల్లాపూర్ నియోజకవర్గం, రంగారెడ్డినగర్ డివిజన్ ఐడీపీఎల్ కాలనీ సమీపంలోని ఆదర్శనగర్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులతో కలిసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తెలుగు రాష్ట్రాల ప్రజల సంక్షేమం కోసం టీడీపీ పార్టీ ఎంతో కృషి చేసిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి టీడీపీ హయంలోనే జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సాంబశివరావు, పూర్ణాచౌదరి, బాల్ రాజ్, నరసింహ మూర్తి, శ్రీనివాస్, సురేష్ పాండు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కనీస జాగ్రత్తలు పాటించకుండా బ్లాస్టింగ్.. ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హానర్ హెూమ్స్ నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం కారణంగా, ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రిలో చేరిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి, ఐడీపీఎల్ చెరువు సమీపంలో, హానర్ అనే నిర్మాణ సంస్థ చేపట్టిన, నిర్మాణ ప్రాంతంలో శుక్రవారం బండ రాళ్లని పగలగోడుతుండగా కనీస జాగ్రత్తలు పాటించకుండా.. బ్లాస్టింగ్‌కు పూనుకోవడంతో అక్కడ పని చేస్తున్న బెంగాల్‌కు చెందిన ఇద్దరు కార్మికులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన హరిలాల్ మాహలీ, బీహార్ రాష్ట్రానికి చెందిన పంకజ్ ఆలం తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని సమీపంలోని ఆమోర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అందు లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. అనంతరం అక్కడకు చేరుకున్న పోలీసులు నిర్మాణ సంస్థ అనుమతులు, మైనింగ్ బ్లాస్టింగ్ అనుమ తులపై విచారణ చేపట్టి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనుకూల స్టడీతో సీపీసీ పరీక్షల్లో స్టెల్లార్ స్కోర్..

నవతెలంగాణ-సిటీబ్యూరో

సొల్యూషన్స్-3 ఎక్స్ అనుకూలమైన స్టడీని అందించడం ద్వారా సీపీసీ పరీక్షలో స్టెల్లార్ స్కోర్‌లను సంపాదించడంలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సాంప్రదాయ విద్య నుంచి డైనమిక్ హెల్త్‌కేర్ రంగానికి మారడం చాలా మంది గ్రాడ్యుయేట్‌లకు, ముఖ్యంగా వైద్య రంగంలో గణనీయమైన సవాలుగా ఉంది. నైపుణ్యం గల వైద్య కోడర్‌ల కోసం డిమాండ్ ఎక్కువగా ఉంది. అయినప్పటికీ ప్రస్తుత శిక్షణ ల్యాండ్‌స్కేప్ తరచుగా తక్కువగా ఉంటుంది, సరిపోని నైపుణ్యాలు, విచ్ఛిన్నమైన జ్ఞానాన్ని అందిస్తోంది. సొల్యూషన్స్-3 ఎక్స్ ఏ ఇతర మాదిరిగా కాకుండా రెండు నెలల మెడికల్ కోడింగ్ ప్రోగ్రామ్‌ను అందిస్తుంది. కేవలం పాఠ్యపుస్తక సిద్ధాంతంపై ఆధారపడే బదులు, సొల్యూషన్స్-3 ఎక్స్ ప్రయోగశాల అనుభవం, ఇంటరాక్టివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యతనిస్తుంది. విద్యార్థులు పరిశ్రమ నిపుణుల నుంచి మార్గదర్శకత్వం పొందుతూ వాస్తవ ప్రపంచ దృశ్యాలను పరిష్కరిస్తూ అనుకరణ ఆరోగ్య సంరక్షణ సెట్టింగ్‌లలోకి ప్రవేశిస్తారు. అనుభవజ్ఞులైన ఆరోగ్య సంరక్షణ నిపుణులతో సూక్ష్మంగా రూపొందించబడిన, పాఠ్యాంశాలు గ్రాడ్యుయేట్‌లు ధృవీకరణ పొందడమే కాకుండా వారి కెరీర్‌లో రాణించడానికి పూర్తిగా ప్రోత్సాహాన్ని అందిస్తుంది. 2022లో సమీవుల్లా మహ్మద్, ముత్తుకుమరన్ గాంధీ నగరంలో స్థాపించిన సొల్యూషన్స్-3 ఎక్స్, యూఎస్ హెల్త్‌కేర్ సెక్టార్‌లో విశ్వసనీయ శిక్షణ భాగస్వామిగా మారింది. ఆరోగ్య సంరక్షణ శిక్షణలో ప్రత్యేకత, ఇది అమెరికన్ అకాడమీ ఆఫ్ ప్రొఫెషనల్ కోడర్స్, అమెరికన్ హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రెండింటితో అనుబంధించబడిన ఏకైక శిక్షణా సంస్థ.

బౌరంపేట్‌లో అక్రమ విల్లాల నిర్మాణాలపై చర్యలేవి..?

- అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల కనుసన్నల్లోనే యదేచ్చగా నిర్మాణాలు
- పురపాలక సంఘం లొసుగులు ఆసరాగా చేసుకుని, చైన్‌మైన్‌ల సహాయ సహకారాలు
- అక్రమ నిర్మాణాలపై వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపడతామంటున్న మున్సిపల్ కమిషనర్



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ పరిధిలో సర్వే నెంబర్ 264 పార్ట్ గల కన్జర్వేషన్ కొంత ఎకరాల భూమిలో అక్రమ విల్లాలపై చర్యలేవి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎటువంటి అనుమతులు లేకుండా గ్రామస్తులను అడ్డుపెట్టుకొని 6 విల్లాలు నిర్మించిన సదరు బిల్డర్ అదే స్థలంలో మరో 500 గజాల స్థలంలో మరో6 అంతస్తుల బహుళ నిర్మాణం కట్టారని తెలుస్తోంది. ఇంతటితో ఆగకుండా మరో 300 గజాల స్థలంలో భవన నిర్మాణం షట్టర్లు, కమర్షియల్‌గా చేపట్ట డం పెద్ద వివాదంగా చోటు చేసుకుంది. కొన్ని ఏండ్ల క్రితం ఈ స్థలంపై ఎంతో వివాదాలు నెలకొనగా స్తబ్దతగా ఉన్నా... కొన్ని సంవత్సరాల అనంతరం మరల అధికారుల, స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలతో అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. దుండిగల్ మున్సిపాలిటీలో కొన్ని సంవత్సరాలుగా టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో ఇక్కడ చైన్ మెన్‌లదే హవా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సదరు బిల్డరు మొదట చైన్‌మెన్‌ను సహకారం తీసుకొని, ఆ తరువాత అధికారులను, స్థానిక ప్రజాప్రతి నిధుల అండదండలతో ఇష్టానుసారంగా గత గ్రామపంచా యతీ హయాం పురపాలక సంఘ నిబంధనల లోసుగుల ను ఆధారంగా చేసుకున్నారని సమాచారం. మున్సిపల్ నిబంధనలను తుంగలో తొక్కి ఎటువంటి అనుమతులు లేకుండా అత్యం త ఖరీదైన విల్లాల నిర్మాణాలు, అంతటితో ఆగకుండా పక్క ప్రక్కనే నిర్మాణాలు చేపట్టడం గమనార్హం. ఇప్పటికే ఈ విల్లాల నిర్మాణాలపై కొత్తగా విధుల్లోకి వచ్చిన టీపీఓ స్పందిస్తూ పత్రికా వార్త కథనాలను తీసుకొని సంబంధిత అక్రమ విల్లాల, అక్రమ భవన అక్రమ భవన నిర్మాణాలను గుర్తించామన్నారు. ఈ స్థల నిర్మాణంల పై ఇప్పటికే చర్యలపై దాట వేస్తూ వస్తున్న అధికారులు మరి అక్రమ నిర్మాణాలపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారో వేచిచూడాలని ప్రజలు అంటున్నారు.

వెంటనే నోటీసులు అందజేస్తాం..



దీనిపై దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కే. సత్యనారాయణ వివరణ కోరగా బౌరంపేట్ పరిధిలోని 264 పార్ట్ కు సంబంధించి అక్రమ విల్లాల అక్రమ నిర్మాణం తదితర బహుళ అంతస్తుల నిర్మాణాలను పూర్తిగా పరిశీలిస్తా మన్నారు. ప్రాథమిక సమాచారం బట్టి ఎటువంటి మున్సిపల్ అనుమతులు ఇవ్వలేదని గత గ్రామ పంచాయతీకి సంబంధించిన వాటితోనే కొనసాగినట్టు కనపడుచున్నా యని మున్సిపల్ నిబంధనలు అతిక్రమించి ఇష్టాను సారం గా నిర్మాణాలు చేపట్టడంపై సదరు నిర్మాణదారుడికి వెంటనే నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఆపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూల్‌లో ప్రతిబింబ్ థీమ్ డే వేడుకలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఎస్ఎస్‌డి గ్రామర్ హైస్కూల్‌లో ప్రతిబింబ్ థీమ్ డే వేడుకలు మూడవరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతి విద్యార్థి స్కిట్స్, ఇంగ్లీష్ కాన్సెప్ట్, డాన్స్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొన్నారు. స్టేజ్ ఫియర్, బాడీ లాంగ్వేజ్ కమ్యూనికేషన్స్ స్కిల్స్, విద్యార్థుల సబ్జెక్టుల నుంచి టాపిక్స్ తీసుకుని, స్పీకింగ్ అండ్ డాన్స్ జోడించి వినూత్న ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో వాటర్ సైకిల్, ఫైవ్ ఎలిమెంట్, ఎలక్ట్రో మాగ్నెటిజం, జంక్ ఫుడ్స్, సేవ్ సాయిల్, సేవ్ గంగా, మ్యాథ్స్ మ్యాజిక్, ట్రాఫిక్ సిగ్నల్, ఫండమెంటల్ రైట్స్, వివిధ రకాల వృత్తుల గురించి, సోలార్ సిస్టం,పార్ట్స్ ఆఫ్ స్పీచ్, సేవ్ బర్డ్స్ వంటి నాటకాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్ రావు ఆయన సతీమణి సురభిదుర్గా వాణి, ప్రిన్సిపల్ సురభి తేజస్విని, ఇన్‌చార్జిలు, స్టాఫ్, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో ఎలిమ్ ఎం.బి. చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని ఎలీమ్ ఎం.బి. చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రార్థనలు కొనసాగాయి. ప్రత్యేక ప్రార్థనల మధ్య భక్తులు పాస్టర్ వద్ద దైవ ఆశీర్వాదాలు తీసుకున్నారు. శుభ శుక్రవారం యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు కావడంతో భక్తులు ప్రత్యేక ప్రార్థనలతో ధ్యానించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రేవ్. జి.కే. ప్రసాద్ దైవసందేశం అందించారు. శిలువపై యేసు క్రీస్తు పలికిన తన చివరి ఏడు మాటల గురించి భక్తులకు వివరించారు. ప్రభువైన యేసుక్రీస్తు కల్వరి శిలువలో తన రక్తం చిందించడం వల్ల సర్వమానవాళికి విమోచన కలిగింద న్నారు. యేసు క్రీస్తును సిలువ వేసిన రోజునే క్రైస్తవులు ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటిగా గుడ్ ఫ్రైడేను జరుపుకుంటా మన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎలీమ్ ఎం.బి. చర్చిలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు హాజరై సిలువపై యేసు పలికిన ఏడు మాటలు ధ్యానించి యేసు క్రీస్తు త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా యూత్, మహిళా కమిటీ వారు ప్రత్యేక గుడ్ ఫ్రైడే గీతాలను ఆలపించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంతం కిటకిట లాడింది. ఈ కార్యక్రమంలో చర్చి చైర్మెన్ ఎంజే. పరంజ్యోతి, కార్యదర్శి సుదర్శనం, కోశాధికారి సంజీవ్, కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



దానం నాగేందర్‌తో ఆదం భేటీ



నవతెలంగాణ-ఓయు

సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ని ఆదం సంతోష్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా దానం నాగేందర్‌ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఎల క్షన్లలో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు అదం సృజన్ కుమార్, అమర్‌నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న నివేదిత



నవతెలంగాణ-కంటోన్మెంట్

దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి బీఆర్ఎస్ కంటోన్మెంట్ సీనియర్ నాయకురాలు నివేదిత శుక్రవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ముస్లిం సోదరులను, ముస్లిం మహిళలను కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో , టీఎస్ శ్రీనివాస్, అజు భాయ్, వాహబ్ భాయ్, అంజద్, ఫసి, నజీర్, అహ్మద్, కుమార్, దేవనపల్లి శ్రీనివాస్, ముం ౼శి యాదవ్, భాస్కర్ ముదిరాజ్, వంగల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బద్రీ విశాల్ జీవిత చరిత్రను అధ్యయనం చేయాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

బద్రీ విశాల్ పన్నాలాల్ పిత్తి బహుముఖ ప్రజ్ఞాశాలనీ, ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. బద్రి విశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో 96 జయంతిని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదు కుమార్, రిటైర్డ్ జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నివాళులర్పించారు. అనంతరం తెలుగు,హిందీలో ముద్రించిన పుస్తకాలను వారు ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ సమసమాజంలో సభ్యత, సంమస్కారం, క్రమశిక్షణ, సమయపాలనను ఆయన నుంచి నేర్చుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన నడుస్తోందనీ సీఎం రేవంత్‌రెడ్డి తనపై పెద్ద బాధ్యత పెట్టారన్నారు. బద్రీ విశాల్ పన్నాలాల్ పిత్తి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మెన్ శరత్ పిత్తి, ట్రస్టీలు లక్ష్మీనివాస్ శర్మ, విజయ్ కుమార్, అజిత్ గుప్తా తదితరులు పాల్గొని ఆయన చేసిన వివిధ రకాల సేవలను వివరించి భాగస్వాలయ్యారు.

మాదిగలకు రాజ్యాధికార అవకాశం ఇవ్వాలి



- తెలంగాణ మాదిగ సంఘాలు

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీట్ల సర్దుబాటు విషయంలో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, మాదిగలకు రాజ్యాధికార అవకాశం ఇవ్వాలనీ తెలంగాణ మాదిగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ సం దర్భంగా ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. గత రెండురోజులుగా ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం వద్ద మాదిగ సంఘాలనాయకులు, కార్యకర్తలు ప్రధాన డిమాండ్లను నేరవేర్చాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపల్లి పార్లమెంటు సీటు కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలని, గజ్జెల కాంతంకి ఆ సీటు కేటాయించాలన్నారు. అదే విధంగా వరంగల్ ఎంపీ సీటు, కంటోన్మెంట్ అసెంబ్లీ సీటు మాదిగలకు ఇవ్వాలని ప్రధాన డిమాండ్ చేస్తూ కంటోన్మెంట్ సీటు పిడమర్తి రవికి కేటాయించాలని కోరారు. 18 లక్షలు ఉన్న మాలలకు ఎక్కువ సీట్లు కేటాయిస్తున్నారని, 80 లక్షలకు పైగా ఉన్న మాదిగలకు సీట్ల కేటాయింపులు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఊట్ల వరప్రసాద్, సురేందర్ సన్నీ, చంద్రశేఖర్, ఉపేందర్, గోవిందరావు, సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నగరానికి రీజనల్ రింగ్‌రోడ్డు

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ-ఓయు

దేశాభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీని మరోసారి ప్రజల ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మరోసారి ఆశీర్వదించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొ న్నారు. శుక్రవారం తార్నా కలోని శ్రీకర్ శ్రీ శ్రీవాస్ అపార్టుమెంట్స్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్న ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎస్ఎస్ హైట్స్, కళాకృతి వాసులతో ఆయన వేరు వేరుగా సమావేశమై ప్రధాని మోడీ పాలనను మరో సారి ఆశీర్వదించాలన్నారు. బిజేపిని మహిళలు ఎంతో ఆదరి స్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ కృషితో వందలాది కోట్ల వ్యయంతో బేగంపేట్ ఏయిర్ పోర్టు అభివృద్ధికి శంకుస్థాపన చేశారని, సికింద్రాబాద్. నాంపల్లి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, 4 వందేభారత్ ట్రైన్లను తెచ్చారని, ఎంఎంటీఎస్ మూడో దశపనులను పూర్తి చేశామని, చర్లపల్లి టర్మినల్ అభివృద్ధితో పాటు త్వరలో నగరానికి రీజనల్ రింగ్ రోడ్డు రాబోతుంద న్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు, మాజీ మేయర్ బండ కార్తిక చంద్రారెడ్డి, నాయకులు శాస్త్ర మసుందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, ప్రభుగుప్త, రవిప్రసాద్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, పోచయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి మల్లింటి వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వ శాఖలలో అవినీతి తాండవం

- ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్ సునామీ పార్టీ అధ్యక్షుడు

నవతెలంగాణ-బంజారాహిల్స్



దేశంలో, రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖలలో అవినీతి తాండవిస్తుందని ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సిహెచ్. భూపాల్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ అవినీతిని నిలువరించడంలో అన్ని ప్రభు త్వాలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రెవెన్యూ మైనింగ్ శాఖలలో చిన్న స్థాయి ఉద్యోగులు సైతం లంచగొండులుగా పట్టుబడ్డ వైనాలు కోకొల్లలుగా చూశామని అన్నారు. స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో లంచాలు లేకుండా పనులు జరగట్లేదని వాపోయారు. అవినీతి పరులు రాజ్యాధికారులుగా ఉంటే దేశ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేశవరావు ఆంధ్ర ప్రాంతం వ్యక్తి అని,తెలంగాణ కాంగ్రెస్ లో ఆంధ్రుల జోక్యం ఎక్కువైందని ఆయన తెలిపారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన జైన్ సంఘ ప్రతినిధులు

నవతెలంగాణ-కంటోన్మెంట్



కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీగణేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జైన్స్ సంఘ అధ్య క్షులు యోగేష్‌జైన్ శుక్రవారం ముఖ్య మంత్రి రేవంత్ ౼రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. నాంపల్లి గ్రౌండ్‌లో జరగబోయే మహావీర్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో జైన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ జైన్, కోశాధికారి మహేందర్ జైన్ ప్రధాన కార్యదర్శి అశోక్‌జైన్, కంటోన్మెంట్ జైన్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్‌నగర్
మజీద్ వద్ద ఇఫ్తార్ విందు



- పాల్గొన్న సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్ నగర్ మహమ్మదీయ మజీద్ వద్ద ఎర్రగడ్డ డివిజన్ జనరల్ సెక్రెటరీ షరీఫ్ బాయ్, జావీద్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటలకు రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్, మాజీ హోమ్ మంత్రి మహమ్మద్ అలీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. సుమారు 500 మంది ముస్లిం సోదరులు ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూసఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్‌పటేల్, వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యరావు, డివిజన్ అధ్యక్షులు బీఆర్ఎస్ నాయకులు భారీగా పాల్గొన్నారు.



జింఖానా గ్రౌండ్‌లో ప్రారంభమైన 'హునర్ మహోత్సవ్ ఎక్స్‌పో'

- ప్రారంభించిన బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

గాంధీ స్మృతి దర్శన్ న్యూఢిల్లీ సహకారంతో జింఖానా గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను సోమవారం కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ కె.సోమశంకర్, సోమ సుందరంలు ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ నేటి నుండి నుండి ఏప్రిల్ 8 వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన కళాకారులు వారి ఉత్పత్తులను 350 మంది కళాకారులు, చేతి వృత్తుల హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో ప్రదర్శించుచున్నారు. వివిధ రకాల వంటకాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్, గాంధీ స్మృతి దర్శన్ సమితి స్వయంప్రతిపత్త సంస్థ విజయ్ గోయెల్ మాట్లాడారు.

పార్లమెంటు ఎన్నికలలో బీసీలకు కాంగ్రెస్ సగం స్థానాలు ఇవ్వాల్సిందే

- ప్రజా పాలన పేరుతో కులపాలన చేయొద్దు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-బేగంపేట్

కేసీఆర్ చేసిన తప్పిదమే కాంగ్రెస్ చేస్తే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించిక తప్పదని, రాహుల్ గాంధీని తప్పు దారి పట్టించి బీసీలకు అన్యాయం చేస్తున్నారని, ప్రస్తుతం జరిగే పార్లమెంట్ ఎన్ని కల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం సగం పార్లమెంటు స్థానాలను కేటాయించాల్సిందేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్‌లో గల విశ్వకర్మ సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుంధారం గణేష్‌చారితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో బీసీలకు అసెంబ్లీ టికెట్లు ఇస్తానని హామీ ఇచ్చి విస్మరిం చిందని, అయినప్పటికీ కెసిఆర్ ఓటమి లక్ష్యంగా బీసీలకు రాజకీయంగా నష్టం జరిగిన భరించామన్నారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ సబ్బండ కులాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీలను కాదని ఇతర పార్టీలో ఉన్న అగ్రకులాలను రాత్రికి రాత్రి తీసుకొచ్చి టికెట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బీసీ కులగనన చేపట్టాలని, బీసీలకు రాజకీయ అధి కారం దక్కాలని దేశంలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల రాజకీయ కూటమిని కలుపుకొని ముందుకు కెళు ౼ంటే రాహుల్ గాంధీ విధానానికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ఒకే సామాజిక వర్గానికి పార్లమెంటు టికెట్‌లు కేటాయించడం చాలా అన్యాయం అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం ఆత్మగౌరవ నినాదంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పూర్తిగా ధినిని విస్మరించాచాలని చూడడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంటు స్థానాలకుగాను ఆరు పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇచ్చిందని, అదే విధంగా బీజేపీ ఐదు పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం 12 పార్లమెంటు స్థానాలు ప్రకటిస్తే ఇందులో బీసీలకు కేవలం ముగ్గురికి మాత్రమే ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. ఇంకో ఐదు పార్లమెంట్ స్థానాలకు బీసీలకు ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు బీఆర్ఎస్ బీజేపీ కంటే ఎక్కువ టికెట్లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం 8 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి బీసీ ఎస్సీ ఎస్టీలను విస్మరించి ఇతర పార్టీలలో ఉన్న అగ్రకులాలను తమ పార్టీలోకి అరువు తెచ్చుకొని రాజకీయంగా పెద్దపీట వేయడంతోనే టిఆర్ఎస్ పార్టీకి బీసీ ఎస్సీ ఎస్టీలు గుణపాఠం చెప్పారని కేసీఆర్ చేసిన తప్పిదమే మళ్లీ కాంగ్రెస్ పార్టీ చేస్తుందని బీసీలు భావిస్తున్నారని ఆయన అన్నారు. ఇదే వైఖరి అవలంబిస్తే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో గణేష్‌చారి, శ్రీనివాస్ ముదిరాజ్, శ్యాంకుర్మా, నగేష్, లింగంగౌడ్, మహేష్, శ్రీనివాస్‌గౌడ్, భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి బాటలు వేసింది టీడీపీనే





- ఓయూలో ఘనంగా టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఓయు

సామాజిక న్యాయనికి బాటలు వేసిన పార్టీ తెలుగుదేశం పార్టీనేనని, చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఓయూ పీహెచ్డీ విద్యార్థి తలారి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట టీడీపీ 42వ,ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వెజ్ బిర్యానీ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తెలుగుదేశం పార్టీ నేటికి 42 సం.రాలు అధికారం, ప్రతిపక్షంలో ప్రజల కోసం ఉందన్నారు. సంక్షేమ పథకాలకు బాటలు వేసి సామాజిక న్యా యానికి పునాదులు వేసిన సామాజిక స్ఫూర్తితో డా.బీ.ఆర్. అం బేద్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేసిన నేత ఎన్టీఆర్ అని అ న్నారు. అయిన స్ఫూర్తితో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న పార్టీని చంద్రబాబు నాయుడు బలోపేతం చేస్తు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో ఓయూ ఎంప్లాయిస్ యూని యన్ అధ్యక్షుడు శివ శంకర్, బీసీ సెల్ హైదరాబాద్ సిటీ ఉపాధ్యక్షులు మంద వేంకట స్వామి, ముద్ద గణేష్, కొటేశ్వర్ రావు, చప్పిడి గోపీ,సి.యచ్. వీర బాబు, ప్రభాకర్ మాదిగ, బాలేబొయిన.గోపీ గౌడ్, ఐతనబొయిన గోపీ ముదిరాజ్, రాజు, అనిల్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావం

నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో తెలుగుదేశం పార్టీ 42వ, ఆవిర్భావ దినోత్సవన్ని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లరపు శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో చందర్ ముదిరాజ్, సుదర్శన్‌రెడ్డి, నం ౼సింహ, నటరాజ్, బలరాజ్, చిరంజీవిరాజ్, శశిరేఖ పాల్గొన్నారు.

టెట్ ఫీజును తగ్గించండి : స్వామి గౌడ్

నవతెలంగాణ-ఓయు



టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ శుక్రవారం కలిసిన వినతి పత్రం అందజేశారు. టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని టీఎస్ జెన్కో కెమిస్ట్రీ పోస్టులు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 60 శాతం ఉన్న మార్కుల నిబంధనను సడలించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డిని తన నివాసంలో కలి సిన బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేం నరేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యలను పరి ష్కరిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.ఈ కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ పెరుమల ఏడుకొండలు, సురేష్‌గౌడ్, గాజుల నవీన్, బద్రి, జాలలాలు, రాజశేఖర్, మహేష్, పవన్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో అనేక సమస్యలు..

ఈటల రాజేందర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని అవుతారని, మల్కాజగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మల్కా కొమురయ్య బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరిలో మోడీ రోడ్ షోలో ప్రజలను చూసి ముగ్ధుడయ్యారని, అదే విధంగా మల్కజ్‌గిరిలో బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమన్నారు. తెలంగాణలో 12 పార్లమెంటు సీట్లు గెలుస్తాయని మోడీ తెలిపారు. మల్కాజిగిరిలో నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, తను గెలిచిన వెంటనే సమస్యలను పరిష్క రిస్తానని చెప్పారు. మల్కాజ్ గిరి పార్లమెంటులో సర్వేలకు అందని విధంగా బీజేపీ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజ్‌గిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి ఏమి చేయలేదని, జీహెచ్ఎంసీ ఎన్నికలలో, అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఒక్క సీటు గెలవలేదని ఎద్దేవా చేశారు.

బోయలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి



- ముఖ్యమంత్రికి బీహెచ్‌పీఎస్ విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎన్నికల సమయంలో వాల్మీకి బోయలకు ఇచ్చిన హామీని నిలబెట్టాలని బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్ పీఎస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది.శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సమితి అధ్యక్షుడు గోపిబోయ మాట్లా డారు. గత ప్రభుత్వ హయాంలో వాల్మీకి బోయలకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పటి ముఖ్యమంత్రి తమ సమస్యలపై దృష్టి సారించకపోవడం విచార కర మన్నారు. రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా తీవ్ర వెనుకబడిన అనుభవిస్తున్న బోయలను అన్ని రకాలుగా ఆదుకోవడంతోపాటు రాజకీయ అవకాశాలు సైతం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ గేట్లు ఎత్తేసామంటూ వివిధ పార్టీల నుంచి వస్తున్న నేతలను చేర్చుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ తమ సామాజిక వర్గానికి ఎలా న్యాయం చేస్తారన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన పేరుతో ప్రజలకు దగ్గరవుతున్న ముఖ్యమంత్రి అత్యంత దయనీయ స్థితిలో ఉన్న తమ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వడంతో పాటు అన్ని రకాల ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ సభ్యులు న్యాయవాది నిర్మల, సామాజిక వేత్త ప్రభంజన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చంద్రరావు,రాజేశం,నర్సయ్య, అంజయ్య, యాదయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.





దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి లాస్య నివేదిత శుక్రవారం సాయంత్రం రసూల్‌పురా ధన్ బజార్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం పలువురు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-కంటోన్మెంట్

ఎర్రమంజిల్ ప్రధాన రహదారి మహేశ్వరి చాంబర్స్‌లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఎర్రమంజిల్ ప్రధాన రహదారిలో ఉన్నా మహేశ్వరి చాంబర్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో శ్రీ వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ అండ్ బిల్డర్స్ కార్యాలయంలో స్వల్ప అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అప్రమత్తమైన సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న మం టలను అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణాష్టం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దీన్ని ఆను కుని ఉన్న ఆర్యభవన్ ఉడిపి హోటల్లో సైతం అగ్నిమాపక సిబ్బంది అధికారులు సందర్శించి సిలిండర్లను పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాద సంస్థలు ఎటువంటి అనుమతులు లేవని అధికారులు పేర్కొన్నారు.

సైదాబాద్‌లో చైన్ స్నాచింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓ వృద్ధుడి మెడలో నుంచి చైన్ స్నాచింగ్ చేసిన ఘటన సైదాబాద్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేటకు చెందిన ప్రకాష్ అనే వృద్ధుడు వెల్డింగ్ వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం సైదాబాద్ శంఖేశ్వర్ బజార్ పెట్రోల్ బంక్ వద్ద అతను కారులో దిగుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ప్రకాష్ చుట్టూ తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేశారు. అనంతరం అతని మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. వారిని పట్టుకునేందుకు ఆ వృద్ధుడు ప్రయత్నించి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన ఇద్దరు యువకులు ఆ దొంగలను వెంబడించి వారిలో ఒక దొంగను పట్టుకున్నారు. మరో దొంగ ఆటోలో పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కొన్ని రోజుల క్రితం మృతి చెందిన చర్లపల్లి డివిజన్ శుభోదయ నగర్ కాలనీకి చెందిన అలేటి హర్షవర్ధన్ రెడ్డి దశదిన కర్మకు హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. నవతెలంగాణ-కాప్రా

నేడు కాంగ్రెస్‌లోకి నగర మేయర్

- ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో చేరిక
- ఆమె బాటలోనే కొందరు కార్పొరేటర్లు..!





నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్‌లో బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. సాక్ష్యాత్తు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మరికొందరు అనుచర కార్పొరేటర్లతో కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. ఇందుకు శనివారం ఉదయం 9.30గంటలకు ముహూర్తం నిర్ణయించారు. అంతకు ముందు ఆమె తండ్రి రాజ్యసభ సభ్యులు కె. కేశవరావుతో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావుని కలిశారు. పార్టీని విడి కాంగ్రెస్‌లోకి వెళుతున్నట్టు ఆమె కేసీఆర్‌కు తెలిపినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆమెపై కేసీఆర్ ఆగ్రహం కూడా వ్యక్తం చేసినట్టు తెలిసింది. కాగా తాను తీసుకున్న నిర్ణయం మేరకు కాంగ్రెస్‌లో చేరడానికి విజయలక్ష్మి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు.

కాంగ్రెస్ ఆకర్ష్‌కు.. బీఆర్ఎస్ కుదేలు..!

ఇదిలావుంటే జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శనివారం ఉదయం 9.30 గంటలకు బంజారాహిల్స్‌లోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు. పార్టీలో చేరిక తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలవనున్నారు. జీహెచ్ఎంసీలోని మరికొందరు కార్పొరేటర్లు కూడా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతారని తెలిసింది. ఇప్పటికే ఇటీవలే బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్‌తో పాటు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ఆకర్ష్‌లో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి క్షేత్రస్థాయిలో ఉండే కార్పొరేటర్ల వరకు కాంగ్రెస్ దృష్టి సారించగా.. జీహెచ్ఎంసీ నగర మేయర్‌గా ఉన్న విజయలక్ష్మి పార్టీలో చేరడం వల్ల పార్టీకి మేలు జరుగుతోందని కాంగ్రెస్ నేతల ఆలోచనగా తెలుస్తోంది. కాగా ఇప్పటికే డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి దంపతులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, మాజీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్ హస్తం గూటికి చేరిన తెలిసిందే.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్
- దమ్మాయిగూడాలో ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-కీసర

ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నెల రోజులపాటు నిర్వహించే ఉపవాసాల్లో ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడా మున్సిపాలిటీ మహిళా ప్రధాన కార్యదర్శి ఈగా శ్వేతా రాజు ఆధ్వర్యంలో దమ్మాయిగూడా ఆర్‌జీకె లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ మెంబెర్ ముజీబుద్దీన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత వెంకటేష్,బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, దమ్మాయిగూడా మున్సిపాలిటీ అధ్యక్షుడు ముప్ప రామా రావు ,వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జవహర్ నగర్ బీజేపీ మాజీ అధ్యక్షుడు

- ఈటల గెలుపునకు శాయశక్తుల కృషి చేస్తా. రంగుల శంకర్ నేత

నవతెలంగాణ-జవహర్ నగర్



మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజా నేత ఈటల రాజేందర్ గెలుపు కోసం బీజేపీలో చేరినట్టు బీజేపీ జవహర్ నగర్ మాజీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత తెలిపారు. శుక్రవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గంగపురం కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీలో చేరారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ ఉద్యమకారులైనటువంటి, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ గెలుపునకు తమ వంతుగా కృషి చేస్తానని రంగుల శంకర్ నేత అన్నారు. ఆయనతోపాటు పార్టీలో చేరిన వారిలో ముత్యం సుజాత, కోస్గిశివకేశవులు, తన్నీరు పద్మ, ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావ్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మెల్‌బోర్న్ మామ క్రియేటివ్ స్పేస్ ప్రారంభం



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఓపెనింగ్

నవతెలంగాణ-కాప్రా

జూబ్లీహిల్స్‌లో మెల్‌బోర్న్ మామ క్రియేటివ్ స్పేస్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఈఓ సతీష్ వర్మ మెల్బోర్న్ మామ స్థాపించి సృజనాత్మక రంగంలో మరోక కొత్త మలుపుని తీసుకోస్తున్నారని అన్నారు. తనదైన శైలితో, సృజనాత్మకతను ఇంకోక మెట్టు ఎక్కిస్తూ, కొత్తదనాన్ని పరిచయం చెయ్యాలన్న దృక్పథంతో సీఈఓ సతీష్ వర్మ న్యాయకత్వంలో మెల్బోర్న్ మామ క్రియేటివ్ స్పేస్ ఆఫీస్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైందని చెప్పారు. ఇది ఇండో - ఆస్ట్రేలియన్ చరిత్రలో మరోక మైలు రాయిగా చెప్పుకోవచ్చు అన్నారు. మొట్ట మొదట 2017లో, మెల్బోర్న్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థులకు చేయుతనివ్వటానికి దీన్ని ప్రారంభించారని.. క్రమక్రమంగా పరిచయాలు పెంచుకుంటూ, కలిసికట్టుగా పనిచేస్తూ, సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, "మేము" అనే పద్ధతిలో కాకుండా "మనము" అనే తీరులో అందరితో కలుపుగోలుగా పైకి ఎదుగుతూ ఇది వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా రకరకాల రంగాల నుంచి వచ్చే కళాకారులకు, రచయితలకు, వ్యవస్థాపకులకు, వారి విజయానికి తోడ్పడటానికి మెల్బోర్న్ మామ ప్రారంభించారన్నారు. కలిసికట్టుగా కృషి చేసి, అందరికీ చేయూతనిస్తూ ఒక మిలియన్ - డాలర్ సంస్థల దిశలోఎదగాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నదని.. ప్రతీ ఒక్కరి కళలను సకారం చేసే మార్గంలో ప్రయాణం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోసాని పవన్ స్కయ్ ఆనంద్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.







గుడ్ ఫ్రైడే సందర్భంగా గన్‌ఫౌండ్రీలోని సెయింట్ జోసెఫ్ చర్చిలో ఏసు ప్రభువు జీవితం పై ఏర్పాటు చేసిన ప్రదర్శనకు క్రైస్తవులు భారీగా హాజరయ్యారు.

డైమండ్ రింగ్స్ దొంగతనం

నవతెలంగాణ - బంజారాహిల్స్

ప్రముఖ వ్యాపారవేత్త నివాసంలో డైమండ్ రింగ్స్ దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్ నెం 12లో నివాసం ఉండే వ్యాపారవేత్త యష్‌లల్వానీ అగార్వాల్ ఇంట్లో మూడేండ్లుగా బీహార్‌కు చెందిన సాహెబ్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు పనిచేస్తున్నారు. ఇటీవల యష్ లల్వానీ తల్లికి చెందిన 3 వజ్రపు ఉంగరాల జతలు ఓ గదిలోని బీరువాలో పెట్టారు. పదిరోజుల తర్వాత చూడగా ఆ ఉంగరాలు కనిపించలేదు. సీసీ పుటేజీలను పరిశీలించగ పనిమనిషి సాహెబ్ కుమార్ ఆ గదిలోకి వెళ్లినట్టు గుర్తించారు. అతడిని ప్రశ్నించినా లాభం లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

బావి మోటార్లు దొంగిలిస్తున్న ముఠా అరెస్టు



నవతెలంగాణ-శామీర్ పేట:

శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ బావుల వద్ద ఊరి చివర కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లల్లో కరెంట్ వైర్లు, బోర్ మోటార్లు , ఇత్తడి ట్యాప్స్, టి.వి లు , గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ స్టవ్లు, వాహనాల బ్యాటరీలు, తరచుగా దొంగతనాలు అవుతుండడంతో శామీర్ పేట పోలీసులు ప్రత్యేకంగా వాటిపై దృష్టి సారించారు. ఈ మేరకు గస్తీ నిర్వహిస్తుండగా శుక్రవారం ఉప్పరపల్లి గ్రామ శివారిలోని ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్డు పైన ఒక ఆటో లో కొంతమంది వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా శామీర్ పేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారిని పట్టుకొని విచారించారు. దాంతో షేక్ ఖాదర్, షేక్ కయ్యుమ్, .షేక్ నయీమ్, షేక్ మహమ్మద్, షేక్ రహమాన్ అనే అయిదుగురు యువకులు నిర్మల్ జిల్లా వాసులమని కూలి పని చేసి జీవనం సాగిస్తున్నామని అయితే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 18 దొంగతనాలు చేసినట్టు అందులో శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 6 చోట్ల దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. మరలా శుక్రవారం రోజున కూడా దొంగతనం చేయడానికి వచ్చినట్టు చెప్పారని అయితే వారి వద్ద నుండి దొంగతనాలకు ఉపయోగించిన బజాజ్ ప్యాసింజర్ ఆటో, దొంగతనాలు చేయుటకు మెకానిక్ పని చేసే పనిముట్లు, గొడ్డలి, పార, ఆక్సర్ బ్లెడ్, కత్తి, తదితర ఆయుధాలు ఉపయోగించే వారమని ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు. కాగా ఈ దొంగల ముఠా ఎవరూ లేని ప్రదేశాలలో, ఊరి చివర్లో ఉన్న వ్యవసాయ బావు ల వద్ద మోటార్ వైర్లు, బోర్లను, ఆపి ఉంచిన వాహనాల బాటరీలను, కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లలోని, ఎలెక్ట్రికల్, ప్లంబింగ్ వస్తువులు, గుడులలోని హుండీలను దొంగలించి వాటిని స్క్రాప్ లో అమ్ముకొని వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారని శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ నర్సింహ రాజు తెలిపారు. ఈ ముఠా ను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యహరించిన సిబ్బందిని ఎస్ హెచ్ ఓ అభినందించారు.









గుడ్ ఫ్రైడే సందర్భంగా నగరంలోని చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. గన్‌ఫౌండ్రీలోని సెయింట్ జోసెఫ్ చర్చిలో ఏసు ప్రభువు జీవితం పై ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శనివారం సాయంత్రం: 6.35గం.
సహార్ : ఆదివారం ఉదయం: 4.49గం.

మెపా తెలంగాణ మంచిర్యాల జిల్లా కన్వీనర్‌గా పులిదాసరి నరేష్ ముదిరాజ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మెపా కేంద్ర కార్యాలయంలో జరిగిన మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శుక్రవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం, చింతగూడ గ్రామానికి చెందిన పులిదాసరి నరేష్ ముదిరాజ్ ను మెపా తెలంగాణ మంచిర్యాల జిల్లా కన్వీనర్ గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు డా.బోయినీ జగన్ మోహన్ ముదిరాజ్ లు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు . ఈ సందర్భంగా నరేష్ ముదిరాజ్ మాట్లాడుతూ జాతి అభివృద్ధి ఐక్యత కోసం అందరినీ కలుపుకుని ముందుకు వెళతామని అలాగే ముదిరాజ్ ల రిజర్వేషన్ సాధన కోసం కలిసి కట్టుగా కృషి చేస్తానని, అందుకోసం ఐక్య ఉద్యమాలు చేస్తామన్నారు. మెపా అభివృద్ధి కోసం అలాగే ముదిరాజ్ జాతి ఐక్యత కోసం మంచిర్యాల జిల్లాలో కలిసి ముందుకు వెళతానన్నారు. నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర కమిటీ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి సంజీవన్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-ముషీరాబాద్

ముస్లిం సోదరులకు నాయకులు సాయిబాబా చారి, శ్రీకాంత్ చారి ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి చేసి చూపిస్తా..



- బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-ధూల్‌పేట్

హైదరాబాద్ పార్లమెంట్ అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పార్లమెంట్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ని నియమించిన సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో దర్శించుకుని పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 17 పార్లమెంట్ స్థానాలలో 15 స్థానాలు బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్నేళ్లుగా హైదరాబాద్ పార్లమెంట్ ఇప్పటికీ అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిస్తే ఏ విధమైన అభివృద్ధి ఉంటుందో చేసి చూపిస్తామన్నారు.

'గెస్ట్ లెక్చరర్లకు ఆటో రెన్యువల్‌తో సర్వీస్ కంటిన్యూ చేయాలి'



- రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న 1,600 మంది గెస్ట్ లెక్చరర్లకు ఆటో రెన్యువల్ తో సర్వీస్ ను కంటిన్యూ చేయాలని, పీరియడ్ విధానాన్ని రద్దు చేసి 12 నెలలకు కన్సాలిడేటెడ్ వేతనం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.కొర్ర ఈశ్వర్ లాల్, కో-ఆర్డినేటర్ డా. బుచ్చిపాల్‌రెడ్డి, కోశాధికారి పి.నరేష్ తదితరులు మాట్లాడు తూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తమ డిమాండ్లను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.50 వేలు వేతనంతో పాటు 12 నెలలకు కన్సాలిడేట్ అమలు చేయాలని, డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీ లను కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, పీటీఎల్, ఎంటీఎస్‌లుగా కన్వర్ట్ చేయాలని, ట్రాన్సర్, ప్రమోషన్ తో డిస్టర్బ్ అయినా గెస్ట్ ఫ్యాకల్టీలను రీ లోకేట్ చేయాలని, ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, గెస్ట్ లెక్చర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ అమలు చేయాలని వారు కోరారు. ప్రస్తుతం గెస్ట్ లెక్చరర్ల పరిస్థితి ఘోరంగా ఉందని, కనీస వేతనానికి నోచుకోక వెట్టి చాకిరికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు.తమ విషయంలో సీఎం ఎ.రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హఫీజ్ ఖజా, రాకేష్ రెడ్డి, ప్రభాకర్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలు భవిష్యత్ దర్శనం చేయాలి

- ఆచార్య కొలకలూరి ఇనాక్



నవతెలంగాణ-కల్చరల్

సాహితీవేత్తలు వర్ధమాన సంఘటనల పై స్పందిచట మే కాక భవిష్యత్తు దర్శనం చేసి రచనలు చేయాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాల యం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మనిషిలో దైవత్వాన్ని చూడటమే తన సాహితీ ప్రక్రియల లక్షణమని చెప్పారు. శ్రీ త్యాగ రాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై ఆచార్య కొలకలూరి మధు జ్యోతి రచించిన ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్య సృష్టి దృష్టి గ్రంథ ఆవిష్కరణ సభ గాన సభ నిర్వహణలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తన సాహితీ సేద్యం కథ వ్యాసం నాటకం అనువాదం కవిత్వం నవల విమర్శ ఇలా ఏడు ప్రక్రియలుగా సాగిందన్నారు. మధు జ్యోతి ఏడు ప్రక్రియలు పై లోతైన అధ్యాయం చేసి పరిశోధనకు సరిపడా విశ్లేషణ తన గ్రంథంలో చేశారని అభినందించారు. ప్రజాస్వామ్యం అనే సంపుటిలో తాను తక్కువ శాతం వచ్చిన పార్టీ అధిక శాతం ప్రజలను పాలిం చటంపై రాశానని తెలిపారు. నేడు ఎన్నికలలో కొన్ని మార్పు లు ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్ళి ఓటు హక్కు విని యోగించుకోలేని వారికి కూడా ఓటు హక్కు ఉపయోగించు కొనే విధానం వచ్చిందని ఇందువల్ల అధిక శాతం ఓటింగ్ నమోదయ్యే అవకాశం కలిగిందన్నారు. గ్రంథ రచయిత మధు జ్యోతి మాట్లాడుతూ ఇనాక్ సాహిత్యం సమస్తం ప్రేమ తత్వం తో ముడి పడి ఉంటుందని, వేరు వేరు సందర్భాలలో వేరు వేరు గా ఆ భావాలు వ్యక్తమవుతాయని వివరించారు. స్త్రీ హక్కులు స్వేచ గురించి ఎవరూ మాట్లాడని రోజుల్లో 50 దశాబ్దాల క్రితమే ఇనాక్ తన సాహిత్యంలో వాటి గురించి ప్రస్తావన చేశారని మధు జ్యోతి గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో చక్రపాణి, గుండవరపు గీతా దేవి ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని బోలక్‌పూర్ డివిజన్‌లోని ముస్లిం సోదరులు సయ్యద్ జాఫర్ హుస్సేన్, అలమేందర్ అబ్బాస్, ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో పద్మారావు గౌడ్, ముఠా గోపాల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ప్రత్యేక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ మతసామర స్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కులమత బేధాలు లేకుండా ముస్లింలు హిందువులు అందరూ కలుపుకుని జరుపుకునే పండుగ రంజాన్ అని అన్నారు. ఇఫ్తార్ విందులు మను షుల మధ్య దూరాన్ని తగ్గించి స్నేహ బంధాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఎం ఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, భోలక్ పూర్ డివిజన్ ప్రెసిడెంట్ వై.శ్రీనివాస్, ముషీరాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొహమ్మద్ అలీ, అజయ్ ముదిరాజ్, శ్రీధర్ చారి, ముక్తా రుసేన్, శివ ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, ఎయిర్టెల్ రాజు, ఫిరోజ్ ఖాన్, రజనీకాంత్, వహీద్ అలీ, యజా హుస్సేన్, ముబారక్, సదా, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

'రంజాన్ ఉపవాసాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం'

నవతెలంగాణ-ధూల్‌పేట్

రమజాన్ ఉపవాసాలతో వ్యక్తిత్వ వికాసం రంజాన్ ఉపవాసాలు శారీరక, ఆధ్యాత్మిక ప్రయోజనాలనే కాక వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని జమాఅతె ఇస్లామీ హింద్ సీనియర్ నాయకులు మౌలానా హామిద్ ముహమ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) ఆధ్వర్యంలో మీడియా ప్లస్ ఆడిటోరియంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. అల్లాహ్ చూస్తున్నాడనే భావనతో ధర్మనిష్ఠతో పాటించే ఉప వాసాలు నైతిక మార్పును తీసుకువస్తాయని, ఈ భావన



వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ రాష్ట్ర నాయకులు ఫరాజ్, హమ్మాద్, హుజైఫా ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల పరిశీలన సర్వే



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బొగ్గులకుంట జలమండలి పరిధిలోని వర్షపునీటినీ సేవ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల సర్వే నిర్వహిస్తున్నామని బొగ్గులకుంట జలమండలి మేనేజర్ మధు సూదనా చారి తెలిపారు. శుక్రవారం బొగ్గులకుంటలోని జలమండలి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బొగ్గులకుంట జలమండలి పరిధిలోని కింగ్ కోఠి ఆసుపత్రి, తెలంగాణ సారసత పరిషత్, కోఠి ఉమెన్స్ కళాశాల, బొగ్గులకుంట జలమండలి ప్రాంగణం తదితర ప్రాంతాల్లో ఇంకుడు గుంతల సర్వే నిర్వహించామన్నారు. వాటి స్థితి గతులను పరిశీలించామన్నారు. ప్రజలకు మంచినీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు త్రాగునీరు అందిస్తున్నామన్నారు. ప్రజలు నీరును వృధా చేయవద్దని సూచించారు. ప్రజలకు మంచినీరు అవసరమయ్యేవారు జలమండలి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.

అధ్యక్షులుగా రాజవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనాథ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మెట్రో పాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోకుల, సి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సి.వి. శ్రీనాథ్, జాయింట్ సెక్రటరీగా ఎం. రమేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తూ తెగదెంపులు

- సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల తీర్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

2013లో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీగా ఏర్పడిన మేము చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తూ, ఆయనతో నిర్మాణపరంగా తెగదెంపులు చేసుకుంటున్నామని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల తీర్మానం చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యానగర్ లోని చంద్రపుల్లారెడ్డి భవన్‌లో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చిట్టి పాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు, వి.సంధ్య, గోవర్ధన్, మామిడాల బిక్షపతి, జి.అనురాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మార్చి 24న తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ నాయకుల సమావేశంలో సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న చంద్రన్న నాయకత్వాన్ని తిరస్కరిస్తూ ఆయనతో తెగదెంపులు చేసుకుంటున్నామని తీర్మానం చేశామన్నారు. సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న చంద్రన్న తన సుదీర్ఘ విప్లవకర జీవితం నుండి వైదొలిగి వ్యవహరిస్తూ గుంటూరులో కామ్రేడ్ నాదెండ్ల బ్రహ్మయ్య దారుణ అమానుష హత్యయిందుకు పరాకాష్టగా చేరిందని తెలిపారు. సంస్థ ప్రతిష్టకు, పద్ధతులకు, నియమాలకు, క్రమశిక్షణకు భిన్నంగా వ్యవహరించడమే కాకుండా విప్లవేతర, పార్టీయేతర కార్యకలాపాల వైపు చంద్రన్న దృష్టి సారిస్తున్నారన్నారు .విప్లవ జీవితానికి భిన్నంగా వ్యవహరించడం ఆయనకు, పార్టీకి, విప్లవోద్యమానికి ఎంతో నష్టం కలుగజేసిందని అభిప్రాయపడి తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఒక్కరు మినహా సభ్యులందరూ నాదెండ్ల బ్రహ్మయ్య అత్యంత తీవ్రంగా ఖండిస్తూ చంద్రన్న నాయకత్వంతో తెగదెంపుల తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. ఇప్పటి వరకు సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీగా కొనసాగిన మేము, ఇంక ముందు కూడా అదే పేరుతో కొనసాగుతామని స్పష్టం చేశారు. విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరుల ఆశయ పరిపూర్తి కోసం, వారు చూపిన త్యాగాల బాటలో, ప్రత్యేకించి ప్రతిఘటనా పోరాట మార్గంలోనే మునుముందుకు సాగుతామని తెలిపారు.



తెలుగుదేశం పార్టీ ఆవిర్భవ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు భాను ప్రకాష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎడెల్లి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

'గణితంలో ఖాసీం ఆలీకి డాక్టరేట్'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గణితంలో 'న్యూమరికల్ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్ ఇన్ కౌట్ ఫ్లో' అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత వ్యాసా నికి ఖాసీం ఆలీకి జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖాసీం ఆలీకి నవాబ్ షా ఆలమ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ సత్తార్, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ శుభాకాంక్షలు తెలిపారు.

31న వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల వివాహ పరిచయ వేదిక

- విశ్వ లింగాయత్ ట్రస్ట్ చైర్మెన్ పసారం శ్రీనివాస్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వరుల వధూవరుల వివాహ పరిచయ వేదిక ఈ నెల 31న మలక్ పేట, మూసారంబాగ్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు విశ్వ లింగాయత్ ట్రస్ట్ చైర్మెన్ పసారం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వివాహ పరిచయ వేదికను గత 20 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వివాహం కావలసిన వీరశైవ లింగాయత్ జంగమ మహేశ్వర వధూవరులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు పరిచయ వేదిక ఉంటుందన్నారు. డాక్టర్లు, ఇంజనీర్స్, పీజీ, విదేశీ సంబంధాలు అన్వేషించే వారికి మాత్రమే ఈ ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివాహం కావలసిన వారి తల్లి దండ్రులతో ఈ వివాహ పరిచయ వేదికలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు www.vishwalingayatmarriage.com, 9440059842, 9246359842 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరని కోరారు.



వాములో ఎన్నో ఔషధ గుణాలు..

వంటింట్లో ఉండే వాములో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అజీర్తి సమస్యను దూరం చేయటంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. అన్నం అరగకపోవడం, నిద్రలేమి, నీరసం, బిపి, మలబద్ధకం వంటి సమస్యలు వాము ద్వారా దూరం చేసుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. వామును రోజూ ఆహారంలో తీసుకోవటం ద్వారా శరీరం తేలికగా ఉంటుంది. పిల్లల ఆహారంలో దీనిని వాడటం ద్వారా కడుపులో నులిపురుగులు పెరగవు. పేగుల్లో, జీర్ణాశయంలో వచ్చే సమస్యలు దూరమవుతాయి. విరేచనానికి ఇబ్బంది పడేవారు వాము కషాయాన్ని, ఆకును వాడటం మంచిది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు కాసింత నోట్లో వేసుకుని పడుకోవాలని పెద్దలు సూచిస్తుంటారు. ఎందుకంటే శరీరంలో పేరుకుపోయిన అనవసర కొవ్వును వాము కరిగిస్తుంది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కల్గిస్తుంది.

వాము, మిరియాలు వేర్వేరుగా వేయించి కొద్దిగా నీరు కలిపి నూరి, వడకట్టి పిల్లలకు తాగిస్తే అజీర్తి, విరేచనాలు, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. వేడి అన్నంపై కొద్దిగా వాము పొడిని, కొద్దిగా మిరియాల పొడిని తగినంత ఉప్పు వేసి కలిపి తీసుకుంటే అజీర్తిని దూరం చేస్తుంది. కషాయంగా తీసుకోవడటం ద్వారా మూత్రపిండాల్లో రాళ్లు కరుగుతాయి. తేనెతో కలిపిగానీ, పొడిగానీ తీసుకోవటం వల్ల మహిళల్లో నెలసరి సమస్యలు తగ్గుతాయి. నిప్పులపై వాము వేసి ఆ పొగ పీల్చితే జలుబు, ముక్కుదిబ్బడ తగ్గుతాయి. లోపల పేరుకున్న కఫం పడిపోతుంది. వాము ఆకును కూరగా చేసుకుని తింటే శ్లేష్మం నివారణ అవుతుంది. వాము, ఉప్పు, మిరియాలు కలిపి నూరి పరగడుపున తింటే రక్తహీనత నయమవుతుంది. శీతాకాలంలో ఎదుర య్యే జీర్ణ, శ్వాస సమస్యలకు, శరీర నొప్పులకు వాము బాగా పనికొస్తుంది.

ఇట్లు



బెండకాయలు తాజాగా ఉండాలంటే రెండువైపులా తొడిమెలు తీసేసి ప్లాస్టిక్ కవర్‌లో వేసి ఫ్రిజ్లో ఉంచాలి.



అప్పడాలను వేయించే ముందు పది నిమిషాలు ఎండలో పెడితే నూనె ఎక్కువ లాగకుండా ఉంటాయి.



భార్యా భర్తల మధ్య కమ్యూనికేషన్ లేకపోతే ఆ బంధంలో ఎలాంటి మాధుర్యం ఉండదు. ఏదో కలిసి ఉన్నామా అంటే ఉన్నాము అన్నట్టు ఉంటుంది. ఆరోగ్యకరమైన కమ్యూనికేషన్ ఏ బంధమైనా బలపడేందుకు ముఖ్య పాత్ర పోషిస్తుంది. అది లేకపోతే అపార్థాలు పెరిగిపోయి, బంధాల మధ్య కోపం, అహం మొదలవుతుంది. ఒకరితో ఒకరు మాట్లాడుకుంటే ఒకరి నుండి మరొకరు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోగలుగుతారు. ఎవరైనా సరే వారు ఆశించినది అందనప్పుడు కచ్చితంగా కుంగిపోతారు. అక్కడి నుండే గొడవలు మొదలవుతాయి. చాలా జంటలు సీరియస్ విషయాలను కూడా బాగా అర్థం చేసుకుంటారు. కానీ చిన్న చిన్న విషయాలకు మాత్రం గొడవలు పడుతుంటారు. ఎందుకంటే ఆ విషయాలే వారి మనసును బాధిస్తాయి. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో చదువుదాం...

మనసు విప్పి మాట్లాడుకోండి

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అనితకు 35 ఏండ్లు ఉంటాయి. పెండ్లయి 10 ఏండ్లు అవుతుంది. ఒక పాప ఉంది. భర్త విజయ్ ఆమెకన్నా పదేండ్లు పెద్దవాడు. వీరితో పాటు ఇంట్లో అత్త కూడా ఉంటుంది. పాప స్కూల్‌కి వెళుతుంది. అనిత ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. అంతా బాగానే ఉంది కదా అనుకుంటున్నారా! వాళ్ళ అత్తయ్యతో కూడా ఆమెకు పెద్ద సమస్యలేమీ లేవు. అత్తతో చిన్న చిన్న గొడవలు వచ్చినా వాటి గురించి అనిత పెద్దగా పట్టించుకోదు. మరి సమస్య ఏంటీ అంటున్నారా? భర్త ఆమెతో రోజులో కనీసం 5 నిమిషాలు కూడా మాట్లాడడు. ఇంటికి రాగానే టీవీ లేదా ఫోన్ చూస్తూ కూర్చుంటాడు.

ఆరోగ్యం బాగాకపోయినా ఆమె దగ్గర కూర్చొని పరామర్శించడు. కాస్త జ్వరం వచ్చిందంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళతాడు. కానీ ఆమెతో మాత్రం ఉండడు. 'మందులు వేసుకున్నావుగా తగ్గిపోతుందిలే' అంటాడు తప్ప ఆమె కోసం కాసేపు కూడా ఇంట్లో ఉండడు. ఫంక్షన్‌కి వెళ్ళాలన్నా, పెండిండ్లు ఉన్నా వాళ్ళ స్నేహితుల దగ్గరకు వెళ్ళాలన్నా అప్పటికప్పుడు చెప్పి హడావుడిగా రెడీ చేసి తీసుకెళతాడు. ముందే సమాచారం ఇవ్వడు.

'బయటకు వెళ్ళాలని ముందే చెబితే ఆఫీస్‌లో పని త్వరగా ముగించుకొని రావడం, పర్మిషన్ తీసుకోవడం లేదా లీవ్ తీసుకోవడమో చేస్తాను. సడన్‌గా చెప్తే ఆఫీస్‌లో ఊరుకోరు. పోనీ నేను రాను మీరు వెళ్ళండి అంటే ఒప్పుకోడు. దీని వల్ల చాలా ఇబ్బందిగా ఉంటుంది. పైగా నీకు నాకంటే ఆఫీసే ఎక్కువయింది అంటారు. ఉద్యోగం చేస్తున్నప్పుడు దానికి న్యాయం చేయాలి కదా! అనేది నా విధానం. అసలు నన్ను ఓ మనిషిగానే చూడడు. ఓ యంత్రంలా భావిస్తాడు. నైట్ అయినా నాతో కాసేపు గడుపుతారు అంటే అదీ లేదు. 'నువ్వు వెళ్ళి పడుకోపో నేను తర్వాత వస్తాను' అంటారు. ఆఫీస్ వర్క్‌లో ఏమైనా బీజీగా ఉన్నారా అంటే అదీ లేదు. ఎప్పుడూ టీవీ చూస్తూనో, ఫోన్ చూస్తూనో గడుపుతారు. ఆయనకు అవసరమైనప్పుడు మాత్రం దగ్గరకు తీసుకుంటాడు. నాకు ఇష్టమో లేదో కూడా పట్టించుకోడు. నేను కూడా ఓ మనిషినే కదా. నా ఇష్టంతో ఏ మాత్రం సంబంధం లేకుండా ప్రవర్తిస్తారు.

నేనేమైనా అవసరం ఉండి పని చెప్తే పట్టించుకోడు. నన్ను నా భర్త ఓ వస్తువుగా చూస్తున్నారు. అలా అని ఆయనకు ప్రేమా లేదా అంటే ఉంది. కానీ దాన్ని నాతో సరిగ్గా చెప్పడం లేదు. నాతో మాట్లాడడు. అంతెందుకు ఆయనకు సంబంధించిన ఏ విషయం నాకు తెలియదు. పెండ్లి జరిగి 10 ఏండ్లు అవుతుంది. కానీ విజయ్‌కు ఎంత జీతం వస్తుందో, ఎన్ని అప్పులు ఉన్నాయో కూడా తెలియదు. ఎంత సేవింగ్ ఉందో, భవిష్యత్ ఎలా ఉంటుంది. అసలు మా పరిస్థితి ఏంటో నాకేం అర్థం కావడం లేదు' అంటూ అనిత కన్నీరు పెట్టుకుంది.

> పెండ్లి జరిగి 10 ఏండ్లు అవుతుంది. కానీ విజయ్‌కు ఎంత జీతం వస్తుందో, ఎన్ని అప్పులు ఉన్నాయో కూడా తెలియదు. ఎంత సేవింగ్ ఉందో, భవిష్యత్ ఎలా ఉంటుంది. అసలు మా పరిస్థితి ఏంటో నాకేం అర్థం కావడం లేదు' అంటూ అనిత కన్నీరు పెట్టుకుంది.

అనిత బాధంతా విన్న తర్వాత మేము విజయ్‌ను పిలిపించి మాట్లాడితే 'అనితతో మాట్లాడటానికి ప్రత్యేకంగా ఏం ఉంటుంది. ఆమె ఉద్యోగం చేస్తుంది. కాబట్టి నా దగ్గర డబ్బులు కూడా తీసుకోదు. ఆమెకేం కావాలో ఆమే కొనుక్కుంటుంది. దానికి నా అవసరం ఏమీ లేదు. ఇక పెండిండ్లు, ఫంక్షన్లు అంటే ఆమెకు ముందే తెలుసు కదా! ఆ రోజు వెళ్ళాలి అనే విషయం నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఏముంది. ఆఫీస్ నుండి రాగానే ఇంట్లో పనులు చేసుకుంటూ ఉంటుంది. నాకేం కావాలో అడక్క ముందే నాకు ఇస్తుంది. టీ ఇవ్వు అని కూడా అడగాల్సిన అవసరం లేదు. ముందే తెచ్చి నా చేతికిస్తుంది. తన పని తాను చేసుకొని పడుకుంటుంది. నువ్వెందుకు నాకంటే ముందే పడుకుంటున్నావు అని కూడా నేను అడగను. ఆమెకు ఎలా నచ్చితే అలా ఉండనిస్తాను. ఆమె నిర్ణయాలను గౌరవిస్తాను. ఆరోగ్యం బాగోకపోతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళతాను. వంట చేయలేకపోతే బయట నుండి తెచ్చి పెడతాను. ఇక నాకు నచ్చినప్పుడు తనతో గడుపుతాను. దానికి కూడా ఆమె పర్మిషన్ తీసుకోవాలా! తను నా భార్యే కదా! నా భార్యా నా ఇష్టం. నేను ఎప్పుడూ ఆమెను తిట్టలేదు, కొట్టలేదు' అంటూ చెప్పుకొచ్చాడు.

విజయ్ చెప్పింది మొత్తం విన్న తర్వాత 'ఏ బంధమైనా బలంగా ఉండాలంటే మనసు విప్పి మాట్లాడుకోవాలి. ముఖ్యంగా భార్యా భర్తల్లో ఇది చాలా ముఖ్యం. ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకోవాలి. ఒకరి ఇష్టాలు ఒకరు తెలుసుకోవాలి. అవి తెలియాలంటే ముందు ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలి. అది మీ మధ్య జరగడం లేదు. ఫంక్షన్‌కి వెళ్ళాలంటే ఏ టైంకి వెళ్ళాలి, ఎలా వెళ్ళాలి ముందే మాట్లాడుకోవాలి. ఆమె కూడా ఉద్యోగం చేస్తుంది కదా! తనూ పర్మిషన్ తీసుకోవాలి. ఆరోగ్యం బాగోకపోతే వెంటనే ఆస్పత్రికి తీసుకెళతా అంటున్నారు. అదొక్కటే సరిపోదు ఆమెతో కాసేపు మాట్లాడాలి. నా భర్త నాతో ఉన్నాడు అనే భరోసా ఆమెకు మానసిక శక్తిని ఇస్తుంది. అది ఆమెకు మరింత బలాన్ని ఇస్తుంది. అది కూడా ఓ మెడిసెన్ లాంటిదే అని గుర్తించండి. అనిత మీ నుండి ఏం కోరుకుంటుందో ముందు తెలుసుకోండి. ఆమె కోసం కాస్త సమయం కేటాయించండి.

> ఏ బంధమైనా బలంగా ఉండాలంటే మనసు విప్పి మాట్లాడుకోవాలి. ముఖ్యంగా భార్యా భర్తల్లో ఇది చాలా ముఖ్యం. ఒకరి అభిప్రాయాలు ఒకరు పంచుకోవాలి. ఒకరి ఇష్టాలు ఒకరు తెలుసుకోవాలి. అవి తెలియాలంటే ముందు ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలి.

నా భార్య నా ఇష్టం అంటున్నారు. ఆమే ఓ మనిషే కదా. తనకూ ఫీలింగ్స్ ఉంటాయి కదా! అవి మీరు పట్టించుకోవడం లేదు. ఆమె మనసుకు నచ్చనప్పుడు మీరు ఆమెతో గడిపినా దాని వల్ల ఉపయోగం ఉండదు. ముందు ఆమె మనసేంటో తెలుసుకోండి. అప్పుడు మీ ఇద్దరూ ఆనందంగా ఉండొచ్చు' అన్నాము. దానికి అతను 'మీరు చెప్తుంటే నిజమే అనిపిస్తుంది. ఇన్ని రోజులు నేను అనిత మనసు సరిగ్గా అర్థం చేసుకోలేదు. నా భార్యే కదా ఏలాగైనా ఉండొచ్చు అనుకున్నాను. నాది పొరపాటే. ఇప్పటి నుండి కచ్చితంగా తనతో సమయం గడుపుతాను. మీరు చెప్పినట్టు నడుచుకుంటాను' అని చెప్పి అనితను తీసుకొని వెళ్ళిపోయాడు.

- వై వరలక్ష్మి
9948794051

పోటీకి సై

పాట్నా : రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీహార్‌లోని 40 సీట్లకు గానూ 'ఇండియా' (మహాఘట్‌బంధన్) కూటమి సీట్ల పంపకాన్ని పూర్తి చేసింది. ఇందులో భాగంగా రాష్ట్రం వరకు కూటమిలో అతిపెద్ద భాగస్వామి అయిన ఆర్జేడీ 26 లోక్‌సభ సీట్లలో పోటీ చేయనున్నది. ఇందులో పూర్నియా, హాజీపూర్ సీట్లు కూడా ఉన్నాయి. కిషన్‌గంజ్, పాట్నా సాహిబ్‌లతో సహా మొత్తం తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ తన అభ్యర్థులను బరిలో నిలబెట్టనున్నది. మిగిలిన ఐదు సీట్లలో వామపక్షాలు పోటీలో ఉండనున్నాయి.

ఆసక్తిగా మారిన పూర్నియా సీటు

జేడీయూ సిట్టింగ్ స్థానాలైన పూర్నియా, కటిహార్‌లలో పోటీ చేసే విషయమై ఆర్జేడీ, కాంగ్రెస్‌ల మధ్య ప్రతిష్టంభన నెలకొన్నా.. చివరకు అది సజావుగానే ముగిసింది. పూర్నియాను ఆర్జేడీకి కాంగ్రెస్ వదులుకున్నది. కాగా, పూర్నియా నుంచి పోటీ చేసే విషయమై ఇటీవలే కాంగ్రెస్‌లో తన పార్టీ జన్ అధికారి పార్టీ (జేఏపీ)ని విలీనం చేసిన పప్పు యాదవ్ పంతంతో ఉన్నారు. ఆయన ఆ సీటును వదులుకోవటానికి సిద్ధంగా కనిపించటం లేదు. పూర్నియా సీటుపై రాహుల్, ప్రియాంకల నుంచి తనకు హామీ ఉన్నదని పప్పు యాదవ్ చెప్పుకుంటూ వచ్చారు. అయితే, కాంగ్రెస్ ఇప్పుడు ఆ సీటును ఆర్జేడీకి వదిలివేయటంతో పప్పుయాదవ్ తదుపరి అడుగు ఎటువైపు పడనున్నదనేది రాజకీయంగా చర్చనీయాంశమైంది.

కాంగ్రెస్, కమ్యూనిస్టుల సీట్లు ఇవే

కతిహార్, కిషన్‌గంజ్, పాట్నాసాహిబ్, సాసారమ్, భాగల్‌పూర్, వెస్ట్ చంపారన్, ముజఫర్‌పూర్, సమస్తిపూర్, మహారాజ్‌గంజ్ సీట్లలో కాంగ్రెస్ పోటీ చేయనున్నది. బెగుసరాయ్, ఖగారియా, ఆర్హ్, కరకట్, నలంద స్థానాల్లో లెఫ్ట్ పార్టీలు పోటీకి దిగనున్నాయి. 26 సీట్లలో ఆర్జేడీ పోటీ చేయనున్నది. ఎన్డీయేలోని భాగస్వామ్య పక్షాలకు కూడా సీట్ల పంపకాలు ఇప్పటికే జరిగాయి. బీజేపీ 17, జేడీయూ 16, జీతన్‌రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ ఆవామ్ మోర్చా (హెచ్ఏఎం) 1, రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ (ఆర్ఎల్ఎస్‌పీ) 1, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (ఎల్జేపీ) మిగిలిన ఐదు స్థానాల్లో పోటీకి తమ అభ్యర్థులను నిలబెట్టనున్నాయి. బీహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19 నుంచి మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి.

గత ఎన్నికల ఫలితాలు ఇలా..

2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానంలోనే విజయం సాధించింది. ఆర్జేడీ ఖాతా తెరవలేదు. బీజేపీ 17, జేడీయూ 16 సీట్లను గెలుచుకున్నాయి. బీజేపీకి దక్కిన ఓటింగ్ శాతం 24.1 కాగా, జేడీయూ 22.3 శాతం ఓట్లను పొందింది. అవిభాజ్య ఎల్జేపీ ఆరు ఎంపీ సీట్లతో 8 శాతం ఓట్లను కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ 7.9 శాతం ఓట్లను మాత్రమే పొందింది. నితీశ్ జేడీయూ తిరిగి ఎన్డీయే కూటమిలోకి చేరటంతో రాష్ట్రంలో ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఇటు కేంద్రంలోని మోడీ సర్కారు మహాఘట్‌బంధన్‌ను విడగొట్టిన తీరునూ అక్కడి ప్రజలు గమనించారనీ, ఈ విషయం అక్కడి ఓటర్లపై ప్రభావం చూపనున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలు కూడా 'ఇండియా' కూటమికి రాబోయే ఎన్నికల్లో బలాన్ని చేకూర్చనున్నాయని చెప్తున్నారు.

మ్యాప్‌లో కనిపించని 'సంఘా' అసెంబ్లీ నియోజకవర్గం

గ్యాంగ్‌టక్ : హిమాలయ సానువుల్లో వున్న సిక్కిం రాష్ట్రం అనేక రకాలైన విశిష్టతలను కలిగి వుంది. మొదటి ఆర్గానిక్ రాష్ట్రం లేదా సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన ఘనత కలిగిన రాష్ట్రం లేదా రెఫరెండం ద్వారా భారతదేశంలోకి అనుసంధానించబడిన మొదటి ప్రాంతంగా పేరొందింది. అలాగే భౌగోళిక సరిహద్దులు లేని, అసలు మ్యాప్‌ల్లో కనిపించని ఒక నియోజకవర్గం కలిగిన ఏకైక రాష్ట్రంగా కూడా సిక్కిం పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. సిక్కిం అసెంబ్లీలోని 32 నియోజకవర్గాల్లో సంఘా ఒకటి. కానీ ఇది మ్యాప్‌లో కనిపించదు. ఈ వర్చువల్ నియోజకవర్గంలో పోటీదారులు, ఓటర్లు అందరూ బౌద్ధులు, సన్యాసులు, నన్‌లే వుంటారు. సన్యాసుల కమ్యూనిటీ అయిన సంఘాస్‌కు మాత్రమే రిజర్వ్ చేయబడిన ఏకైక నియోజకవర్గం దేశంలో ఇదొక్కటే. మొత్తంగా 2,881 మంది సంఘా ఓటర్లు వుంటారు. వీరిలో సన్యాసులు, నన్‌లు వుంటారని సిక్కిం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వెబ్‌సైట్ పేర్కొంది. సంఘా విశిష్ట గుర్తింపును పరిరక్షించేందుకు గానూ కేవలం గుర్తింపు పొందిన మోనాస్టరీల్లో నమోదు చేసుకున్న సన్యాసులు, నన్‌లు మాత్రమే ఇక్కడ నుండి పోటీ చేయాలి.

అన్సారీ మృతికి వారం ముందే...

లక్నో : యూపీలో దోషిగా తేలిన మాజీ ఎమ్మెల్యే ముఖ్తార్ అన్సారీ అనుమానాస్పద మృతి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఆయన గుండెపోటుతో చనిపోయినట్టు వార్తలు వచ్చిన విషయం విదితమే. అయితే, ముఖ్తార్ అన్సారీ మృతిపై ఆయన కుటుంబీకులు కూడా అనుమానాలు, ఆరోపణలు వ్యక్తం చేశారు. దీంతో ఆయన మృతిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కడుపు నొప్పితో ఆస్పత్రిలో చేరి ఆ తర్వాత గుండెపోటుతో ఆయన చనిపోవటానికి వారం ముందే యూపీలోని ఒక కోర్టు ఆయనపై విష ప్రయోగం జరిగిందన్న ఆరోపణలపై బాండాలోని జైలు అధికారుల నుంచి ఒక నివేదికను కోరింది. 40 రోజుల వ్యవధిలో రెండు సందర్భాల్లో తన ఆహారంలో విషం కలిపారని ముఖ్తార్ అన్సారీ ఆరోపించారు. ఈ ఆరోపణల పైనే న్యాయస్థానం పైవిధంగా స్పందించింది.

ఈ విషయంలో అన్సారీ ఈ నెల 21న న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై బారాబంకి ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు ప్రత్యేక జడ్జి కమల్ కాంత్ శ్రీవాస్తవ వాదనలు విన్నారు. విష ప్రయోగం జరిగిందన్న ఆరోపణల విషయంలో అన్సారీ ఆరోగ్యం, భద్రత గురించి ఒక నివేదిక సమర్పించాలని జైలు సూపరింటెండెంట్‌ను ప్రత్యేక జడ్జి ఆదేశించారు. మార్చి 29 లోగా దానిని సమర్పించాలని తెలిపినట్టు ఆర్డర్ కాపీలో ఉన్నది. అయితే, ఈ లోగానే అన్సారీ చనిపోవటం గమనార్హం.మార్చి 19న జైలులో తనకు అందించిన ఆహారంలో విష ప్రయోగం జరిగిందనీ, దాని కారణంగానే తాను అనారోగ్యానికి గురయ్యానని తన అప్లికేషన్‌లో అన్సారీ పేర్కొన్నాడు. ఈ ఘటనకు దాదాపు 40 రోజుల ముందు తన ఆహారంలో స్లో పాయిజన్ కలిపారని కూడా అన్సారీ ఆరోపించాడు. ఈ మొత్తం తతంగంపై, తనకు అందిన మొత్తం చికిత్స విషయంలో మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలనీ, తన భద్రత కోసం తగిన ఆదేశాలనూ జారీ చేయాలని కోర్టును ఆ సమయంలో అన్సారీ కోరాడు. జైలులో తన జీవితానికి ముప్పు పెరిగిందనీ, తనకు ఏ సమయంలోనైనా ఏదైనా జరగొచ్చని కూడా ఆయన ఆరోపించాడు. తనకు జరిగిన విషప్రయోగం 'పెద్ద కుట్రలో' భాగమని ఆందోళన వ్యక్తం చేశాడు.

ఈ విధంగా అప్లికేషన్‌లో అన్సారీ చేసిన తీవ్ర ఆరోపణలపై స్పందించిన జడ్జి శ్రీవాస్తవ.. అన్సారీకి తగిన, సరైన వైద్య పరీక్షలు, సౌకర్యాలు అందించాలంటూ బాందా జిల్లా జైలు సూపరింటెండెంట్‌కు కీలక ఆదేశాలు జారీ చేసినట్టు జైలు మ్యాన్యువల్‌ను బట్టి తెలుస్తున్నది.

జైలులో తన తండ్రిని చంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్సారీ కుమారుడు ఉమర్ అన్సారీ సైతం గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తన తండ్రి చనిపోయిన తర్వాత కూడా ఆయన ఇవే ఆరోపణలను పునరుద్ఘాటించారు. కాగా, అన్సారీ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని భీం ఆర్మీ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ డిమాండ్ చేశారు. విషప్రయోగంపై తీవ్రమైన ఆరోపణలు చేసినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రమూ పట్టించుకోవటం ఖండించదగినదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2017లో యూపీలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యోగి ప్రభుత్వం అన్సారీని టార్గెట్‌గా చేసుకుంటూ వచ్చిందనీ, ఇప్పుడు అన్సారీ ఈ స్థితిలో హటాత్తుగా మరణించటం అనేక అనుమానాలను కలిగిస్తున్నదని పలువురు రాజకీయ నాయకులు అంటున్నారు.

మొన్న జర్మనీ...నిన్న అమెరికా...నేడు ఐరాస

(మొదటిపేజి తరువాయి)

మేము ఆశిస్తున్నాము. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరుకుంటున్నాము' అని చెప్పారు.

కేజ్రీవాల్ అరెస్టుపై అమెరికా ఇంతకుముందే స్పందించింది. స్వేచ్ఛగా, పారదర్శకంగా, సకాలంలో చట్టపరమైన ప్రక్రియలు జరగాలని తాను భావిస్తున్నట్లు తెలిపింది. తన బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారని, దీంతో ఎన్నికల ప్రచారం నిర్వహించడం సవాలుగా మారిందని కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణల గురించి కూడా తమకు తెలుసునని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యానించారు. అయితే మిల్లర్ వ్యాఖ్యలు అవాంఛనీయమని భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. మన ప్రజాస్వామ్య, చట్టపరమైన ప్రక్రియలలో విదేశీ ఆరోపణలు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కావని ఆయన చెప్పారు.

కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ కూడా స్పందించింది. కేజ్రీ అరెస్టు గురించి తెలిసిందని జర్మనీ విదేశాంగ శాఖ తెలిపింది. 'న్యాయ వ్యవస్థ స్వతంత్రత, మౌలిక ప్రజాస్వామిక సూత్రాలకు సంబంధించిన ప్రమాణాలు ఈ కేసుకు కూడా వర్తిస్తాయని మేము భావిస్తున్నాం' అని పేర్కొంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇతర వ్యక్తుల మాదిరిగానే కేజ్రీవాల్ కూడా నిష్పాక్షిక, స్వేచ్ఛాయత విచారణకు అర్హుడని వ్యాఖ్యానించింది. కాగా అమెరికా, జర్మనీ దౌత్యవేత్తల ను తన కార్యాలయానికి పిలిపించిన విదేశాంగ శాఖ ఆయా దేశాల స్పందనపై నిరసన తెలియజేసింది.

కేసీఆర్ పాపాలే ఆయనకు చుట్టుకున్నాయి

(మొదటిపేజి తరువాయి)

పేరును మార్చడమే కేసీఆర్ చేసిన మొదటి తప్పు. అక్కడ కూడా అవినీతి జరిగింది. ఎన్నికల తర్వాత విచారణ చేపడతాం. యాదాద్రి పేరును మళ్లీ యాదగిరిగుట్టగా మారుస్తాం. ఆయన చేసిన పాపాల వల్ల కరువు వచ్చింది. వర్షం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వర్షం. దేవుడి పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి సర్వనాశనం చేశారని' విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో ఒక్కరూ మిగలరని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా వారి కోసం పనిచేస్తానని అన్నారు. టికెట్ల విషయంలో కలుగుజేసుకోనని చెప్పారు. గేట్లు తెరవకముందే కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నేతలు వస్తున్నారని వివరించారు. కేసీఆరే పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని చెప్పారు. నల్లగొండ జిల్లాను ఆయన నాశనం చేశారని విమర్శించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అక్కడికి వస్తారని ప్రశ్నించారు. అధికారులతో పాపపు పనులు చేయించారనీ, దీంతో వారిప్పుడు భయంతో నిద్రపోవడం లేదన్నారు. 'ఫోన్ ట్యాపింగ్ అనేది ఏ రాష్ట్రంలోనూ చూడలేదు. కేసీఆర్ ప్రతిదీ రాజకీయం చేశారు' అని అభిప్రాయపడ్డారు. సీఎంఆర్ఎఫ్, దళితబంధు పథకాల మంజూరుకోసం కమిషన్లు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. కేకే సాధారణ వ్యక్తి కాదు, దశాబ్దాల రాజకీయ అనుభవం ఆయన సొంతమని చెప్పారు. ఆయన చివరివరకు కాంగ్రెస్‌లో కొనసాగుతారని వివరించారు. అధికారం పోయేసరికి కేసీఆర్ కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోతున్నారని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారని చెప్పారు. కేసీఆర్ అవినీతి అంతా తీయాలంటే మాకు 20 ఏండ్లు పట్టేలా ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాత్రమే పోటీ అని చెప్పారు. చిన్న చిన్న మనస్పర్థలు ప్రతి కుటుంబంలో ఉంటాయన్నారు. రాజగోపాల్‌రెడ్డి కాని, నేను గాని టికెట్ అడుగలేదన్నారు. హైదరాబాద్‌కు కళ ఓఆర్ఆర్ అని, అది కట్టింది వైఎస్సారని గుర్తు చేశారు. హాలీవుడ్ లాంటి స్టూడియో పెట్టి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని చూస్తున్నామన్నారు. కాంగ్రెస్‌లోకి ఇంద్రకరణ్‌రెడ్డి వస్తున్నారని చెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో సీఎం, మినిష్టర్, అందరూ ఒక్కటేనని వివరించారు. కవిత మద్యం కుంభకోణం, ఫోన్‌ట్యాపింగ్‌తో కేసీఆర్ కుటుంబం భారీ అవినీతికి పాల్పడిందన్నారు. ఈ కేసు రుజువైతే కేటీఆర్‌కు పదేండ్లు శిక్షపడుతుందని చెప్పారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఎంపీకి పోటీ కష్టమని అధిష్టానం అంటున్నదని చెప్పారు. రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటున్నదన్నారు. పదేండ్ల తర్వాత పేద ప్రజల్లో మళ్లీ చిరునవ్వును చూస్తున్నామన్నారు. ఉద్యోగాల భర్తీ పట్ల నిరుద్యోగులు చాలా సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. కరువు వచ్చింది కేసీఆర్ పాలనలోననీ, కాంగ్రెస్‌పై బురదచల్లడం కేసీఆర్ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. కేసీఆర్ చేసిన అప్పులతో ఆర్థికంగా, ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇబ్బంది కాకుండా పాలిస్తామన్నారు.

సీ-విజిల్ ద్వారా 79 వేల ఫిర్యాదులు : సీఈసీ

(మొదటిపేజి తరువాయి)

పరిష్కరించినట్లు వివరించింది. మొత్తం అందిన ఫిర్యాదుల్లో 73% (58,500 ఫిర్యాదులు) అక్రమ హోర్డింగులు, బ్యానర్లకు సంబంధించిన వేనని సీఈసీ తెలిపింది. డబ్బు, బహుమతులు, మద్యం పంపిణీకి సంబంధించి 1,400 ఫిర్యాదులు అందాయని చెప్పింది. ఆస్తులకు నష్టం కలిగించారన్న ఆరోపణలపై ఈసీకి 2,454 (3%) ఫిర్యాదులు అందాయి. ఆయుధాలు ధరించడం, భయపెట్టడం వంటి ఉదంతాలకు సంబంధించి 535 ఫిర్యాదులు అందగా వాటిలో 529 ఫిర్యాదులను పరిష్కరించారు. గడువు ముగిసిన తర్వాత ప్రచారం చేశారని, లౌడ్ స్పీకర్లను ఉపయోగించారని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు వెయ్యి ఫిర్యాదులు వచ్చాయి.

92.68 శాతం రైతుబంధు చెల్లింపులు పూర్తి

(మొదటిపేజి తరువాయి)

జమ చేశామని వ్యవసాయ శాఖ ప్రకటించింది. 5 ఎకరాలలోపు భూములున్న రైతులందరికీ రైతు బంధు చెల్లింపులు పూర్తయ్యాయి. దీనితో 1 కోటి 11 లక్షల 49 వేల 534 ఎకరాలకు యాసంగి సీజన్ రైతు బంధు సాయం అందింది. ఇప్పటివరకు జరిగిన చెల్లింపుల ప్రకారం ఒక ఎకరం లోపు ఉన్న రైతులు 22,24,870 మంది కాగా, రెండెకరాల లోపు ఉన్న రైతులు 17,72,675 మంది ఉన్నారు. మూడెకరాల లోపు రైతులు 11,30,788 మంది కాగా, నాలుగెకరాల లోపు 6,54,419 రైతులు, అయిదెకరాల లోపు 4,92,568 మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు నిధులు జమ అయినట్టు వ్యవసాయ శాఖ వెల్లడించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే దాదాపు 80 శాతం మంది రైతులకు రైతు బంధు చెల్లింపులు జరిగాయి. ఒక ఎకరం నుంచి మొదలుపెట్టి రెండు, మూడు ఎకరాల వరకు చెల్లింపులు చేసిన ప్రభుత్వం.. మార్చి నెలలో అయిదెకరాల వరకు భూములున్న రైతులందరికీ ఆర్థిక సాయాన్ని అందజేసింది. గత ప్రభుత్వం వద్ద ఉన్న వివరాల ప్రకారమే యాసంగి రైతు బంధు చెల్లింపులు చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే గత ప్రభుత్వం ఇచ్చినట్టు గుట్టలు, కొండలు, రోడ్లు, వెంచర్ వేసిన భూములకు రైతు బంధు ఇచ్చేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా, అర్హులైన వారికే లబ్ధి చేకూర్చాలని ఆయన వ్యవసాయ శాఖను ఆదేశించారు. త్వరలోనే రైతు భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. అయితే పార్లమెంటు ఎన్నికల తర్వాత దీన్ని అమలు చేయనున్నారు.

యాసంగి రైతుబంధు లెక్క ఇదీ... (రూ.కోట్లలో)

వర్గీకరణ	రైతుల సంఖ్య	ఎకరాలు	చెల్లించిన సొమ్ము
1 ఎకరం వరకు	24,24,870	13,57,610	678.80
2 ఎకరాల వరకు	17,72,675	26,58,305	1,329.15
3 ఎకరాల వరకు	11,30,788	27,36,406	1,368.20
4 ఎకరాల వరకు	6,54,419	22,93,754	1,146.88
5 ఎకరాల వరకు	4,92,568	21,03,459	1,051.73
మొత్తం	64,75,320	1,11,49,534	5,575

దేశ ఆర్థిక వ్యవస్థపై అమెరికన్ల అసంతృప్తి

వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన గణాంకాలన్నీ బాగున్నాయని అక్కడి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. అమెరికన్లు మాత్రం తమ దేశ ఆర్థిక వ్యవస్థపై అసంతృప్తిగానే ఉన్నారు. తమ ప్రజలు ఆర్థిక వ్యవస్థపై అసంతృప్తిగా ఉండటానికి అమెరికా ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌తో సహా మాజీ అధ్యక్షులు బారక్ ఒబామా, బిల్ క్లింటన్‌లు ఒక వివరణ ఇచ్చారు. న్యూయార్క్‌లోని రేడియో సిటీ మ్యూజిక్ హాల్‌లో నిధుల సేకరణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంరక్షణ వ్యయం, ఆశించిన దానికన్నా మెరుగైన రీతిలో జీడిపి పెరుగుతున్నా ఆర్థికాందోళనలు తలెత్తడానికి గల కారణాలను వారు వివరించడానికి ప్రయత్నించారు. యూనియన్లను అణచివేయడంతో సహా ప్రజలను ఇంతలా విసిగిస్తున్నవి వ్యవస్థాగత సమస్యలని ఒబామా పేర్కొన్నారు. అలాగే అధిక ద్రవ్యోల్బణంతో అమెరికన్ వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 'మీరు బాగా కష్టపడుతున్నారు, మీ వేతనాలు పెరుగుతున్నాయి, అయినా మీరు అద్దె కట్టడం గురించి, గ్యాస్ ధరల గురించి ఆందోళన చెందుతున్నారు అంటే అర్థం చేసుకోవాల్సిన అంశమే' అని ఒబామా పేర్కొన్నారు.

ఫైనల్లో బోపన్న జోడీ

● మియామి ఓపెన్ టెన్నిస్


సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జోడీ

మియామి (అమెరికా) : భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న మియామి ఓపెన్‌లో టైటిల్ పోరుకు చేరుకున్నాడు. ఆస్ట్రేలియా భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ జతగా పురుషుల డబుల్స్ విభాగంలో ఫైనల్లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత బోపన్న జోడీ.. సెమీఫైనల్లో 6-1, 6-4తో వరుస సెట్లలో మార్సెల్ (స్పెయిన్), జెబాలోస్ (అర్జెంటీనా)పై గెలుపొందారు. బోపన్న, ఎబ్డెన్‌లు రెండు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో ప్రత్యర్థిపై ఎదురులేని ఆధిపత్యం చెలాయించారు. ప్రత్యర్థికి ఒక్క బ్రేక్ పాయింట్ సైతం ఇవ్వని బోపన్న జోడీ.. టైటిల్ పోరులో ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. మెన్స్ డబుల్స్ టైటిల్ కోసం బోపన్న జోడీతో ఆస్టిన్, డొడిగ్ తలపడనున్నారు.

ఆ కోచ్‌ది మిలిటెంట్ పద్ధతి!

● చంద్రకాంత్‌పై డెవిడ్ వైస్ విమర్శ


నైట్‌రైడర్స్ కోచ్ చంద్రకాంత్‌తో రసెల్


బెంగళూర్ : కోల్‌కత నైట్‌రైడర్స్ చీఫ్ కోచ్ చంద్రకాంత్ పండిట్‌పై ఆ ఫ్రాంచైజీ మాజీ క్రికెటర్ డెవిడ్ వైస్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 'హిట్‌మ్యాన్ ఫర్ ఫైర్ : ఏ ఇయర్ ఇన్ ది లైఫ్ ఆఫ్ ఏ ఫ్రాంచైజీ క్రికెటర్' పాడ్‌కాస్ట్‌లో డెవిడ్ వైస్ మాట్లాడుతూ.. ' హెడ్ కోచ్ చంద్రకాంత్ పండిట్ పద్ధతులు మిలిటెంట్ తరహాలో ఉంటాయని అన్నాడు. డెవిడ్ వైస్ వ్యాఖ్యలపై నైట్‌రైడర్స్ విదేశీ ఆటగాళ్లు విభేదించారు. వైస్ అభిప్రాయంతో స్టార్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ విభేదించాడు. ' ప్రొఫెషనల్ క్రికెటర్‌గా కొత్త కోచ్‌తో పని చేసినప్పుడు వారి పద్ధతులకు అలవాటు పడటం నేర్చుకోవాలి. కచ్చితంగా కొన్ని రూల్స్ ఉంటాయి. ప్రొఫెషనల్ క్రికెటర్లుగా అవి పాటించాల్సి ఉంటుంది. ఆ అంశాలపై ఫిర్యాదు చేయలేం. కష్టపడి ఫ్రాంచైజీ విజయంలో భాగస్వామ్యం కావాలి. చంద్రకాంత్ పండిట్ అమోఘమైన కోచ్. గౌతమ్ గంభీర్ సైతం రావటంతో డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం బాగుంది' అని రసెల్ తెలిపాడు. 2013 ఐపీఎల్‌లో నిరాశపరిచిన రసెల్ ఈ సీజన్లో ఇరగదీస్తున్నాడు. బ్యాటింగ్‌లో మార్పునకు ఆలోచన ధోరణిలో మార్పు కీలకమని రసెల్ తెలిపాడు. 'ఐపీఎల్ 2023లో నా మైండ్‌సెట్ బాలేదు. నేను ఎక్కువగా వైఫల్యం గురించి ఆలోచన చేశాను. నేను అవుట్ కాకూడదనే ఆలోచన నెగెటివ్. జట్టులో నా పాత్రకు ఎక్కువగా బంతులు ఆడలేను. టాప్ ఆర్డర్ బ్యాటర్ల తరహాలో బ్యాటింగ్ ఆశించకూడదు. నేను ఎన్ని ఎక్కువ షాట్లు ఆడితే.. బౌలర్లు అంత భయపడతారు' అని రసెల్ వ్యాఖ్యానించాడు.

నైట్‌రైడర్స్ అలవోకగా..

- ఆర్సీబీపై కోల్‌కత ఘన విజయం
- ఛేదనలో నరైన్, వెంకటేశ్ జోరు
- బెంగళూర్ 182/6, కోల్‌కత 186/3

నవతెలంగాణ-బెంగళూర్

ఐపీఎల్17లో ఆతిథ్య జట్ల ఆధిపత్యానికి చెక్ పడింది. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై కోల్‌కత నైట్‌రైడర్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 183 పరుగుల ఛేదనలో పించ్ హిట్టర్ సునీల్ నరైన్ (47, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు), వెంకటేశ్ అయ్యర్ (50, 30 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (39 నాటౌట్, 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా ఫిల్ సాల్ట్ (30, 20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ మోత మోగించారు. దీంతో 16.5 ఓవర్లలోనే కోల్‌కత నైట్‌రైడర్స్ లాంఛనం ముగించింది. సీజన్లో వరుసగా రెండో మ్యాచ్‌లో విజయం సాధించింది. అంతకుముందు, విరాట్ కోహ్లి (83 నాటౌట్, 59 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఐపీఎల్‌లో 52వ అర్థ సెంచరీతో మెరువగా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. దినేశ్ కార్తీక్ (20), కామెరూన్ గ్రీన్ (33), గ్లెన్ మాక్స్‌వెల్ (28) రాణించారు. బెంగళూర్‌కు ఇది రెండో పరాజయం.



కదం తొక్కిన కోహ్లి : చిన్నస్వామి స్టేడియంలో టాస్ నెగ్గిన కోల్‌కత నైట్‌రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ డుప్లెసిస్ (8) నిరాశపరచటంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు మరోసారి శుభారంభం దక్కలేదు. ఓ సిక్సర్‌తో జోరందుకున్న డుప్లెసిస్.. రానాకు వికెట్ కోల్పోయాడు. కామెరూన్ గ్రీన్ (33), విరాట్ కోహ్లి (83 నాటౌట్) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. గ్రీన్ వచ్చీ రాగానే విరుచుకుపడ్డాడు. సునీల్ నరైన్‌పై బౌండరీలు బాదాడు. 2 సిక్సర్లు, నాలుగు బౌండరీలతో ప్రమాదరకంగా మారాడు. కోహ్లి, గ్రీన్ 65 పరుగుల భాగస్వామ్యానికి రసెల్ తెరదించాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (28) మంచి ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేదు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో కుదురుకున్నట్టే కనిపించిన మాక్స్‌వెల్.. నరైల్ వలకు చిక్కాడు. మరో ఎండ్‌లో ఓపిగ్గా పరుగుల వేట సాగించిన విరాట్ కోహ్లి రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 36 బంతుల్లో అర్థ సెంచరీ పూర్తి చేశాడు. రజత్ పటీదార్ (3), అనుజ్ రావత్ (3) నిరాశపరిచారు. ఆఖర్లో క్రీజులోకి వచ్చిన దినేశ్ కార్తీక్ (20) రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు కాస్త మెరుగైన స్కోరు అందించాడు. మూడు సిక్సర్లతో చెలరేగిన కార్తీక్.. ఆఖర్లో సంతృప్తికర ముగింపు అందించాడు. విరాట్ కోహ్లి ఆఖరు వరకు క్రీజులోకి నిలిచినా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ భారీ స్కోరు సాధించటంలో విఫలమైంది.



సెమీస్‌లో సిక్కి, సుమిత్

క్వార్టర్స్‌లో సింధుకు ఓటమి
మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్

మాడ్రిడ్ (స్పెయిన్) : మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు టోర్నీ నుంచి నిష్క్రమించగా, సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జంట సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ సింధు 26-24, 17-21, 20-22తో థాయ్‌లాండ్ షట్లర్ సుపనిదతో మూడు గేముల హోరాహోరీ మ్యాచ్‌లో పరాజయం పాలైంది. సుమారు గంటన్నర పాటు సాగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో తొలి, చివరి గేములు టైబ్రేకర్‌లో తేలాయి. తొలి గేమ్‌ను సింధు 26-24తో సొంతం చేసుకోగా.. రెండో గేమ్‌లో సుపనిద 21-17తో పైచేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రథమార్థంలో సింధు ముందంజ వేసింది. 11-9తో విరామ సమయానికి ఆధిక్యం నిలుపుకుంది. కానీ ద్వితీయార్థంలో సుపనిద పుంజుకుంది. వరుస పాయింట్లతో ఆధిక్యం సాధించింది. 15-20 నుంచి వరుసగా మ్యాచ్ పాయింట్ కాచుకున్న సింధు 20-20తో స్కోరు సమం చేసింది. ఇక్కడ సుపనిద వరుసగా రెండు పాయింట్లు సాధించి సింధు పోరాటానికి తెరదించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జంట సెమీఫైనల్లోకి ప్రవేశించింది. క్వార్టర్‌ఫైనల్లో సిక్కి రెడ్డి జోడీ 14-21, 21-11, 21-17తో నాల్గో సీడ్ ఇండోనేషియా షట్లర్లపై విజయం సాధించింది. రెహన్, లిసాకు 14-21తో తొలి గేమ్‌ను కోల్పోయిని సిక్కి, సుమిత్‌లు తర్వాత వరుస గేముల్లో పుంజుకున్నారు. 41 నిమిషాల్లోనే క్వార్టర్స్ పోరును ముగించిన మనోళ్లు 21-11, 21-17తో లాంఛనం ముగించారు. నేడు సెమీఫైనల్లో ఆరో సీడ్ ఇండోనేషియా షట్లర్లు రినోవ్, పిటాతో సిక్కి రెడ్డి, సుమిత్ రెడ్డి జంట పోటీపడనుంది. ఇక మహిళల డబుల్స్ విభాగంలో మూడో సీడ్ తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్పలు నిరాశపరిచారు. క్వార్టర్‌ఫైనల్లో ఆరో సీడ్ చైనీస్ తైపీ జోడీ చేతిలో 13-21, 19-21తో వరుస గేముల్లో ఓటమి చెందారు.

రాహుల్‌కు సవాల్!

- తొలి విజయంపై లక్నో గురి
- నేడు సూపర్‌జెయింట్స్‌తో కింగ్స్ ఢీ



సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కెఎల్ రాహుల్

లక్నో (ఉత్తరప్రదేశ్) : పంజాబ్ కింగ్స్ సీజన్ తొలి రెండు మ్యాచుల్లో ఓ గెలుపు, ఓ ఓటమి. లక్నో సూపర్‌జెయింట్స్ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో ఓటమి. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం. చివరగా ఐపీఎల్‌లో ఈ రెండు జట్లు తలపడినప్పుడు మొహాలిలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. లక్నో సూపర్‌జెయింట్స్ సొంత గడ్డ ఎకానె స్టేడియంలో నేడు ఆ జట్టు తొలి మ్యాచ్ ఆడనుంది. ఐపీఎల్17లో తొలి తొమ్మిది మ్యాచుల్లో ఆతిథ్య జట్టునే విజయం వరించింది. సొంతగడ్డ అనుకూలతతో లక్నో సూపర్‌జెయింట్స్ తొలి విజయంపై గురి పెట్టగా.. పంజాబ్ కింగ్స్ రెండో విజయంపై కన్నేసి బరిలోకి దిగుతోంది.

రాహుల్‌కు పరీక్ష : లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కెఎల్ రాహుల్ గత సీజన్ నుంచీ ఓ పరీక్ష ఎదుర్కొంటున్నాడు. వికెట్ కాపాడుకుంటూ క్రీజులో కొనసాగినా.. రాహుల్ వేగంగా పరుగులు చేయటం లేదు. టీ20 క్రికెట్‌లో వేగమే ముఖ్యం. ఎన్ని తక్కువ బంతుల్లో ఎన్ని ఎక్కువ పరుగులు చేశామనేది కీలకం. ఇక్కడే రాహుల్ వెనుకంజ వేస్తున్నాడు. జట్టు విజయావకాశాలనూ దెబ్బతీస్తున్నాడని విమర్శలు అంటున్నారు. స్ట్రయికరేట్ అంశంలో రాహుల్ మెరుగుపడాల్సిన అవసరం ఉంది. ఆ జట్టులో క్వింటన్ డికాక్, దేవదత్ పడిక్కల్, ఆయుశ్ బదాని, దీపక్ హుడా ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. నికోలస్ పూరన్ గత మ్యాచ్‌లో మెరిసినా.. మార్కస్ స్టొయినిస్ నిరాశపరిచాడు. రవి బిష్ణోయ్, మోషిన్ ఖాన్, నవీన్ ఉల్ హాక్‌లపై బౌలింగ్ విభాగం ఆధారపడి ంది.


పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లతో శిఖర్ ధావన్

పుంజుకోవాలని : పంజాబ్ కింగ్స్ తొలి రెండు మ్యాచుల్లోనూ మెప్పించినా.. ఒక్క విజయమే సాధించింది. కొత్త ముల్లాపూర్‌లో గెలుపు బాటలో నడిచింది. సీజన్లో రెండోసారి పంజాబ్ కింగ్స్ బయట ఆడనుంది. కెప్టెన్ శిఖర్ ధావన్ రాణిస్తున్నా.. జానీ బెయిర్‌స్టో గతంలో సన్‌రైజర్స్‌కు పోషించిన పాత్ర నిర్వర్తించటం లేదు. ప్రభుసిమ్రన్ సింగ్, లియాం లివింగ్‌స్టోన్‌లపై కింగ్స్ భారీ ఆశలు పెట్టుకుంది. శామ్ కరన్ ఆల్‌రౌండర్‌గా పంజాబ్ కింగ్స్‌కు ఎక్స్ ఫ్యాక్టర్‌గా నిలిచాడు. జితేశ్ శర్మ, శశాంక్ సింగ్‌లు సైతం అంచనాల మేరకు రాణిస్తున్నారు. హర్షల్ పటేల్, కగిసో రబాడ, అర్షదీప్ సింగ్‌లు నేడు లక్నో మ్యాచ్‌లో కీలకం కానున్నారు.

పిచ్ మారింది! : లక్నో ఎకానే స్టేడియం అనగానే స్వల్ప స్కోర్లు గుర్తుకొస్తాయి. గత సీజన్‌లో ఇక్కడే అత్యల్ప స్కోర్లు నమోదయ్యాయి. స్పిన్నర్లకు అనుకూలించే విధంగా సూపర్‌జెయింట్స్ నల్ల మట్టితో తయారు చేసిన పిచ్‌లను ఎంచుకుంది. కానీ ఈ సీజన్‌కు సూపర్‌జెయింట్స్ ప్రణాళికలను మార్చుకుంది. నల్ల మట్టికి బదులుగా ఎర్రమట్టితో పిచ్‌లను సిద్ధం చేయించింది. దీంతో స్పిన్నర్లకు పెద్దగా అనుకూలత ఉండదు. పేసర్లకు మంచి బౌన్స్ లభించే అవకాశం ఉంది.




చరిత్రను తిరగరాసిన లెజెండ్ : బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కలిసి మూడు బ్లాక్ బస్టర్స్ అందించారు. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్, వారాహి చలనచిత్రం బ్యానర్‌లపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట, అనిల్ సుంకర, సాయి కొర్రపాటి నిర్మించిన 'లెజెండ్' వారి సెకండ్ కాంబోలో 'లెజెండ్' 2014 మార్చి 28న విడుదలై, ఆల్ టైం బ్లాక్ బస్టర్‌గా నిలిచి 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మేకర్స్ ఈనెల 30న సెన్సేషనల్ హిట్‌ని రీ-రిలీజ్ చేస్తున్నారు. చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించిన 'లెజెండ్' బ్లాక్ బస్టర్ 10 ఇయర్స్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ,'ఈ వేడుక సినిమా విడుదలకు ముందు జరుపుకునే పండగలాంటి అనుభూతిని ఇస్తుంది. మళ్ళీ వందరోజుల పండగ జరుపుకుంటాం. మంచి ఉద్దేశంతో సినిమాలు తీస్తే తెలుగు ప్రేక్షకులు ఎంతో గొప్పగా ఆదరిస్తారు. వెన్నుతట్టి ఇంకా ఇలాంటి మంచి సినిమాలు చేయాలని ప్రోత్సహిస్తారు. సినిమా రికార్డులు నాకు కొత్త కాదు. రికార్డులు సృష్టించాలన్నా నేనే. వాటిని తిరగరాయాలన్నా నేనే. సౌత్ ఇండియాలో నాలుగు ఆటలతో 1116 రోజులు ఆడి నాలుగు అంకెల రోజులను దాటిన ఏకైక సినిమా లెజెండ్. సినిమా కేవలం వినోదానికే కాదు సినిమా అంటే ఒక బాధ్యత. నా ప్రతి సినిమాలో ఆ బాధ్యత తీసుకుంటాను' అని తెలిపారు.

"లెజెండ్'ని ఇంత పెద్ద హిట్ చేసిన తెలుగు ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. నందమూరి తారకరామారావుకి అంకితం చేస్తూ ఈ సినిమాని మొదలుపెట్టాం. ఆయన ఆశీస్సులతోనే పదేళ్ళ వేడుక జరుపుకుంటున్నాం. ఆ తరానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ ఆ తరానికి లెజెండ్. ఈ తరానికి సినిమా రూపంలో మేం చూపించిన లెజెండ్ బాలయ్య. ఒక లెజెండరీ సినిమా మీ ముందుకు తీసుకొచ్చినందుకు దర్శకుడిగా గర్వపడుతున్నాను. రీ రిలీజ్‌లోనూ ఈ సినిమా కచ్చితంగా సత్తా చాటుతుందనే నమ్మకం ఉంది' అని బోయపాటి శ్రీను చెప్పారు.

మెకానిక్ రాకీగా విశ్వక్‌సేన్


విశ్వక్‌సేన్

హీరో విశ్వక్ సేన్ పుట్టినరోజు శుక్రవారం. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న తన 10వ చిత్రానికి సంబంధించి టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో నిర్మాత రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో విశ్వక్ సేన్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తోంది.

ఈ చిత్రానికి 'మెకానిక్ రాకీ' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. టైటిల్ పోస్టర్‌ని క్రియేటివ్‌గా డిజైన్ చేసారు. కామెడీ,యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘు రామ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మనోజ్ కటసాని, ప్రొడక్షన్ డిజైనర్: క్రాంతి ప్రియం, ఎడిటర్: అన్వర్ అలీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యం రాజేష్, విద్యాసాగర్ జె.

లైలా : రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్

పుట్టినరోజు నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ నటిస్తున్న తన12వ సినిమా అప్‌డేట్స్‌ని కూడా మేకర్స్ ప్రకటించారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోయే ఈ చిత్రంలో విశ్వక్ సేన్‌ను మునుపెన్నడూ చూడని పాత్రలో ప్రెజెంట్ చేయడానికి దర్శకుడు రామ్‌నారాయణ్ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు. విశ్వక్ సేన్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్ర నిర్మాతలు ఆకట్టుకునే పోస్టర్ ద్వారా సినిమా టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ చిత్రానికి 'లైలా' అనే టైటిల్ పెట్టారు. టైటిల్ పోస్టర్ కంప్లీట్ కలర్ ఫుల్‌గా ఉంది. ఈ చిత్రానికి రచయిత: వాసుదేవ మూర్తి, సంగీతం: తనిష్క్ బాగ్చి, సినిమాటోగ్రాఫర్: రిచర్డ్ ప్రసాద్, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: అన్వర్ అలీ.


నవచిత్రం



దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో తన మైనపు బొమ్మతో హీరో అల్లుఅర్జున్ దిగిన ఫొటో వైరలై హల్‌చల్ చేస్తోంది. దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో మైనపు బొమ్మను ఏర్పాటు చేసిన తొలి దక్షిణాది నటుడిగా అల్లుఅర్జున్ అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకోవడం విశేషం.

ఫ్యామిలీ స్టార్

ష్యూర్ షాట్ హిట్ : పరశురామ్ పెట్ల


హీరో విజయ్‌దేవరకొండకు సూచనలిస్తున్న దర్శకుడు పరశురామ్

సకుటుంబ ప్రేక్షకుల్ని మెప్పించేలా సినిమాలు రూపొందించడం కొంత మంది దర్శకులకే సాధ్యమవుతుంది. అలాంటి దర్శకుల్లో డైరెక్టర్ పరశురామ్ పెట్ల ఒకరు. 'సోలో', శ్రీరస్తు శుభమస్తు, గీత గోవిందం' లాంటి కుటుంబ కథా చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్నారు.

విజయ్ దేవరకొండ హీరోగా ఆయన తాజాగా రూపొందించిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'ఫ్యామిలీ స్టార్'. ఈ సినిమా ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై సినిమా మీద మరింత హైప్‌ని క్రియేట్ చేసింది. పరశురామ్ పెట్ల తనదైన హీరో క్యారెక్టరైజేషన్, మేకింగ్ స్టైల్‌ను ఈ సినిమాలో మరోసారి చూపించారు. ఈ సినిమా సక్సెస్ పై సూపర్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారాయన. అందుకే ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో 'ఐ ఫీస్ట్ లాంటి ఈ సినిమాని, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ప్రతి తెలుగు ప్రేక్షకుడు, ప్రతి తెలుగు కుటుంబం కొన్నేళ్ల పాటు గుర్తుంచుకుంటారని చెప్పారు. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఏప్రిల్ 5న ఈ సినిమా రిలీజ్ కానుంది.

ఓటర్ల బాధ్యతని గుర్తు చేసే సినిమా



హీరో నారా రోహిత్ కమ్ బ్యాక్ చిత్రం 'ప్రతినిధి 2'. జర్నలిస్ట్ మూర్తి దేవగుప్తాపు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.

వానరా ఎంటర్‌టైన్‌మెంట్స్, రానా ఆర్ట్స్ బ్యానర్‌లపై కుమార్‌రాజా బత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను చిరంజీవి శుక్రవారం లాంచ్ చేశారు.

హీరో ఒక టీవీ ఛానెల్‌లో పనిచేసే నిజాయితీ గల న్యూస్ రిపోర్టర్. ఒక అగ్ర రాజకీయ నాయకుడు ఇచ్చిన ఇంటర్వ్యూలో, రాష్ట్రం అప్పుల గురించి ఆరా తీయగా, 5 లక్షల కోట్లు సమాధానం ఇస్తాడు నాయకుడు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితే అప్పులు తీరుతాయని రాజకీయ నాయకుడు చెప్పగా.. అప్పుడు హీరో.. రాష్ట్రంలో నిజంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయా? అని ప్రశ్నిస్తాడు. చివరి ఎపిసోడ్‌లో హీరో ప్రజలను ఓట్లు వేయమని, లేకుంటే దేశం విడిచి వెళ్లమని లేదండి సచ్చిపోండి అని హెచ్చరించడం ఆలోచన రేకెత్తిస్తుంది. టీజర్‌లో సచిన్ ఖేడేకర్, రఘు బాబు, జిషు సేన్‌గుప్తా, ఉదయ భాను, అజయ్ గోష్, శ్రీ ఇతర ప్రముఖ పాత్రలను కూడా పరిచయం చేశారు. మూర్తి దేవగుప్తపు తన రైటింగ్, టేకింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇంటర్వ్యూ ఎపిసోడ్ ఓటరు హక్కులు, బాధ్యతల గురించిన చివరి సీక్వెన్స్ అద్భుతంగా ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. ఏప్రిల్‌లో ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది.



రూ.100 కోట్ల వసూళ్ళు ఖాయం

2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు.

భారీ అంచనాలతో 'టిల్లు స్క్వేర్' సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లలో నవ్వులు పూయిస్తూ మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా సంచలన వసూళ్ల దిశగా దూసుకుపోతోంది. ఈ విజయానందంలో చిత్ర బృందం నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ,' 'డీజే టిల్లు' మాదిరిగానే ఈ సినిమాకి థియేటర్లలో మంచి స్పందన లభిస్తుండటం ఆనందం కలిగిస్తోంది. నేను ఊహించినట్టుగా ఈ సినిమా విజయం సాధించింది' అని అన్నారు. 'ఆనందంలో మాటలు కూడా రావడంలేదు. నా పాత్రకు కూడా ప్రశంసలు దక్కుతున్నాయి' అని అనుపమ పరమేశ్వరన్ చెప్పారు.

దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ, సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రేక్షకులు ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు' అని తెలిపారు. 'ఉగాది, రంజాన్ పండగలు, వేసవి సెలవులు ఉండటంతో ఈ సినిమా వంద కోట్ల గ్రాస్ వసూలు చేస్తుందనేని నమ్ముతున్నాను' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు.

ఏప్రిల్ 12న తెలుగులో డియర్ రిలీజ్


ఐశ్వర్య రాజేష్, జి.వి.ప్రకాష్

జి.వి. ప్రకాష్, ఐశ్వర్య రాజేష్ జంటగా నటిస్తున్న కామెడీ ఫ్యామిలీ డ్రామా 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. నట్‌మెగ్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి చెందిన వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదలకు ఒక్కరోజు గ్యాప్ ఉంది. తమిళ వెర్షన్ ఏప్రిల్ 11న విడుదల కానుండగా, తెలుగు వెర్షన్ ఏప్రిల్ 12న విడుదల కానుంది.

ఈ చిత్రానికి సంబంధించి ఆంధ్ర థియేట్రికల్ హక్కులను అన్నపూర్ణ స్టూడియోస్ కొనుగోలు చేయగా, ఏషియన్ సినిమాస్ తెలంగాణ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. హ్యూజ్ థియేట్రికల్ చైన్ బిజినెస్‌లు ఉన్న ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థల బ్యాకింగ్‌తో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో చాలా గ్రాండ్‌గా విడుదల కానుంది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు ఇప్పటికే విశేష ఆదరణ పొంది, సినిమాపై అందరిలోనూ అంచనాలను పెంచాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

- కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ పోరాడేది కేవలం బీజేపీతోనే కాదనీ, ప్రమాదంలో పడిన రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాల్సిన అవసరముందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షి పేర్కొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కిగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ సమావేశమైంది. మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా దీపా దాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విజయం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రచార కమిటీ ప్రతినిధులకు మార్గ నిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన దానికంటే రెట్టింపు ఉత్సాహంతో ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు. ఆయా జిల్లాలో ఉన్న ప్రధానమైన అంశాలను, ప్రభుత్వం చేపట్టే చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకు ముందు మధు యాష్కీ సూచించిన అంశాలను ప్రస్తావిస్తూ నిజామాబాద్‌లో షుగర్ ఫ్యాక్టరీ తిరిగి తెరవటం, పసుపు బోర్డు అంశాలపై ప్రచారం సందర్భంగా ప్రస్తావించి, వాటి పునరుద్ధరణకు ప్రభుత్వం చేపట్టే చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి పవన్, ప్రచార కమిటీ కో కన్వీనర్ తీన్మార్ మల్లన్న, రమ్యారావు, ఆనంద్,వజీర్ ప్రకాష్ గౌడ్, దయాకర్, రవి, రవీందర్, నాగన్న, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కడియంను కలిసిన కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ ముఖ్య నేతలు శుక్రవారం కలిశారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, రోహిత్ చౌదరి, మల్లు రవి, సంపత్‌కుమార్, రోహిన్‌రెడ్డి తదితరులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికి వెళ్లి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీలో చేరాలని వారు ఆయనను ఆహ్వానించారు. కాగా కడియం కూతురు బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కావ్య పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించడంతో కాంగ్రెస్ నేతలు ఆయన నివాసానికి వెళ్లి కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఏఐసీసీ ఆదేశాల మేరకు పార్టీలోకి ఆహ్వానించామని ఈ సందర్భంగా మున్షీ వెల్లడించారు. అయితే కార్యకర్తలు, అభిమానులతో చర్చించి ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని శ్రీహరి చెప్పారు. అలాగే రాజ్య సభ సభ్యులు కేకే, ఆయన కూతురు హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి పార్టీ మార్పుపై చర్చించారు. అనంతరం తాను శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుంటున్నట్టు విజయలక్ష్మి తెలిపారు. కేకే పార్టీ మారుతున్నట్టు స్పష్టమైనప్పటికీ ఎప్పుడు చేరుతారనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది.

'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్'

- క్యాంపెన్ ప్రారంభించిన కేజ్రీవాల్ సతీమణి
- వాట్సాప్ నెంబర్ కు విషెస్ పంపాలని సునీత విజ్ఞప్తి



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీత 'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్' వాట్సాప్ క్యాంపెన్ కు ప్రారంభించారు. అక్రమ కేసులో జైల్లో ఉన్న తన భార్త, ఢిల్లీ సిఎంకు ప్రజలు తమ ఆశీర్వాదాలు పంపాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం సుమారు 3:30 నిమిషాల వీడియోను సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. దేశంలోని అత్యంత నియంతృత్వ అవినీతి శక్తులతో తన భర్త పోరాడుతున్నారని చెప్పారు. ఈ పోరాటంలో కేజ్రీవాల్ కు అండగా నిలవాలని కోరారు. అందుకోసం 8297324624 నెంబర్ కు వాట్సాప్ ద్వారా సందేశాలు పంపాలని కోరారు. శుక్రవారం నుంచే 'కేజ్రీవాల్ కో ఆశీర్వాద్' క్యాంపెన్ ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఆశీర్వాదం, మద్దతు, అభినందనలే కాకుండా... ఇతర ఏ సందేశాలనైనా ఈ వాట్సాప్ నెంబర్ కు పంపవచ్చని తెలిపారు. 'అవినీతి పరులపై పోరాడేందుకు మద్దతు కావాలని కేజ్రీవాల్ కోర్టులో చెప్పారు. 'గత 30 ఏళ్లుగా కేజ్రీవాల్ తో కలిసి జీవిస్తున్నాను. నాభర్త రోమ రోమానా దేశభక్తి ఉంది. దేశంలోని బలమైన నియంతృత్వ, అవినీతి పరులతో ఆయన పోరాడుతున్నారు. ఆయనకు మీ మద్దతు తెలపండి ' అని వీడియో సందేశంలో ప్రజలను కోరారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సిఎం కేజ్రీవాల్ ను ఈ నెల 21 ఇడి అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన ఇడి కస్టడీలో ఉన్నారు.

ఆదిలాబాద్‌ఏ 43.3 డిగ్రీలు

- ఈ ఏడాది ఇదే అత్యధికం
- పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్నాయి. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గరిష్టంగా 43.3 డిగ్రీలు నమోదైంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే అత్యధికం. వచ్చే ఐదురోజులు కూడా రాష్ట్రంలో పొడివాతావరణం ఉంటుందనీ, వడగాల్పులు వీచే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో అన్ని జిల్లాలకూ వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. 14 జిల్లాల్లో 42 డిగ్రీలకుపై రికార్డయ్యాయి. హైదరాబాద్ పరిధిలో మూసాపేటలో అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ ఒకటి, రెండో తేదీల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో శుక్రవారం రాత్రి 10 గంటల వరకు మద్దుట్లలో అత్యధికంగా 66.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 3.5, సూర్యాపేట జిల్లా అనంతగిరిలో 2.8, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ. బయ్యారంలో 2.0 మిల్లీమీటర్ల చొప్పున వాన పడింది.

ఆదిలాబాద్	43.3 డిగ్రీలు
నాంపల్లి(నల్లగొండ)	43.0 డిగ్రీలు
గద్వాల(జోగులాంబ గద్వాల)	42.8 డిగ్రీలు
అర్లి(టి)(ఆదిలాబాద్)	42.8 డిగ్రీలు
మాడ్గులపల్లి(నల్లగొండ)	42.7 డిగ్రీలు
దనోరా(కొమ్రంభీమ్ ఆసిఫాబాద్)	42.7 డిగ్రీలు
కేతిరెడ్డిపల్లి(రంగారెడ్డి)	42.7 డిగ్రీలు
కన్నాయిపల్లి(వనపర్తి)	42.6 డిగ్రీలు
తెల్దేవరపల్లి(నల్లగొండ)	42.6 డిగ్రీలు
మేడ్లవాయి(నల్లగొండ)	42.6 డిగ్రీలు

లైంగిక వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య!

- ఫ్యాకల్టీనే కారణమంటూ కుటుంబీకులకు వాట్సాప్ మెసేజ్
- కొమ్మాది చైతన్య కాలేజీలో ఘటన
- అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు



విశాఖ : విశాఖ నగర శివారు కొమ్మాది వద్దగల చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. తమ కాలేజీ ఫ్యాకల్టీ లైంగిక వేధింపులే తన ఆత్మహత్యకు కారణమని ఆ విద్యార్థిని తన కుటుంబీకులకు వాట్సాప్ మెసేజ్ పంపింది. తన ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడడంతో తీవ్ర మానసిక క్షోభ అనుభవించినట్టు అందులో పేర్కొంది. ఈ ఆత్మహత్య ఘటన విశాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. విద్యార్థిని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన 16 ఏళ్ల విద్యార్థిని కొమ్మాదిలోని చైతన్య ఇంజనీరింగ్ అండ్ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి ఏడాది డిప్లొమో చదువుతోంది. ఆమె ఆత్మహత్య చేసుకునే ముందు తన సెల్‌ఫోన్ నుంచి వాట్సాప్ ద్వారా గురువారం రాత్రి తన తండ్రికి, అక్కకు మెసేజ్ పంపింది. 'నేను సూసైడ్ చేసుకోవడానికి కారణం ఏమిటంటే ఈ కాలేజీలో సెక్సువల్ హెరాస్‌మెంట్ జరుగుతోంది నాన్నా. మరి ఫ్యాకల్టీకి చెప్పొచ్చు కదా అని మీరు అనొచ్చు. కానీ, ఆ ఫ్యాకల్టీయే అందులో ఒకరు అని అంటే ఇంకేం చెప్పగలం. చాలా చండాలంగా బిహేవ్ చేస్తున్నారు. స్టూడెంట్స్‌కి ఫ్యాకల్టీ చెప్పాల్సింది పోయి ఆ ఫ్యాకల్టీయే ఆ స్టూడెంట్స్‌ని ఎంకరేజ్ చేస్తుంటే ఇంక ఎవరికి చెప్పాలి. నా ఫొటోస్ కూడా తీసుకుని బెదిరిస్తున్నారు. నాకు ఒక్కదానికే కాదు ఇంకా కాలేజీలో చాలామంది అమ్మాయిలు ఉన్నారు. ఎవరికీ చెప్పుకోలేక, అలా అని కాలేజ్‌కి వెళ్లలేక మధ్యలో నలిగిపోతున్నాం. పోలీస్ కంప్లైంట్ ఇచ్చినా, ఏం చేసినా మా ఫొటోస్ వెంటనే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తామని బెదిరిస్తున్నారు. నాకు వేరే దారి కనిపించడం లేదు. ఎవరో ఒకరు చస్తేనే ఈ విషయం బయట ప్రపంచానికి తెలుస్తుంది. ఆ పని నేనే చేస్తున్నాను. నీకు మంచి కూతురుని కాలేకపోయినందుకు ఐయామ్ రియల్లీ సారీ నాన్నా' అని ఆ మేసేజ్‌లో ఉంది. దీన్నిబట్టి లైంగిక వేధింపుల కారణంగానే ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు అర్థమవుతోంది. ఆ మెసెజ్‌ను చూసిన వెంటనే విద్యార్థిని కుటుంబసభ్యులు అత్యవసర నెంబర్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పారు. పోలీసులు కాలేజీ హాస్టల్‌కు వచ్చారు. అప్పటికే ఆవరణలో పడి ఉన్న విద్యార్థినిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయినా, ఫలితం లేకపోయింది. సదరు విద్యార్థిని హాస్టల్ నాల్గో అంతస్తు మేడపై నుంచి దూకిందా? లేక విషం ఏదైనా తీసుకుందా? అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మేడపైనుంచి దూకితే కింద రక్తం ఉంటుందని, అలాంటిదేమీ అక్కడ లేదని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థిని మృతదేహం విశాఖ కెజిహెచ్‌లో ఉంది. విద్యార్థి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పిఎం పాలెం పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వాస్తవాలు వెల్లడి కానున్నాయని చెప్పారు. గురువారం రాత్రి విద్యార్థిని తన తండ్రి, అక్కకు పంపిన మెసేజే ఆధారమా? ఇంకా ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అన్నది తెలియాల్సి ఉంది. రెండు రోజులుగా ఆ విద్యార్థిని ముభావంగా ఉంటోందని తోటి విద్యార్థులు చెబుతున్నారు. గురువారం ఉదయం ఆమె కాలేజీకి వెళ్లలేదని, స్టడీ అవర్‌కు హాజరు కాలేదని తెలుస్తోంది. ఉదయం వాష్ రూమ్‌లోకి వెళ్లిన తరువాత నుంచీ ఆమె కనిపించలేదు. దీంతో, తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యం గురువారం రాత్రి సమాచారం ఇచ్చినట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి 12.50 గంటల తర్వాత అమ్మాయి వాష్ రూమ్ నుంచి బయటకొచ్చి నాలుగు అంతస్తుల భవనంపైకి వెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు అయిందని అక్కడి వారు, అర్ధరాత్రి సమయంలో పెద్ద శబ్దం వచ్చిందని, కింద చూస్తే అమ్మాయి పడి ఉందని హాస్టల్ వాచ్‌మ్యాన్ చెబుతున్నారు.

కళాశాల వద్ద విద్యార్థి సంఘాలు, ఐద్వా ఆందోళన

విద్యార్థిని మృతిపై సమగ్రమ విచారణ జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఐద్వా ఆధ్వర్యాన కళాశాల వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఐద్వా మధురవాడ జోన్ నాయకులు భారతి, సిఐటియు నాయకులు రాజ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థిని తన తండ్రికి పంపిన వాట్సాస్ మెసేజ్‌ను మీడియాకు చూపించారు.

ఆత్మగౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటు

- కేకే, కడియం, దానం పదవులకు రాజీనామా చేయాలి
- ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరండి : దాసోజు శ్రవణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీళ్లున్న చెరువులోకి కప్పలు దూకినట్టుగా తమ పార్టీని వీడుతున్నవాళ్లు ఆత్మగౌరవం గురించి మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ విమర్శించారు. కేశవరావు, దానంనాగేదర్, కడియం శ్రీహరి తమ పదవులకు రాజీనామా చేసి పోవాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్ పదవి కచ్చితంగా పోతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మన్నె గోవర్ధన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాపరిషత్ వైస్‌చైర్మెన్ బైండ్ల విజయ్‌కుమార్, నారాయణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌లో ఉండగా ఆత్మగౌరవం దక్కలేదా? అని ప్రశ్నించారు. నాగేందర్‌ను బీడీలు అమ్ముకునేటోడని రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు విమర్శించారనీ, కేసీఆర్, కేటీఆర్, ఇతర నేతలు ఏనాడైనా అంత అధ్వాన్నంగా మాట్లాడారా? అని ప్రశ్నించారు. హెలికాప్టర్‌లో దానంను కేసీఆర్ ఎన్నోసార్లు తీసుకెళ్లారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే హైదరాబాద్‌లో కేసీఆర్‌కు తన ఇల్లు ఇస్తానన్న నాగేందర్ రెండు నెలల్లోపే ఎందుకు మనస్సు మార్చుకున్నారని ప్రశ్నించారు. బీసీల ఆత్మగౌరవం దెబ్బతీసిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పి మళ్లీ అదే పార్టీలోకి ఎలా వెళ్తున్నారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి ఏ సామాజిక న్యాయం పాటిస్తున్నారని అందులో చేరుతున్నావని ప్రశ్నించారు. 2004లో టీడీపీ అభ్యర్థిగా బీజేపీ మద్దతుతో తాను ఎమ్మెల్యేగా గెలిచానన్న విషయాన్ని దానం మరువొద్దన్నారు. అలాంటి వ్యక్తి లౌకికవాదం కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఎక్కువ కష్టాల్లో ఉంది కాబట్టే ఆ పార్టీలోకి వెళ్తున్నానని కేకే చెప్పడం సరిగాదని చెప్పారు. కె.విప్లవకుమార్ మాట్లాడుతూ..తన తండ్రి బీఆర్ఎస్‌ను వీడటం బాధాకరమన్నారు. ఈ వయస్సులో పార్టీ మారి ఏం చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేకే మనస్సు మార్చుకుని బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని కోరారు. పదవుల కోసం కేకే కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాడని తాను అనుకోవడం లేదన్నారు. తన సోదరి బీఆర్ఎస్ ద్వారా వచ్చిన మేయర్ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాలని డిమాండ్ చేశారు. తాను ఎట్టిపరిస్థితుల్లోనూ బీఆర్ఎస్‌ను వీడబోనని స్పష్టం చేశారు. తాను కేకేపై చేస్తున్న విమర్శల వెనుక బీఆర్ఎస్ పెద్దల హస్తం ఉందనే వాదన అర్థరహితమన్నారు. రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణం చేసినపుడు ఫిరాయింపులను ప్రోత్సహించనని చెప్పి ఇపుడు చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించారు.



అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ మోడీ ప్రభుత్వ కుట్ర

- ఆప్ చలో ఢిల్లీ పోస్టర్ విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వం కుట్ర పూరితంగానే అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ విమర్శించారు. కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31 న నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిపక్షాలతో పోరాడే శక్తి లేకనే మోడీ అణచివేతకు పాల్పడుతున్నారని విమర్శించారు. దర్యాప్తు సంస్థల ముసుగులో ప్రతిపక్ష పార్టీలను, మీడియాతో సహా అన్ని సంస్థలను బంధించి నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న దశలో విపక్షాల గొంతును మూయించే ప్రయత్నంలో భాగంగా ఈ చర్యకు పాల్పడ్డారని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను చట్టవిరుద్ధంగా అరెస్టు చేశారని తెలిపారు.

సిరిసిల్ల వస్త్రపరిశ్రమను గట్టెక్కించాలి

- బకాయిలను వెంటనే చెల్లించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ బండి సంజయ్ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సిరిసిల్ల వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కోరారు. శుక్రవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. "సిరిసిల్లలో నాలుగు నెలలుగా యజమానులు, నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి మీకు తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన రూ.270 కోట్లను ఇంతవరకు చెల్లించలేదు. కొత్త ఆర్డర్లు ఇవ్వట్లేదు. దీంతో యజమానులు పరిశ్రమను బంద్ పెట్టారు. ఫలితంగా వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి పనిచేస్తున్న దాదాపు 20 వేల మంది పవర్ లూమ్, అనుబంధ రంగాల(వార్పిన్, సైజింగ్, డైయింగ్..)కార్మికులు పస్తులుంటున్నారు. బకాయిలు చెల్లించి కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని ఆసాములు, కార్మికులు 27 రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయినా, ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరం. వారి డిమాండ్లు న్యాయమైనవే. వెంటనే మీరు స్పందించి సమ్మె విరమింపజేయడంతోపాటు బకాయిలను వెంటనే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలి" అని కోరారు. పవర్‌లూమ్ కార్ఖానాలకు 24 ఏండ్ల నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను ఇప్పుడు నిలిపివేయడంతో రెట్టింపు బిల్లులు వస్తున్నాయని వాపోయారు. ఆసాములు ఆ బిల్లులు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో కోట్లాది రూపాయల విద్యుత్ బకాయిలు పేరుకుపోయిన విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే విద్యుత్ బకాయిలను మాఫీ చేయాలనీ, సబ్సిడీని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు కార్మికులకు ఇవ్వాల్సిన 10 శాతం యార్న్ సబ్సిడీని వెంటనే అందించాలనీ, నేత కార్మికుడిని ఆసామి చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం రూ.370 కోట్ల వ్యయంతో ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకం అర్ధాంతరంగా నిలిచిపోయిందనీ, ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు.

కరువునూ ఆయుధంగా మార్చుకుంటున్న ఇజ్రాయిల్

- ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ హెచ్చరిక

గాజా : గాజాలో తలెత్తుతున్న కరువు కాటకాలన్నీ కృత్రిమమైనవేనని, దీన్నొక ఆయుధంగా మార్చుకోవాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ హెచ్చరించారు. ఇజ్రాయిల్ ఉద్దేశ్యం రుజువైతే ఇది యుద్ధ నేరం కిందకు వస్తుందని హై కమిషనర్ వోల్కర్ టర్క్ అన్నారు. గాజాలో అవసరమైన వారికి ఆహార, సహాయ సరఫరాలు అందకుండా చేసే ప్రయత్నాలతో సహా ఈ యుద్ధంలో ఇరు వర్గాలు తమ చర్యలకు బాధ్యతల నుండి తప్పించుకోలేవని అన్నారు. మానవతా సాయం అందచేయడానికి అనేక అవాంతరాలు, అవరోధాలు, ఆంక్షలు వుంటున్నాయని, వాటన్నింటికీ ఇజ్రాయిల్‌నే నిందించాల్సి వుందని తన సహచరులు చెబుతున్నారని అన్నారు.

కాగా టర్క్ చేసిన వ్యాఖ్యలను, విమర్శలను ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి నీర్ బర్కత్ తీవ్రంగా విమర్శించారు. ఇవన్నీ పూర్తిగా అర్ధరహితమైనవని అన్నారు. పూర్తి బాధ్యతారాహిత్యమైనవని అన్నారు. గాజాలోని పాలస్తీనియన్లకు సాయం అందడం లేదంటే దాన్ని పంపిణీ చేయంలో విఫలమైన క్యరాజ్య సమితిని అనాలి కానీ ఇజ్రాయిల్‌ను కాదని అన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

- కరపత్రం విడుదల చేసిన మాల మహానాడు నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏప్రిల్ రెండు నుంచి ఎనిమిది వరకు రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్రను నిర్వహించనున్నట్టు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు సంబంధిత కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందనీ, దాని ప్రాధాన్యతను ప్రజలకు వివరించటమే పరిరక్షణ యాత్ర ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగరావు, రాష్ట్ర జైభీమ్ సైనిక్ దళ్ కన్వీనర్ అసాది పురుషోత్తం, రాష్ట్ర కో ఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, రాష్ట మహిళా కన్వీనర్ ఇందిరా ప్రియదర్శిని, రాష్ట కార్యదర్శి రెడ్డిమల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి



నవతెలంగాణ -హైదరాబాద్

హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్(హెచ్‌సీఏఏ) అధ్యక్షులుగా అయ్యాడపు రవీందర్‌రెడ్డి విజయం సాధించారు. ఎ.జగన్‌పై 33 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అధ్యక్ష పదవి కోసం రవీందర్‌రెడ్డి, జగన్, ఎం. విజయ్‌కుమార్, చిక్కుడు ప్రభాకర్ పోటీపడ్డ విషయం తెలిసిందే. రవీందర్‌రెడ్డికి 968 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షురాలిగా ఎ. దీప్తి, ప్రధాన కార్యదర్శులుగా శాంతిభూషణ్‌రావు, జిల్లెల సంజీవ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా వాసిరెడ్డి నవీన్ కుమార్, కోశాధికారిగా కట్టా శ్రావ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్.అభిలాష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ (15 ఏండ్లు) శ్రీధర్ కోటగిరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా డీవీ శ్రీకాంత్ సుందరేశన్.జి, గణపతి కొల్లి, మొహమ్మద్ హబీబుద్దీన్ విజయం సాధించారు.

ఉత్తర కొరియాపై ఆంక్షలను ఖండించిన రష్యా

మాస్కో: ఉత్తర కొరియాపై ఐక్యరాజ్యసమితి విధించిన ఆంక్షలను రష్యా ఖండించింది. ఈ ఆంక్షలు కొరియా ద్వీపకల్పంలో శాంతిని పెంపొందించడానికి అడ్డంకిగా ఉన్నాయని రష్యా విమర్శించింది. అలాగే ప్రాంతీయ భద్రతను మెరుగుపరిచేందుకు ఇవి ఏమాత్రం ఉపయుక్తంగా లేవని తెలిపింది. ఉత్తర కొరియా అణు కార్యక్రమంపై విధించిన ఆంక్షలను పర్యవేక్షించేందుకు నిపుణులతో వేసిన కమిటీ పదవీ కాలాన్ని పొడిగించేందుకు భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని గురువారం రష్యా తన వీటో అధికారంతో అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలోనే రష్యా ఈ వ్యాఖ్యలు చేసింది. కొరియా ద్వీపకల్ప ప్రాంతంలో భద్రత పరిస్థితులను మెరుగుపరిచేందుకు గత కొన్ని ఏళ్లగా తీసుకున్న అంతర్జాతీయ నియంత్రణ చర్యలు ఏమాత్రం ఉపయోగపడలేదని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా మీడియాకు తెలిపారు. ఆంక్షల చర్యలను క్రమంగా తగ్గించేందుకు, వాటిని సమీక్షించేందుకు సరైన యంత్రాంగాలు లేనప్పుడు ఇలాంటి చర్యల వల్ల ఏ ఫలితం ఉండబోదని అన్నారు. ఐరాస నిపుణుల కమిటీ పదవీ కాలాన్ని పొడిగించేందుకు రష్యా వ్యతిరేకించడంతో కమిటీ పర్యవేక్షణ నిలిచిపోనుంది. అయితే ఉత్తర కొరియా అణు కార్యక్రమంపై ఆంక్షలు మాత్రం కొనసాగుతాయి.




లోక్‌సభ ఎంపిల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు



న్యూఢిల్లీ : ప్రస్తుత లోక్‌సభలోని 514 మంది సిట్టింగ్ ఎంపీల్లో 225 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ విషయం అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అధ్యయనంలో వెల్లడైంది. గతంలో ఎంపీలు సమర్పించిన అఫిడవిట్లను విశ్లేషించిన ఎడిఆర్ పలు వివరాలతో ఈ నివేదిక విడుదల చేసింది. అలాగే ఈ నివేదిక ప్రకారం.. ఎంపిల్లో 5 శాతం మంది కోటీశ్వరులు ఉన్నారు. వీరి ఒక్కొక్కరి సంపద రూ.100 కోట్లకు పైమాటే. క్రిమినల్ కేసులు నమోదైన వారిలో 29 శాతం మందిపై హత్య, హత్యాయత్నం, మత విద్వేషాలను రెచ్చగొట్టడం, కిడ్నాప్, మహిళలపై నేరాలకు పాల్పడటం లాంటి తీవ్రమైన కేసులు ఉన్నాయి. మొత్తం 9 మందిపై హత్య కేసులు నమోదుకాగా.. వారిలో ఐదుగురు బిజెపికి చెందినవారే. 28 మందిపై హత్యాయత్నం కేసులు నమోదైతే.. వారిలో 21 మంది బిజెపికి చెందినవారే కావడం గమనార్హం. మహిళలపై నేరాలకు సంబంధించి 16 కేసులు, 3 అత్యాచారం కేసులు నమోదయ్యాయి.

అలాగే కోటీశ్వర్లలో ఎక్కువ మంది బిజెపి, కాంగ్రెస్‌లకు చెందినవారే. ధనిక ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన నకుల్‌నాథ్ ప్రథమ స్థానంలో ఉండగా.. తర్వాతి స్థానాల్లో డీకే సురేశ్ (కాంగ్రెస్), కనుమూరు రఘురామ కృష్ణరాజు ఉన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎంపీలపైనే ఎక్కువగా క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఏడీఆర్ విశ్లేషణలో తేలింది. ఆయా రాష్ట్రాల్లో సగానికిపైగా ఎంపీలపై కేసులున్నాయి. ఎంపీల విద్యార్హతలను కూడా ఏడీఆర్ తన నివేదికలో పేర్కొంది. 73శాతం మంది ఎంపీలు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించింది.

సత్యేందర్ జైన్‌పై సిబిఐ దర్యాప్తు



న్యూఢిల్లీ : తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ మంత్రి, ఆప్ నాయకులు సత్యేందర్ జైన్‌పై సిబిఐ దర్యాప్తునకు కేంద్ర హోం శాఖ అనుమతిచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద సిబిఐ దర్యాప్తు కోరుతూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఫిబ్రవరిలో చేసిన సిఫార్సులకు అనుగుణంగా దర్యాప్తునకు అనుమతిచ్చింది. జైల్లో తనకు రక్షణ కల్పిస్తానంటూ మంత్రి సత్యేందర్ జైన్ తన నుంచి బలవంతంగా రూ.10 కోట్లు వసూలుచేశారన్న ఆర్థిక నేరస్థుడు సుకేశ్ చంద్రశేఖర్ ఆరోపణలపై ఈ దర్యాప్తు జరగనుంది. ఈ వ్యవహారంలో జైన్ సహా తీహార్ జైలు మాజీ డీజీ సందీప్ గోయెల్ నిందితులుగా ఉన్నారు. సుకేశ్, సత్యేంద్ర జైన్ ఇద్దరూ ప్రస్తుతం తీహార్ జైల్లోనే ఉన్నారు.